RNI No. APTEL/2003/12253

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

ज्ञान-विज्ञान विमुक्तये
UGC
University Grants Commission
UGC Care List Group - 1
Journal Sl. No 34 under
Arts and Humanities
Category

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

Vol : 19 Issue No. 2 (2) Monthly February (2) 2022 ISSN No. : 2456-4702 Rs. : 15/-



తిక్కవరపు పరిభ రామిరెడ్డి

మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు



BHAVA VEENA (భావ వీణ)

Journal of Arts, Literary, Culture & Language Study

(కళలు - సాహిత్య-సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)

Editor : Kolla Sri Krishnarao
E-mail : parisodhanatelugu@gmail.com

7989781963,
9490847482.
Rohini Towers,
2/11 Brodipet,
GUNTUR-2.

Vol. 19 - Issue. 2 (2) - February 2022 - ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 - Rs. : 15/-

EDITORIAL BOARD

Chief Editor

PITTA SANTHI

M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu),(Ph.D).,

C/o. Dr. Busi Venkataswamy

Holy Homes Apartment, Postal colony ,
4 Th Line,- 522 002, Guntur Dist., A.P. Cell no : 7386529274, 7989781963.

ADVISORY COMMITTEE

1. **Prof. G. Yohan Babu,** M.A., PhD.
   Dept. of Telugu,
   Andhra University, Visakhapatnam.
2. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
   Dept. of Telugu,
   Sri Padmavathi Mahila University,
   Tirupathi.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
   Dept. of Telugu, Faculty of Arts,
   Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
   HOD & Research Guide, Dept. of Telugu
   PAS College, Pedanandipadu.
5. **Thottempudi Sree Ganesh,** M.A., M.Phil (Computational Linguistics) (Ph.D)
   Research Scientist, Centre for Applied Linguistics and Transalation Studies, Universityof Heidelberg, Germany.
6. **Dr. Ponnama Reddy Kumari Neeraja** M.A., Ph.D.
   HOD, Dept. of Telugu,
   Govt. Degree College, Puttur, Chittor Dist.

ASSOCIATE EDITORS

1. **Dr.N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
   Asst. Professor,
   Dept. of Telugu & Comparative Literature,
   Sri Krishna Deva Raya University,
   Ananthapuram, Andhra Pradesh.
2. **Prof. V.SANKARA RAO**, M.A.,M.A.,M.Phil,PhD.
   HOD, Dept. of Telugu,
   Madras University,
   CHENNAI, Tamilnadu.
3. **Dr. D. SESHUBABU**, M.A.,M.Phil,PhD.
   Asst. Professor, Dept.of Hindi,
   Moulana Azad National Urdu University,
   HYDERABAD, Telangana.
4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
   Board of Studies Chairman,
   Telangana University, Dichpally,
   Nizamabad, Telangana.
5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
   Dept. of Telugu & O.L.,
   Acharya Nagarjuna University,
   Nagarjuna Nagar, Guntur District.
6. **Dr. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
   Associate Professor, Dept. of Telugu,
   Kakatiya University, Warangal District.
   Telangana.

7. **Dr. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept.of Modern Indian Languages,
Madhurai Kamaraj University, Madhurai,
Tamilnadu.

8. **Dr. N. Eswar Reddy,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Yogi Vemana University, Kadapa.

9. **Prof. P.R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
Dept. of Telugu,
Regional Institute of Education (NCRT)
Manasa Gangothri, Mysore, Karnataka.

10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Dravidian University, Kuppam, Chittor Dist.

11. **Dr. T.SATYANARAYANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept. of Telugu,
Adikavi Nannaya University,
RAJAMUNDRY, East Godavari, A.P.

12. **Mr. D.ESWARA RAO,** M.A.,
Principal,
P.A.S.College, PEDANANDIPADU-522 235,
Guntur, A.P.

13. **Dr. P. VIJAYA KUMAR**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

14. **Dr. K. RAVI**, M.A., M.Phil,PhD.
HOD, Dept. of Telugu, C.R. Reddy College,
West Godavari District. A.P.

15. **Dr. G. Swarnalatha,** M.A., PhD.
Asst. Proffesor, Dept. of Telugu,
Govt. Women's College (A), Guntur.

16. **Dr. V. Naga Rajyalakshmi,** M.A., PhD.
Rt Principal,Govt .Degree College,
Chebrole , Guntur, A.P.

17. **Dr. Guntupalli Gowri,** M.A., PhD.
Dept. of Telugu,
Govt. College for Women, Guntur - 522 002.

18. **Dr. Kakani Sudhakar,** M.A., M.Phil., PhD.
Dept. of Telugu,
S.S.N. College, Narasaraopet - 522 601.

19. **Dr. K. Pushpamma,** M.A., PhD.
HOD, Dept. of Telugu,
SVRM College,
Nagaram - 522 035.

20. **Dr. P. Srinivasa Rao,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Andhra University, Visakhapathan.

21. **Dr. Ch. Praveen Kumar,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Kakatiya University, Warangal.

22. **Dr. N. Rambabu,** M.A., M.Phil., PhD.
Project Senior Fellow, Dept. of Classical
Literature, Nellore.

23. **Dr. G. Sailamma,** M.A., M.Phil., PhD.
Editorial Assistat,
Centre for Publications Dravidian University,
Kuppam, Chittor Dist.

24. **Dr. M. Sangeetha Rao,** M.A., M.Phil., PhD.
Guest Faculty, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

25. **Dr. M. Prasad,** M.A., M.A.(San)., PhD. Diploma in Maliyalam.
School Assistant (Telugu)
Govt. High School,
Rapuru, SPSR Nellore.

26. **Dr. V. Triveni**
Head & Assistant Professor,
Dept. of Telugu Studies,
Telangana University, Dichpally, Nizamabad.

27. **Dr. Mark Poloneyes,** M.A., M.Phil., PhD.
Principal & HOD,
P.G. Centre, Gadwal,
Palamuru University, Mahabobnagar, Telangana.

LEGALADVISER

Dr. A. GURAVAIAH, ***M.A., L.L.M., PhD.,***
Principal & Research Guide, Dept., of Law, A. C. Law College, GUNTUR - 522 002, A.P.

DTP & PRINTING

TENALI PRAKASH, G.L.S. GRAPHICS, LEMALLE, Guntur. 94 94 660 509.

గమనిక : రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - **ఎడిటర్.**

Edited, Printed, Published and owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet,
GUNTUR - 522 002. Andhra Pradesh. Cell : 7386529274, 7989781963.
E-mail : parisodhanatelugu@gmail.com.Printed at : GLS Enterprises, Kavitha Nagar, Guntur - 522 002. Ph. 94 94 660 509.

తిక్కవరపు పఠాభిరామిరెడ్డి

భావ కవిత్వం మీద పని గట్టుకుని దండయాత్ర చేసిన కవి తిక్కవరపు పఠాభిరామిరెడ్డి. వీరు ప్రముఖ తెలుగుకవి, తెలుగు కన్నడ సినిమాలకు నిర్మాత, దర్శకుడు. పఠాభిగా ప్రసిద్ధుడు. పఠాభి 1919 సంవత్సరం ఫిబ్రవరి 19న నెల్లూరులో రామిరెడ్డి దంపతులకు జన్మించారు. తండ్రి భూస్వామి. స్వాతంత్ర్య పోరాట ఉద్యమాలు ముమ్మరంగా జరుగుతున్న రోజులవి. మహాత్మగాంధీ ఒకసారి పఠాభి ఇంటికి వచ్చారు. గాంధీజీ స్ఫూర్తితో పఠాభి కుటుంబ సభ్యులంతా స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు. రవీంద్రనాథ్ ఠాగూర్ స్ఫూర్తితో పఠాభి శాంతినికేతన్‌లో చదువుకున్నారు. పట్టభద్రుడయ్యాక ఉన్నత విద్య కోసం కలకత్తా విశ్వవిద్యాలయంలో ఆంగ్ల సాహిత్యంలో మాస్టర్స్ డిగ్రీ చదివారు. చదువు పూర్తి అయిన తరువాత కొంతకాలం గూడూరులో కుటుంబ వ్యాపారమైన అభ్రకం ఎగుమతి వ్యాపారం చేశారు. తిరిగి అనతికాలంలోనే అమెరికా కొలంబియా విశ్వవిద్యాలయంలో గణితాన్ని అభ్యసించారు. అమెరికా వెళ్ళకముందే ఫిడేలు రాగాల డజన్ రచించారు. పఠాభి 'ఫిడేల్ రాగాల డజన్' ఆధునిక తెలుగు కవిత్వంలో కొత్త పుంతలు తొక్కింది. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో ఎన్నో కష్టాలకు ఓర్చి భారతదేశం చేరుకున్నారు.

1947 సంవత్సరంలో స్నేహలత పావెల్ అనే మహిళా సామాజిక సేవా కార్యకర్తను ప్రేమించి పెళ్ళి చేసుకున్నారు. దంపతులిద్దరూ ఎమర్జెన్సీ వ్యతిరేక ఉద్యమంలో పాలుపంచుకున్నారు. పఠాభి పీపుల్స్ యూనియన్ ఆఫ్ సివిల్ లిబర్టీస్ వ్యవస్థాపక సభ్యుడు. కొంతకాలం సోషలిస్ట్ పార్టీలో పనిచేశారు. వీరికి ఇద్దరు సంతానం. కుమారుడు కోసార్క్ రెడ్డి ప్రముఖ ఫ్లెమెంకో గిటార్ వాద్యకారుడు. కూతురు నందనారెడ్డి కార్మిక న్యాయవాది. సామాజిక సేవాకార్యకర్త. 1947 సంవత్సరంలో ఫొకస్ అనే ఆంగ్ల వారపత్రికను స్థాపించి రెండున్నర సంవత్సరాల పాటు కొనసాగించి నిలిపవేశారు. ఈ పత్రికకు స్నేహలతా ప్రచురణకర్తగా వ్యవహరించగా టి.పి. ఉన్నికృష్ణన్ సంపాదక బాధ్యతలు నిర్వర్తించాడు.

కె.వి. రెడ్డితో కలిసి జయంతి పిక్చర్స్‌ను స్థాపించి తెలుగు, కన్నడ చిత్రాలకు దర్శకత్వం వహించారు. పఠాభి సినిమాల్లో సంస్కార, చండమారుత, నిమజ్జనం, శృంగారమాస, దేవరకాడు, పెళ్ళినాటి ప్రమాణాలు, శ్రీకృష్ణార్జున యుద్ధం, భాగ్యచక్రం ప్రసిద్ధమైనవి. రచయితగా ఫిడేలు రాగాల డజన్, పఠాభి పన్‌చాంగం, సుప్రసిద్ధమైన రచనలు. తెలుగు సాహిత్యంలో ముంద్రించబడిన తొలి తెలుగు వచనల సంపుటి ఫిడేల్ రాగాల డజన్. భావ కవిత్వంలో ఏవి సున్నితంగా చెప్పుకుంటారో వాటినన్నింటినీ హేళన చేసిన **Anti-Poem** పఠాభి రచన.

ఫిడేల్ రాగాల డజన్‌లో తెలుగు కవిత్వంలో చిరకాలంగా కవితా వస్తువులుగా అలావాటైనా ప్రతి వస్తువునూ, భావాన్నీ, శైలినీ ఆ కవిత్వాంశాలుగా ప్రదర్శించాడు. కవిత్వపు వేషం వేసుకుని అకవిత్వం తిరుగుతున్నపుడు కవిత్వం అకవిత్వపు వేషంలో రావలసి ఉంటుంది. పఠాభి కవిత్వం ఈ కోవకు చెందినదే. సారం నశించిన ఆకారాలు, కాలం చెల్లిపోయినా రాజ్యం చేయకుండా వాటి వికృతిని బయటపెట్టిన విధ్వంసకుడు **Iconoclagt** పఠాభి. పఠాభి 'ఫిడేల్ రాగాల డజన్' తెలుగు కవులైన నారాయణరెడ్డి, దువ్వూరి రామిరెడ్డి మొదలగు కవుల విమర్శలకు లోనైంది.

భావకవులకి అమలిన శృంగారం కాగా, పఠాభిది నూటికి నూరుపాళ్ళు మలిన శృంగారం అనేది విమర్శకుల భావన. భావకవులది సుకుమార శృంగారంకాగా పఠాభిది సుకుమారత లేని మోటు శృంగారం. ఆర్జవం, అనుభూతి, సెంటిమెంట్ మొదలగు పఠాభి కవిత్వంలో వెతికినా కనిపించవు. పఠాభి గారి 'ఫిడేల్ రాగాల డజన్' భావ కవిత్వానికి దహన సంస్కారం చేసింది. "నాయీ వచన ద్యాలన్ దుడ్డు కర్రల్తో పద్యాల నడుముల్ విరగదంతాన" అని పేర్కొన్న పఠాభి 87 ఏళ్ల వయసులో 2006 మే 6వ తేదీన బెంగుళూరులో పరమపదించారు.

- సంపాదకవర్గం

BHAVAVEENA
Vol. 19, Issue. 2 (2), February - 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

Contents (విషయ సూచిక)

1. తెలంగాణ సాహిత్య విమర్శ పూర్వపరాలు	- భుక్యావతు శ్రీలత	5
2. బిరుదురాజు రామరాజు ప్రథమ భాగం - మహిళాయోగులు	- బోయిని రాధ	10
3. అభ్యుదయ కవితావేత్తగా కుందుర్తి	- డా॥. ఎన్. రజని	13
4. ఏకదేశి వ్యాకరణాలు : లఘు సమీక్ష	- డా॥. పులపర్తి శ్రీనివాసరావు	18
5. మలయాళంలో మహాభారతాలు	- డా॥. వి. పళని	21
6. వలస కథల్లో... స్త్రీ పాత్రల చిత్రణ	- దూలం స్వరూప	27
7. మన్నెం శారద వరకట్న సంబంధ కథలు : విశ్లేషణ	- గుబ్బల సత్యశ్రీ	30
8. పెన్నా శివరామకృష్ణ సాహిత్యేతర రచనలు - అధ్యయనం	- ఐ. చిదానందం	36
9. మన వాగ్గేయకారులు	- డా॥. మానమ మునిరత్నం	40
10. చలసాని వసుమతి - మనస్సు- విశ్లేషణ	- గుమ్మడిదల మురళీకృష్ణ	47
11. ఎరుకల సమాజంలో సంస్కృతి	- ఎన్. రాజేష్ కుమార్ రెడ్డి	51
12. 'అముక్తమాల్యద' సౌందర్యం - రాయల భగవతి వర్ణన	- ప్రొ॥. కె. శ్రీదేవి	58
13. శ్రీ శివభారతం - దేశభక్తి	- డా॥. శ్రీపాద సీతామహాలక్ష్మీ సత్యవతీ పేరమాంబ	62
14. కర్నూలు జిల్లా పద్య కావ్యాలు కలుగోట్ల విజయాత్రేయ	- డా॥. జగర్లపూడి శ్యామసుందర శాస్త్రి	66
15. మాసంపత్ కుమార్ 'వ్యక్తిత్వం'	- టి. దేవరాజ్	75
16. The Grouwth of Pharma Enterpreneurship During...	- Dr. Doneti Sivaji, - Dr. Thrinadha Rao Bandaru & - Dr. Seelam Srinivasa Rao	78
17. Dalits Conversion to Christianity...	- S. Swaroop Sirapangi	84
18. State Formation and Identity Consolidation in Manipur	- Dr. Sylvia Yambem	91
19. Symbolismin GithaHariharan's I Have Become the Tide	- Dr. Yashaswini PDr. Naresh Annem	96
20. Impact of Party Owned TV Channels and Voters..	- D. Rajavel & - Dr. V. Ilamparithi	102
21. Semiotics and film languages in selected movies of ...	- Arya M & - Dr S. Rajesh Kumar	107
22. A Child's Reading Abilities in the English Language...	- B.Venkateshwarlu & - K.Saritha	113
23. Yogacharya Sri Raparthi Rama Rao's Contribution to...	- Dr. K. Ramesh Babu	117
24. Dislocation and Yearning for Self Identity...	- Dr. Naresh Annem	124
25. A Comparative Study of Yoga Concepts in Selected ...	- Ch. Saibaba & - Dr. K. Ramesh Babu	128
26. Kalamkari Art : A study of method and Materials	- Muppidi Rambabu, - Chinta Ravi Kumar, - Chatla Vidyanand & - Sreeramdas Dinesh Kumar	134
27. Is Woman Still A Commodity ?: Reflections of Harsh Realities in	- Dr.V.Nirmala	145
28. System of Mood and Realization in English and ...	- Dr. Korra Balu Naik	149

BHAVAVEENA
Vol. 19, Issue. 2 (2), February - 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

తెలంగాణ సాహిత్య విమర్శ పూర్వపరాలు

- భుక్యావతు శ్రీలత

తెలంగాణ పరిశోధకులు, విమర్శకులు తమకు తాము తెలుసుకునే క్రమంలో లోతైన అధ్యయనం చేస్తూ వచ్చారు. దానివల్ల తెలంగాణలో ప్రాచీన సాహిత్యం ఎక్కువగానే ఉన్నదని, ఆధునిక వచన సాహిత్యం కూడా చాలా ముందుగానే ఉనికిలోనికి వచ్చిందనే విషయం వెలుగులోకి వచ్చింది. ఈ సందర్భంలో తెలంగాణ సాహిత్య విమర్శ అనే అంశాన్ని ఎలా చూడాలనే విషయం ప్రస్తావనకు వచ్చినప్పుడు స్థూలంగా విశ్లేషించడానికి మూడు రకాలుగా విభజించడం జరిగింది. అవి :

1. తెలంగాణ సాహిత్య విమర్శకులు చేసిన సాహిత్య విమర్శ
2. తెలంగాణ సాహిత్యంపై వచ్చిన విమర్శ
3. తెలంగాణ అస్థిత్వ కోణంలో వెలువడిన విమర్శ

తెలంగాణలో వెలువడిన సాహిత్యం: అలంకార శాస్త్ర గ్రంథాలు తెలంగాణ నుండి విరివిగా వచ్చాయి. విద్యానాథుడి ప్రతాపరుద్ర యశోభూషణం అలంకార శాస్త్ర గ్రంథాలకు మార్గ నిర్దేశం చేసింది. విశ్వేశ్వరకవి చమత్కార చంద్రిక, సింగభూపాలుని రసార్ణవ సుధాకరం, బడే సాహెబ్‌గా ప్రసిద్ధుడైన అక్బర్‌షా శృంగారమంజరి ఈ ప్రాంతం నుండి వచ్చిన శాస్త్ర గ్రంథాలు. అలాగే మల్లయ రేచన 'కవిజనాశ్రయం' పద్య లక్షణ వివేచన గ్రంథం. తెలుగులో వెలువడిన మొదటి లక్షణ గ్రంథంగా దీనిని చెప్పవచ్చును. ఇవియే కాకుండా నృత్య, స్వరశాస్త్ర గ్రంథాలు అనేకం తెలంగాణ నుండి వెలువడినాయి.

ఆధునిక కాలంలో సురవరం ప్రతాపరెడ్డి, కొమర్రాజు లక్ష్మణరావు, మానపల్లి రామకృష్ణకవి, శేషాద్రి రమణ కవులు, ఆదిరాజువీరభద్రరావు వంటివారు పరిశోధన విమర్శ సాగించారు. శేషాద్రి రమణకవి గొప్ప విమర్శకుడిగా పేరుపొందారు. తొలి తెలంగాణ ఆధునిక విమర్శకుడిగా పేరు పొందింది సురవరం ప్రతాపరెడ్డి. తన కార్యరంగంకు మూలబిందువు గోలకొండ పత్రిక.

శేషాద్రి రమణకవులు 1927లో 'నిజాం రాష్ట్రాంధ్ర కవులు' అనే వ్యాసం రాసిండ్రు. బమ్మెర పోతనను ఓరుగల్లు వాసిగా చూపించేందుకు వీరు చేసిన కృషి మరువరానిది. ఆదిరాజు వీరభద్రరావు, దేవులపల్లి రామానుజరావు నడిపిన 'శోభ' పత్రికలో 'పల్లెపదాలు', 'తాళ పత్రగ్రంథాలు' అనే వ్యాసాలు రాసి విమర్శకు ఓరవడి పెట్టారు. ప్రాచీన ఆధునిక సాహిత్యాలను పరిశీలించి తెలుగు ప్రజల సామాజిక చరిత్రను తెలిపే 'ఆంధ్రుల సాంఘిక చరిత్ర' అనే గ్రంథంను సురవరం ప్రతాపరెడ్డి రాసిండు. ఇది అందరికి ఒక ప్రామాణిక గ్రంథంగా మారింది.దీనికి 1952లో కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు వచ్చింది. ఈయన రాసిన వ్యాసాలు పీఠికలు తెలంగాణ సాహిత్య విమర్శకు విస్తృతిని, కొత్త కోణాలను అందించాయి. బిరుదరాజు రామరాజు, పల్లా దుర్గయ్య, సి.నారాయణరెడ్డి, కె.గోపాలకృష్ణారావు, పి.యశోదరెడ్డి, ముకురాల రామరెడ్డి, ఎల్లూరి శివారెడ్డి తెలుగు విమర్శనా సాహిత్యాన్ని ముందుకు తెచ్చారు. బిరుదురాజు రామరాజు జానపద వాఙ్మయ పరిశోధనకు, విశ్లేషణకు, విమర్శకు ఆద్యుడిగా నిలుస్తారు. 'తెలుగులో జానపద గేయసాహిత్యం' పేర ఆయన గ్రంథం వెలువడింది. రావి ప్రేమలత పురాణగాథలపై వెలువరించారు. ధాశరథి వంటి తెలంగాణ ఆధునిక కవులపై కృష్ణపత్రికలో వ్యాసాలు రాసారు.

'ఆధునికాంధ్ర కవిత్వం - సంప్రదాయములు, ప్రయోగములు' అనే విమర్శనాత్మక గ్రంథంను డా.సి.నారాయణరెడ్డి రాసిండు. కాని ఇందులో విమర్శనా సూత్రాలకు, కొలమానాలకు, భావనలకు తెలంగాణ విమర్శ

కుల దృక్పథంకు కొంత తేడా ఉన్నది. ఈ గ్రంథాన్ని తెలంగాణ సమాజం సొంతంగా భావించాలా? వద్దా? అనే సంశయంలో ఉండినవి. ఇదే సూత్రాలతో వెలువడిన ముదిగంటి సుజాతరెడ్డి రచించిన 'తెలుగు నవలాను శీలనం' అనే గ్రంథం ఉన్నది. ప్రాచ్య, ప్రాశ్చాత్య కథా నిర్మాణ పద్ధతులను,శైలీ శిల్పాలను చేర్చుతూ పి.యశోద రెడ్డి 'కథాచరిత్ర' అనే గ్రంథం రాశారు. ఈమె 'తెలుగులో హరివంశాలు' అనే అంశంపై పరిశోధన చేశారు. పారిజాత అపహరణ పర్యాలోచనం, పోతన భాగవత సుధ, ఎర్రాప్రెగడ వంటి విమర్శనా గ్రంథాలు రాయడం జరి గింది. ప్రబంధ సాహిత్యంపై పల్లా దుర్గయ్య, తెలంగాణ విమోచన ఉద్యమం నవలలపై వరవరరావు పరి శోధనలు చేశారు. వట్టికోట ఆళ్వార్స్వామి రాసిన 'ప్రజల మనిషి', 'గంగు' నవలలతో వాటిని వస్తు శైలీ విషయా లలో తులనాత్మక అధ్యయనం చేయాల్సిన అవసరం ఉన్నది.

'ప్రజాకవి వేమన' పై వచ్చిన పరిశోధన గ్రంథం అమూల్యమైనది దీనిని యన్.గోపి రాయడం జరిగింది. ప్రజాకవి వేమనపై అంతవిస్మమైన, సాధికారకమైన గ్రంథం మరొకటి లేదంటే అతిశయోక్తి కాదు. అనుమాండ్ల భూమయ్య ఆంధ్రపురాణంపై విమర్శ రాసాడు.రవ్వా శ్రీహరి అలబ్ధ పద్యాముక్తావళి సంకలన గ్రంథంలో అజ్ఞాత కవులను గురించి రాశాడు. భాస్కర రామాయణంపై ఆయన చేసిన పరిశోధనలో పరిష్కరణ విమర్శ కలగలసి ఉన్నాయి. ముదిగొండ వీరభద్రయ్య, పెన్నా శివరామకృష్ణ గూడ విరివిగా విమర్శలు రాశారు.

తెలంగాణ కథ, కవిత్వం వెలువడుతున్న దశలోనే విమర్శ కూడా బయలుదేరింది. తెలంగాణ సాహిత్య విమర్శ ముందుగా కొత్త కొలమానాలను అనుసరించాల్సిన విషయాన్ని గుర్తించింది. తెలంగాణ సృజనాత్మక ప్రక్రియలు, ప్రభావాలపైన సామాజిక పరిస్థితుల ప్రతి బింబాలను అది అధ్యయనం చేసింది. ఈ దశలో తెలంగాణ సాహిత్య విమర్శ విరివిగానే వెలవడింది. తెలుగు సాహిత్యంలో తెలంగాణ సాహిత్యంను బేరీజు వేయడం మొదలుపెట్టారు. తొలితరం, మలితరం సాహిత్యవేత్తలను నూతన దృక్కోణం నుండి విశ్లేషించడం మొదలుపెట్టారు. సురవరం ప్రతాపరెడ్డి, పొట్లపల్లి రామా రావు వంటి తొలితరం సాహిత్యకారులను తమ వారసులుగా ప్రకటించుకొనే క్రమం మొదలైనది. తెలం గాణ అస్తిత్వ వేదన నేపథ్యంలో వెలువడిన సాహిత్యాన్ని కొత్త దృక్కోణం నుండి చూసిన విమర్శను ప్రస్తావించ డమే.

పూర్వరంగం - తెలంగాణ తోవలు :

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలంగాణ ఒక ప్రత్యేకమైన భౌగోళిక, చారిత్రక, సామాజిక, సాంస్కృతిక అస్తిత్వంగా ముందుకు వచ్చింది. తెలంగాణ వివక్షణకు అణిచివేతకు అన్యాయనికి గురవుతుందనే భావనతో సాగిన తెలంగాణ సాహిత్య,సాంస్కృతిక ఉద్యమం తెలంగాణ ఆత్మగౌరవ పోరాటంగా ముందుకు వచ్చింది.ఇందుకు పునాదులు వేసింది తెలంగాణ సాంస్కృతిక వేదిక ప్రచురించిన 'తెలంగాణ తోవలు' పుస్తకం. ఇందులో 18మంది తెలం గాణ రచయితల రచనలు ఉన్నాయి. తెలంగాణకు సంబంధించిన అన్ని విషయాలను తవ్వి పోసుకోవాల్సిన అవసరాన్ని గుర్తిస్తూ ఆ పద్ధతికి సూచనలు చేస్తూ ప్రతిపాదనలు చేసింది. తెలంగాణ చరిత్రను తిరిగి రాయడానికి చరిత్రకెక్కని చరిత్రను రికార్డుచేయడానికి కె.శ్రీనివాస్ 'తెలంగాణ సామాజిక చరిత్ర' 'కొన్ని వనరులు' అనే వ్యాసంలో పలు విలువైన సూచనలు చేశారు. సుంకిరెడ్డి నారాయణరెడ్డి రాసిన 'లెక్క తప్పిన తెలుగు సాహిత్య చరిత్ర', కాసుల లింగారెడ్డి రాసిన 'మనం తక్కువేమికాదు' అన్న వ్యాసాలు తెలుగు సాహిత్య చరిత్రను తిరిగి రాయాల్సిన అవసరాన్ని, తెలంగాణ సాహిత్య చరిత్రను పునర్మించవల్సిన అవసరాన్ని తెలుపు తుంది. శ్రీధర్రావు దేశ్పాండే 'కొయ్యబొమ్మల సొరెక్కునా?', కాలువ మల్లయ్య 'నడిగడ్డ తెలంగాణ తాత్విక పరిమళం', గూడ అంజయ్య 'తెలంగాణ బతుకుపాట', కందుకూరి రమేష్బాబు 'కళావంతులు మాట్లాడుతారు', వంటి వ్యాసాలు తెలంగాణ విశిష్టతను

తెలియజేసే వ్యాసాలు కాగా, 'ప్రశ్నించడం కాదు ఆచరణే కీలకం' అని గుడిపాటి రాసిన వ్యాసం తెలంగాణ రచయితలు, మేధావులు చేయాల్సిన కర్తవ్యాన్ని ముందు ఉంచింది.

కోస్తా, తెలంగాణ తెలుగు సాహిత్యాల తులనాత్మక పరిశీలనకు 'వాళ్ళు - మనం', 'మీకు మీరే మాకు మేమే' వంటి వ్యాసాలు పాదులు వేశాయి. ఈ రెండు ప్రాంతాల మధ్య చాలా తేడా ఉందనే విషయాన్ని సూచిస్తూ విమర్శలో కొలమానాలు మారాలని కాసుల ప్రతాపరెడ్డి వివరించారు. తెలుగు సాహిత్యంలో వచ్చిన స్త్రీ, దళిత, ముస్లిం వాదాల సాహిత్యమంతా ఒక్కటి కాదని, ప్రాంతాలను బట్టి భిన్నంగా ఉంటుందని వాటిని తులనాత్మకంగా ప్రతాపరెడ్డి విశ్లేషించారు.నందిని సిద్ధారెడ్డి 'ముంపునకు గురైతున్నది తెలంగాణ భాష', లోకేశ్వర్ 'పచ్చికట్టె పామై కరుస్తుంది' వ్యాసాలు తెలంగాణ భాష ఔన్నత్యాన్ని తెలియజేస్తూ భాషాపరంగా తెలంగాణకు జరుగుతున్న అవమానాన్ని నిరసించారు. తెలంగాణ ముస్లిం సాహిత్యాన్ని 'స్కైబాబా వివరిస్తే', తెలంగాణ రచయితకు దొరికింది తోవ అంటూ అంబటి సురేంద్రరాజు, సురవరం ప్రతాపరెడ్డి మార్గం అనుసరణీయమని చెప్పారు.

తొలి అడుగు-సురవరం ప్రతాపరెడ్డి :

"గోలకొండ కవుల సంచిక" అనంతరం తెలంగాణ సాహితీవేత్తల అస్తిత్వ చింతన ప్రాథమిక రూపాన్ని పొందింది. అయితే ఆంధ్రప్రదేశ్ అవతరణ తర్వాత ఇది బలహీనపడింది అని డా॥ గుమ్మన్నగారి బాల శ్రీనివాస్ మూర్తి అన్నారు. సురవరం ప్రతాపరెడ్డి సమైక్యాంధ్ర వాది. ఆయన గాయపడేంతగా కోస్తా వివక్ష, ఆధిపత్యధోరణి కొనసాగింది. అదే గోల్కొండ కవుల చరిత్రకు ప్రాణం. కోస్తా ప్రాంతం నుండి వెలువడుతున్న కృష్ణా, ఆంధ్ర పత్రికల్లో నిజాం రాష్ట్ర వార్తలు ప్రచురించకపోవడంపై ప్రతాపరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ మీద కోస్తాంధ్ర వివక్షపై నిజామాంధ్ర విషయంలో ఆ ప్రాంతీయులు అనుసరిస్తున్న ఉపేక్ష గురించి అనేక విధాలుగా ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బ్రిటీష్ ఆంధ్ర నుండి వెలువడుతున్న పత్రికల్లో ఒక్క తెలంగాణ ప్రాంత వ్యాసం అచ్చుకాలేదు. ఇదే విషయాన్ని తొలి తరం తెలంగాణ కథా రచయిత గూడూరి సీతారాం "అప్పుడు అందుబాటులో ఉండే పత్రిక ఒక్కటే,అది భారతి. దాంట్లో నిండా వాళ్ల రచనలే. 'స్వతంత్ర్య' అని ఇంకొక పత్రిక వత్తుండే. దానికి రామలక్ష్మి సబ్-ఎడిటర్. దాంట్లో సి.నా.రె కవితలు వచ్చేవి. నా కథ స్వరమౌళి కథలు కూడా వత్తుండే. కాని నారాయణరెడ్డి పంపితేనే వచ్చేవి. మేము పంపితే మాయి మాకు తిరిగి వత్తుండేవి". అని వాపాయారు.

సురవరం ప్రతాపరెడ్డి కాలానికి ఇప్పటి కాలానికీ మధ్య తేడా ఏమి లేదు. అదే వివక్ష, ఆధిపత్య ధోరణి కొనసాగుతుండడాన్ని తెలంగాణ రచయితలు పలు సందర్భాలలో ఆవేదన వ్యక్తం చేశారు. వాసిరెడ్డి నవీన్, పాపినేని శివశంకర్‌ల సంపాదకత్వంలో వెలువడుతున్న కథా వార్షికలపై తెలంగాణ రచయితల్లో తీవ్రమైన అసంతృప్తి నెలకొన్నది. తెలంగాణలో 1970 తరువాత విప్లవ దశతోనే ప్రారంభమైనదనే ధోరణి కూడా బ్రిటీషాంధ్ర సాహిత్యకారులు ప్రభలంగా ప్రచారంలోకి తెచ్చే ప్రయత్నం చేశారు. ఉద్యమాన్ని, ఉద్యమ చైతన్యాన్ని చిత్రించే నవలగా దాశరధి రంగాచార్య రాసిన 'జనపదం' నవలను ఆయన తప్పుడు అన్వయానికి గురి చేశారు. ఈ రకంగా తెలంగాణ సాహిత్యాన్ని అధ్యయనం చేయనీయకుండా తప్పుడు అన్వయాలకు, అభిప్రాయాలకు బ్రిటీషాంధ్ర సాహితీవేత్తలు ముందుకు వచ్చారు.

సాహిత్య కొలమానాలపై చర్చ :

తెలంగాణ సాంస్కృతిక వేదిక తరపున వెలువడిన 'భౌగోళిక సందర్భం' వ్యాస సంకలనం వస్తు విస్తృతి దృష్ట్యా, విశ్లేషణ దృష్ట్యా లోపాలతో కూడుకున్నదే అయినప్పటికి అనేక ప్రశ్నలకు, అందుకు కారణమైన పరిస్థితులకు అద్దం పడుతుంది. తెలుగు సాహిత్యాన్ని తెలంగాణ దృష్టికోణం నుండి పరిశీలించాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతుంది. 'కథ ఇక్కడా వుంది', 'కవిత్వానికి ఎల్లలుంటాయా?', 'కొలమానాలెక్కడవి?' అనే వ్యాసాలు

ఒక కొత్త ఒరవడిని అందించడానికి దోహదం చేశాయి. బి.ఎస్.రాములు తెలుగు కథను తెలంగాణ, బహుజన దృక్కోణం నుండి వెలువరిస్తూ ఒక గ్రంథాన్ని వెలువరించ డానికి ఈ నేపథ్యమంతా పనిచేసింది. తెలుగు కథా సంకలనాల్లో తెలంగాణ కథకు తగిన ప్రాతినిథ్యం లభించ లేదని చెప్పడానికి బి.ఎస్.రాములు లెక్కలు తవ్వితీసి ప్రచురించారు. తెలంగాణ కథకు స్ఫూర్తి ప్రేమ్‌చంద్ అనే విషయాన్ని ఆయన ప్రతిపాదించారు.

కవిత్వ కొలమానాలపై ప్రశ్నలు :

తెలుగు సాహిత్య చరిత్ర నిర్మాణంలో తెలంగాణ కవిత్వానికి జరిగిన అన్యాయాన్ని ప్రశ్నిస్తూనే సాహిత్య చరిత్ర రచనలో తెలంగాణ కవిత్వానికి చోటు దొరకక పోవడంపై విమర్శకులు ప్రశ్నించారు. తెలుగు సాహిత్య, చరిత్ర నిర్మాణంలో అనుసరించాల్సిన కొలమానాలను వారు ప్రశ్నించారు. పెట్టుబడిదారి వ్యవస్థ ఏర్పడిన పాశ్చాత్య దేశాల్లో వచ్చిన ప్రోగ్రెసివ్ రైటర్స్ ప్రభావం రష్యా వంటి కమ్యూనిష్టు ప్రభావిత దేశాల్లో వచ్చిన మార్క్సిస్ట్ దృక్పథం వలన ఆంధ్రప్రాంతంలో అభ్యుదయ కవిత్వం వచ్చింది. కాని దీనికి భిన్నంగా తెలంగాణ ప్రాంత సామాజిక పరిణామ సహజ ఫలితంగా తెలంగాణ అభ్యుదయ కవిత్వం పురుడు పోసుకున్నది. ఇటువంటి నూతన ప్రతిపాదనలు వచ్చాయి. తెలంగాణలోని భాగవతం అనే వీధి నాటిక కళలోని దరువులు ముత్యాల సరాలుగా చెలామణి అయిన తీరును ప్రతి విమర్శకుడు పట్టించు కోవలసిన అవసరం ఉన్నదని కాంచనపల్లి గుర్తు చేశారు. "తెలంగాణ కవిత్వం-సాహిత్య శాసనాలపై తిరుగుబాటు' అని అప్పర్ తెలంగాణ కవిత్వభేరిని వినిపించారు. అర్థం కాదనే నెపంతో తెలంగాణ కవుల భాషను, యాసను వెనక్కి నెట్టే ప్రయత్నం చేశారు.

తెలంగాణ దళితవాదం ఒక వినూత్నరీతిలో ప్రాచుర్యంలోకి వచ్చింది. దళిత దృక్కోణం నుండి ముస్లిం దృక్కోణం నుండి ప్రాచుర్యంలోకి వచ్చిన తెలంగాణ స్త్రీవాదం ఇది. జూపాక సుభద్ర, గోగు శ్యామల, జాజుల గౌరి, షాజహన వంటి కవులు తమ ప్రత్యేక అస్తిత్వాన్ని కాపాడుకునే రచనలు చేశారు. 'పొక్కిలి' కవితా సంక లనంలో దళిత స్త్రీలకు స్థానం దక్కక పోవడంపై గోగు శ్యామల ప్రశ్నించారు.

భాష - విమర్శ :

తెలంగాణ అస్తిత్వ ఉద్యమానికి భాష ఒక సాధనంగా మారింది. భాషలో తెలంగాణ ప్రత్యేకతను చాటే ప్రయత్నం విమర్శకులు చేశారు. భాష పట్ల బ్రిటీషాంధ్రుల వివక్ష, చిన్నచూపును ప్రశ్నిస్తూనే దాని ప్రత్యేకతను చాటే ప్రయత్నం చేశారు. 'తెలంగాణ భాష వాడకానికి అడ్డంకిగా మారిన పెద్ద సమస్య ప్రామాణిక భాష, వాడుక భాషా ఉద్యమ నిర్మాతలైన గిడుగు, గురజాడలు ప్రజల భాషను గౌరవించి వాచకాల్లోకి, రచనల్లోకి తీసుకొచ్చారు. వాళ్ళు మొదలుపెట్టిన ఉద్యమం వారి వారసుల చేత హైజాక్ చేయబడినది తెలంగాణ ప్రజల భాషకు జరిగిన ద్రోహం యాదృచ్ఛికం కాదు అని నందిని సిద్ధారెడ్డి అన్నారు.

తెలంగాణ అస్తిత్వ సాహిత్య విమర్శ అన్ని కోణాలను స్పృశిస్తూ ముందుకు సాగింది. దళిత, ముస్లిం, స్త్రీ వాదాలకు సంబంధించిన అంశాలను కూడా తనలో భాగంగా తెలంగాణ సాహిత్య విమర్శ స్వీకరించింది. తెలంగాణ దళిత, ముస్లిం, స్త్రీ వాదాల గురించి కాసుల ప్రతాపరెడ్డి భౌగోళిక, చారిత్రక, సాంస్కృతిక, సామాజిక సరిహద్దులను పరిగణనలోకి తీసుకొని తులనాత్మక అధ్యయనం ద్వారా వివరించారు. కె.శ్రీనివాస్ పరిశీలనలు ఇలా ఉన్నాయి "ఈ నాటికీ తెలంగాణ నుంచి స్త్రీవాద కవులు తక్కువ" దళితవాద కోస్తాంధ్రలో ప్రారంభం అయినా ఆత్మగౌరవ పోరాటం నుండి రూపొందింది. కాబట్టి దానిలో తెలంగాణ భాగస్వామ్యం స్వల్పమే.

దళిత, ముస్లిం సాహిత్య విమర్శలో తెలంగాణ వాళ్లదే పై చేయ్యి. సుంకిరెడ్డి నారాయణరెడ్డి "బహువచనం" దళిత బహుజన కవిత్వ సంకలనానికి "జల్ జలా" ముస్లిం కవిత సంకలనానికి రాసిన ముందు మాటలు సాహిత్య విమర్శనా సాహిత్యంలో అత్యంత ప్రధానమైనవి. బి.యస్.రాములుకు సంబంధించి దళిత సాహిత్య విమర్శనా రంగంలో ప్రత్యేకమైనది. తెలంగాణ

సాహిత్యంపై వరుసగా విమర్శనా వ్యాసాలు, సంకలనాలు వచ్చాయి. నందినీ సిద్ధారెడ్డి "ఇగురు", కాసుల ప్రతాపరెడ్డి "కొలుపు", "ఇరుసు", సుంకురెడ్డి నారాయణరెడ్డి 'గనుమ', కాసుల లింగారెడి 'ఇరువాలు' వంటి పుస్తకాలు వచ్చాయి. భువనగిరి సదస్సులో సమర్పించిన పత్రాలతో తూర్పు మల్లారెడ్డి తెచ్చిన "తెలంగాణ సాహిత్యం - సామాజిక చిత్రం" పుస్తకం తెలంగాణ సాహిత్య పక్రియలను స్థిరపరిచింది. ప్రాచీన తెలంగాణ కవులు, కవిత్వాన్ని ఆవిష్కరించిన 'ముంగిలి' సుంకిరెడ్డి నారాయణరెడ్డిచే రచించబడినది. డా॥ఎస్వీ సత్యనారాయణ అభ్యుదయ సాహిత్య విమర్శను, విశ్లేషణనను చేశారు.డా॥వెల్దండ నిత్యానందరావు పేరడీ సాహిత్యంపై పరిశోధన చేశారు. డా॥ నూర్య ధనంజయం గిరిజన సాహిత్యంపై విమర్శనను, పరిశోధనను ముందుకు నడిపించారు. ఇలా తెలంగాణ సాహిత్య విమర్శ సృజనాత్మక పక్రియలతో పాటు ముందుకు సాగుతుంది.

ముగింపు :

తెలుగు సాహిత్య చరిత్రలో యుగవిభజన తెలంగాణ సాహిత్యాన్ని విశ్లేషించడానికి, విమర్శించడానికి, బేరీజు వేయడానికి వనికిరాదని తెలంగాణ సాహిత్య విమర్శకులు, పరిశోధకులు గుర్తించడం. ఆ ఎరుకతో తెలంగాణ సాహిత్య చరిత్ర ద్వారా సుంకిరెడ్డి నారాయణ రెడ్డి పరిశోధన చేశారు. తెలంగాణేతర సాహిత్య చరిత్ర ప్రాజ్ఞున్నాయ యుగం నుండి ప్రారంభం అయితే తెలంగాణ సాహిత్య చరిత్ర శాతవాహన యుగం నుండి ప్రారంభం అవుతుంది. ఈ పరిశోధ న రీత్యా తెలంగాణ సాహిత్య విమర్శకు సంబంధించి సమగ్రమైన గ్రంథం ఇంకా రావల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఉపయుక్త గ్రంథాలు :

1. సుంకిరెడ్డి నారాయణరెడ్డి - మన తెలంగాణ - తెలంగాణ నాటకం, తెలంగాణ సాహిత్య చరిత్ర, లిటిన్ 17సెప్టెంబర్ ప్రత్యేక సంచిక.
2. కాసుల ప్రతాపరెడ్డి - వాళ్ళు - మనమూ (వ్యా) 'తెలంగాణ తోవలు
3. డా॥ సుంకిరెడ్డి నారాయణరెడ్డి - తెలుగు కవిత్వం - ప్రాంతీయ చైతన్యం (వ్యా) వివేచన, వర్తమాన సాహిత్యం - చైతన్యం సంచిక 27, 2006
4. సురవరం ప్రతాపరెడ్డి (సం) - గోలకొండ సంచిక
5. శేషాద్రి రమణ కవులు - గోలకొండ సంచిక
6. శేషాద్రి రమణ కవులు - గోలకొండ కవుల సంచికకు అనుబంధం
7. బి.ఎస్.రాములు - తెలుగు కథా సంకలనాల్లో తెలంగాణ దశల నిష్పత్తి వివరాలు
8. సుంకిరెడ్డి నారాయణరెడ్డి - లెక్క తప్పిన తెలుగు సాహిత్య చరిత్ర (వ్యా) తెలంగాణ తోవలు
9. కాసుల ప్రతాపరెడ్డి - వాళ్ళు-మనం (వ్యా) తెలంగాణ తోవలు
10. గుమ్మన్న గారి బాల శ్రీనివాసమూర్తి-సమకాలిన పాదాలు-సాహిత్య విమర్శ
11. నందిని సిద్ధారెడ్డి - ముంపునకు గురవుతున్నది తెలంగాణ భాష (వ్యా) తెలంగాణ తోవలు
12. నందిని సిద్ధారెడ్డి - తెలంగాణ కవిత్వం - జీవిత చిత్రణ మద్దెర
13. కాసుల ప్రతాపరెడ్డి - వాళ్ళు- మనము తెలంగాణ తోవలు.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 2 (2), February - 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

బిరుదురాజు రామరాజు ప్రథమ భాగం – మహిళాయోగులు

– బోయిని రోధ, పరిశోధక విద్యార్థిని, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

తెలంగాణాలో దేవునూరు గ్రామంలో 1925లో జన్మించి 75 సంవత్సరాలు పైబడినా విరామయెరుగక నిరంతరం సాహిత్యరంగంలో కృషిని కొనసాగించిన మహోన్నతులు ఆచార్య బిరుదు రాజు రామరాజు గారు.

భారతదేశ ప్రాకృతిక వాతావరణ పరిస్థితులు పురాతన వైదిక మానవుని మనస్సును ప్రకృతివైపు మళ్ళించి దాని ఒడుదుడుకులు, సొంపులు చలింపజేశాయి. అందువల్లనే వేదాలలోని ఋక్కులలో ప్రకృతి వైభవ వర్ణన, భయ భక్తులు సర్వత్రా వ్యక్తమౌతాయి. కాని వైదిక మానవుడు ప్రకృతినీ, ప్రకృతి దైవాలనూ పారమార్థిక సత్యాలుగా పరిగణించలేదు. జ్ఞానభూమి, కర్మభూమి, యాగ భూమిగా భావింపబడే పుణ్యభూమి భారతభూమి. ఎందరో మహర్షులకు, యోగులకు, జ్ఞానులకు జన్మ నిచ్చిన కన్నతల్లి భారతధాత్రి. ఆత్మతత్వాన్వేషణ అనాదిగా సాగుతున్న సంస్కృతి గల భూభాగమిది. మోక్షమార్గమైన జ్ఞానాన్ని ఉద్భవింపజేసే కర్మ యోగాన్ని శ్రీ కృష్ణుడు అర్జునునకు బోధించిన భగవద్గీత మనకాదర్శం. సర్వాన్ని మనోనేత్రంతో దర్శించగల్గిన మానసిక పరిణామాన్ని అలవరచుకోవాలన్న తపన కల్గిన జిజ్ఞాసువులతో నిండిన భూమి ఇది. "ఆత్మ దర్శనం వలన, అమృతత్వం లభ్య మవుతుందని యాజ్ఞవల్క్య డు చెప్పాడు. ఆత్మ సాక్షాత్కారం వలన అవిద్యాబంధాలు నశించి, బ్రహ్మ దర్శనం అవుతుందని శంకరాచార్యులు చెప్పారు. సమస్తమైన తత్త్వముల స్వరూపం అవగతమవుతుందని సాంఖ్యదర్శనం చెపుతుంది. ప్రకృతి పురుషుల స్వరూప జ్ఞాన కల్గుతుంది. దర్శన శాస్త్రం వల్ల చిత్తవృత్తి నిరోధం కలిగి ఈశ్వరసాక్షాత్కారమవుతుంది అని యోగశాస్త్రం చెపుతుంది. దర్శనశాస్త్రం వల్ల కర్మ మీ మాంస ప్రయోజ నాలు లభ్యమవుతాయని జైమిని, శబర స్వామి, కుమారి లుడు, ప్రభాకరుడు ఇత్యాది మీ మాంసకులు చెప్పారు. నిర్వాణం లభ్యమవుతుందని బౌద్ధులు చెప్పారు. కేవలం జ్ఞానం కలుగుతుందని జైనులు చెప్తారు. దర్శన శాస్త్రం వలన మన దేహేంద్రియ సుఖం కలుగుతుందని చార్వాకులు చెప్తారు". ఇటువంటి దివ్యభావాన్ని, దివ్య దర్శనాన్ని అలవరచుకొన్న జ్ఞానులు, యోగులు, ఋషుల యొక్క దివ్య ప్రబోధాలను గౌరవించి, ప్రేమించి ఆచరించే జీవితం భారతీయులది.

"యజ్" అనే కాల్పనిక ధాతువు నుంచి యోగమనే పదము నిష్పన్నమయింది. దీనికి కౌశలము, సామర్థ్యము, ప్రయత్నము, ధ్యానము, శక్తి వియోగము మొదలయిన అర్థాలున్నాయి. మనస్సు బుద్ధుల వ్యామోహ భ్రాంతు లను తొలగించి బౌద్ధికంగా గ్రహించిన తత్త్వాన్ని యోగం ప్రత్యక్షానుభూతిలోకి తెస్తుంది. పతంజలి తపస్సు బ్రహ్మచర్యము, ప్రాణాయామము, ధారణ, ధ్యానమూ, సమాధి, సాంఖ్యసిద్ధాంతాలతో సమన్వయించి ఒక దర్శనంగా యోగ సూత్రాలను రచించినాడు. పతంజలి ప్రణీతమయింది కాబట్టి దీనికి 'పాంజలమని' పేరు వచ్చింది. ఇంద్రియాదులను స్వాధీనపరుచుకోవటానికి తగిన ఉపాయము యోగం కాబట్టి ప్రాచీనకాలం నుంచే యోగాభ్యాసము భారతదేశమంతట ఉంది. ఈ యోగా భ్యాసానికి ముఖ్యగ్రంథము పతంజలి యోగసూత్రాలు".

యోగంలో అష్టాంగాలున్నట్లుగా భావిస్తారు. అవి 1. యమం 2. నియమం 3. ఆసనం 4. ప్రాణాయామం 5. ప్రత్యాహారం 6. ధారణ 7. ధ్యానం 8. సమాధి వీటిని అనునిత్యం సాధనచేసి సాధించిన వారిని యోగులుగా భావిస్తున్నారు.

యోగసాధనలో, ఇంద్రియ నిగ్రహంలో, దర్శనంలో యోగి సాధించగలిగేదేమిటి అన్న ప్రశ్న ఉదయించి నప్పుడు, ఆత్మానందం అన్న సమాధానం మనకు విని

పిస్తుంది. ఈ ఆనందాన్ని వాళ్ళు ఆర్తులకు, జిజ్ఞాసువులకు, జ్ఞానులకు పంచిపెడుతూ దీనులను, దు:ఖితులను రోగపీడితులను ఆదుకుంటున్నారు. ఈ క్రమంలో యోగులు సమాజానికి సత్యధర్మ శాంతి ప్రేమాహింసలను పంచగలుగుతున్నారు. ఈ బాటలో పయనిస్తున్న కలియుగావతారి భగవాన్ శ్రీ సత్యసాయిబాబా వారికి ఆచార్య రామరాజు గారి పరివారము 1976 నుండి భక్తులు. బాబా పూర్వావతారం షిరిడి సాయిబాబా అని తెలిసినప్పటి నుండి షిరిడి వీరికి యాత్రాస్థలమై షిరిడి సాయిబాబా చరిత్రం, గురుచరిత్రం నిత్యపారాయణ లైనాయి. అప్పటి నుండి యోగుల చరిత్రలు చదవటం, యోగభూములు దర్శించటం తీరని దాహంగా మారిందని రామరాజుగారు అన్నారు.

ఆధునిక సామాజిక, రాజకీయ సాహిత్య చరిత్రల్లో విజ్ఞాన సర్వస్వాల్లో అరుదుగా కన్పించే యోగుల చరిత్ర రాయాలన్న పట్టుదలతో ప్రసిద్ధి యోగుల చరిత్రలు చదవటం రామరాజుగారు ప్రారంభించారు. ఏ పనిచేసిన, ఏది వ్రాయాలనుకున్న ఆయా విషయాలకు సంబంధించిన పూర్తి వివరాలను సంపాదించాలనే ప్రత్యేక క్రమ శిక్షణతో కూడిన దీక్షను అలవరుచుకున్న వ్యక్తి కనుక ఆంధ్ర యోగుల చరిత్రలను పరిచయం చేయగలిగారు.

ఈ క్రమంలో భగవత్ ప్రసాదంగా 1995లో భారత ప్రభుత్వం వారిచే " National Research Professor Ship" లభించింది. ఇదంతా యోగుల చరిత్ర రచనకే కట్టిన భాగ్యంగా భావించి ఈ ఆంధ్రయోగుల చరిత్రలను ఒక ప్రాజెక్టుగా చేపట్టారు బిరుదురాజు రామరాజుగారు. ఈ చరిత్రలను రూపొందించడంలో వారికి లభ్యమైన ఆంధ్రయోగులను నాలుగు రకాలుగా విభాగించుకున్నారు.

1. ఆంధ్రదేశంలో పుట్టి ఆంధ్రాలోనే స్థిరపడ్డవారు.
2. ఆంధ్రదేశంలో పుట్టి ఆంధ్రేతర ప్రాంతాలకు వలసపోయినవారు.
3. ఆంధ్రేతర ప్రాంతాల్లో పుట్టి ఆంధ్రేతర ప్రాంతాల్లోనే ఉండి పోయిన ఆంధ్రులు.
4. ఆంధ్రేతర ప్రాంతాల్లో పుట్టి ఆంధ్రదేశానికి వలస వచ్చిన ఆంధ్రేతరులు.

ఈ యోగులలో స్త్రీ పురుషులు, హిందువులతో పాటు ముస్లిం యోగులు కూడా ఉన్నారు. ఆచార్య బిరుదురాజు రామరాజు గారు వెలువరించిన ఆంధ్రయోగులు మొదటి సంపుటంలోని యోగులందరిని మూడు భాగాలుగా విభజించినట్లయితే 1. హిందూ యోగులు 2. ముస్లిం యోగులు 3. మహిళా యోగులుగా చెప్పవచ్చును.

ఈ మహిళా యోగులను ఇందులో భాగంగా నలుగురిని పేర్కొనడం జరిగింది.

1. తరిగొండ వెంకమ్మ
2. మచిలీపట్నం దొంతులమ్మ
3. తిక్క లక్ష్మమ్మ
4. మాలపిచ్చమ్మ

ఈ మహిళా యోగుల యొక్క పుట్టుక, కాల నిర్ణయం, తల్లిదండ్రులు, గురువులు లభ్యమైన వారి వంశావతారం, రచనలు, వారు చూపిన అద్భుతాలు, సిద్ధిని పొందటం మొదలైన అంశాలను క్లుప్తంగా ఒక క్రమంలో క్రోడీకరించారు బిరుదురాజు రామరాజుగారు.

తరిగొండ వెంకమ్మ (1730 - 1817) :

భక్తికి బ్రహ్మానుభవానికి కులమతాలు, వర్ణవర్గాలు, స్త్రీ పురుష భేదం అడ్డురావంటూ, భగవత్ సాక్షాత్కారము బ్రహ్మానుభవం పొందిన తరిగొండ వెంకమ్మను గురించిన వివరాలను ఆచార్య రామరాజు గారు పేర్కొన్నారు. తరిగొండ లక్ష్మీనరసింహస్వామి భక్తులైన కృష్ణయ్య, మంగమ్మల అందాలబిడ్డ వెంగమ్మ (వెంకమ్మ). వెంకమ్మ పెరుగుతూ ఉండే ఆమెతోపాటే ఆమెలోని భక్తి పెరిగింది. వెంకమ్మ గురువైన సుబ్రహ్మణ్య శాస్త్రి తన ఉపాస్యదైవం సోమేశ్వరస్వామి సన్నిధిలో వెంకమ్మకు వేదాంతం బోధించాడట. తర్వాత మంత్రోపదేశం చేసి భక్తితత్వాన్ని, యోగ శాస్త్ర రహస్యాలను వివరించాడు. ఈమె చక్కటి కవయిత్రి. వెంకమ్మ భక్తి సాహిత్యాల్లో తొలిరచన తరిగొండ నృశింహ శతకం. రెండవకృతి నృసింహ విలాసకథ - యక్షగానం.

ఈ రెండు తరిగొండ నృసింహస్వామికి అంకితం చేసింది. మూడవది శివవిలాస యక్షగానం రాచవీటి వీరభద్ర స్వామికి అంకితం చేసింది. ఒక సందర్భంలో ఈమె పుష్పగిరి పీఠాధిపతులైన భారతీ స్వాములతో వాదించిన ఆ జగద్గురువులే వెంకమ్మ ప్రహ్లాదావతారమంటూ నమస్కరించి ప్రశంసించి వెళ్ళిపోయేటట్లు చేసింది. 3-8-1817 నాడు వెంకటేశ్వరస్వామి పాదాల్లో కలిసి పోయిన ఆమెను, ఆమె పెంచిన పూలతోటలో ధ్యాన సమాధిలో కూర్చుండే చోటే మహాసమాధి చేశారు. భక్తి వేదాంతపరమైన ఎన్నో కృతులు ఈమె రచించింది. అవి చాలావరకు ముద్రితాలై లభించాయని వాటిని గురించి ఆచార్య రామరాజుగారు తెలియజేసారు.

మచిలీపట్నం దొంతులమ్మ (1867-1932) :

ఊరు, పేరు, పుట్టుక వైవాహిక జీవితం మొదలైన వివరాలు ఇదమిద్దంగా తెలియవు. అయితే అరవై అయిదు సంవత్సరాలు జీవించి 1932లో దేహం చాలించిన ఆమెకు అప్పటికే అరవై ఏండ్ల వృద్ధురాలిగా పేర్కొన్న వలివేటి పేరయ్య చెప్పినదాన్ని ఆధారంగా చేసికొని 1867 ప్రాంతంలో జన్మించి ఉండవచ్చునని ఆచార్య రామరాజు భావించారు. కొన్ని విషయాలను బట్టి ఆమెను బంజారా - లంబాడి స్త్రీగా గుర్తించారు. దొంతులమ్మ మిరప కాయలు, ఉల్లిపాయలు, ఉప్పు కలిపిన ముద్ద పాత గొంగడి క్రింద దాచి భక్తులకు ప్రసాదంగా ఇచ్చేది. ప్రతి సంవత్సరం మాఘమాసంలో దొంతులమ్మకు ఆమె సమాధి చెందిన నాటి నుండి పదకొండు రోజులు ఆరాధ నోత్సవాలు వైభవంగా జరుగుతాయి.

తిక్కలక్ష్మమ్మ (1815-1993) :

కర్నూలు జిల్లా ఆదోని పట్టణంలో సిద్ధరాలు. జీవన్ముక్తురాలైన తిక్క లక్ష్మమ్మ సమాధి ఒక యాత్రా స్థలం. ఆంధ్ర కర్ణాటక ప్రజలు ఆమెను సేవిస్తున్నారు. మాదిగ మంగమ్మ బండెప్పల ప్రథమ సంతానం లక్ష్మమ్మ. తిక్కలక్ష్మమ్మగా పిలువబడే ఈమె దుష్టులపై పడి కొట్టేది లేదా బెదిరించేది. దీనులు హీనులు నిరపరాధులు నిర్భయంగా ఆమెను సమీపించి తాము తెచ్చింది ఆమెకు అర్పించేవారు. 16-5-1993లో దేహం చాలించిన ఈమెను సమాధి చేసి అక్కడే మఠాన్ని నిర్మించారు. ఆమె భక్తులు అక్కడ ప్రతి శుక్రవారం విశేష పూజలు, ఆరాధనోత్సవాలు, రథోత్సవాలు ఏటేట జరిపిస్తున్నారు.

మాలపిచ్చమ్మ (1870-1947) :

బాల్యంలో మహాకవులుగా, మేధావులుగా, కళాకారులుగా, భక్తులుగా, యోగులుగా ప్రసిద్ధులైన కొందరిలో మాలసిచ్చమ్మను ఒకరుగా ఆచార్య బిరుదురాజు రామరాజుగారు పేర్కొన్నారు. మాల దంపతులైన వజ్జే ముత్తయ్య, వీరమ్మల చివరి బిడ్డ. మరణించిన తరువాత పూర్తిగా విరాగిణిగా మారింది. ఆకులలములు, ఒండ్రుమట్టి, స్మశానంలోని బూడిద ఈమె ఆహారం. శరీరం మీద అభిమానం పోయి మొలకు ఒక గోనెపట్టా చుట్టుకొని అవధూత అయింది. సదా రామనామం చేసే ఈమె రామావధూత పిచ్చమ్మగా ప్రసిద్ధికెక్కింది. 15-1-1951 నాడు దేహం చాలించింది.

ఆమె సమాధిపై దేవి రూపంలో ఉన్న నల్లరాతి విగ్రహాన్ని తరువాత ఒక తెల్లరాతి విగ్రహం ప్రతిష్ఠించారు. ఆ నల్ల, తెల్లమ్మలకు ప్రతి దినం అర్చన జరుగుతుంది.

ఇలా మహిళా యోగులకు సంబంధించిన వివరాలను ఆయా యోగభూములను, సమాధులను స్వయంగా దర్శించి కొంత, పుస్తకాల ద్వారా కొంత, ఆయా యోగులను గురించి బాగా తెలిసినవారు, సన్నిహితులు పంపిన వివరాలు కొంత సేకరించి ఆంధ్రయోగుల ప్రథమ భాగంలో వారి వారి మహిమలు, అద్భుతాలను ప్రకటిస్తూ యోగుల, యోగినుల చరిత్రను వివరించారు.

ఆధార గ్రంథం :

1. రామరాజు బిరుదురాజు, ఆంధ్రయోగుల ప్రథమ సంపుటం, పుట 119-126, పుట 167-171, పుట 172-177, పుట 328-335. ★

BHAVAVEENA
Vol. 19, Issue. 2 (2), February - 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

అభ్యుదయ కవితావేత్తగా కుందుర్తి

– డా॥. ఎన్. రజని, తెలుగుశాఖ, డా.బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం.

కుందుర్తి ఆంజనేయులు వచన కవిత్వం చాలా సరళంగా, స్పష్టంగా, సూటిగా ఉండాలని కోరుకున్న అభ్యుదయ వచనకవి. కలం కత్తిలాగా పదునైనదే, కత్తి కన్నా పదునైనది అన్న సత్యాన్ని సాహిత్య కృషి ద్వారా నిర్ద్వంద్వంగా రుజువు చేసిన కవి కుందుర్తి.

కుందుర్తి పేరు వినగానే 'నయాగరా జలపాతం', 'తెలంగాణ ఉద్యమం' రెండు స్ఫురిస్తాయి. నిజంగానే వారి కవిత్వం నయాగరా జలపాతం వలె నిరంతర ప్రవాహ స్వభావము తెలంగాణ ఉద్యమస్ఫూర్తి కలిగినవే అని స్పష్టమవుతుంది.

కుందుర్తి తాను ఎప్పుడూ కవిత్వంలో నూతనత్వాన్ని, చలనస్వభావం కలిగిన అభ్యుదయాన్ని కోరుకున్నారు. నిజానికి ఈ పత్రం రాసేముందు కొన్ని కవితలను విద్యార్థులకు పాఠం రాసే ఉద్దేశంతో చదివినవేతప్ప, ఒక పరిశోధక విద్యార్థిగా చదవలేదు. అయితే ఇప్పుడు ఈ సదస్సు కోసం ఆయన రచనలను, వ్యాసాలను చదువుతున్నప్పుడు ఎంతగా అభ్యుదయాన్ని కోరు కున్నాడో, ఎంతగా అభ్యుదయవాదంతో మమేక మయ్యాడో అర్థమయింది. వచనకవితా పితామహుడే కాదు. అభ్యుదయ వచన కవితా పితామహుడని పిలుచు కోవచ్చు అని అనిపించింది.

కుందుర్తి ప్రజాజీవితంలో అభ్యుదయాన్ని కాంక్షిం చాడు. సాహిత్యం ద్వారా, ముఖ్యంగా కవిత్వము, రచనల ద్వారా అభ్యుదయ భావాలను వెలువరించాడు. ఆలోచన లోనూ, ఆచరణలోనూ అభ్యుదయ శీలి కుందుర్తి. మనం ఇంతకుముందే చెప్పుకున్నట్టుగా నూతనత్వాన్ని ఎట్లా కోరుకున్నాడో కుందుర్తి మాటల్లోనే విందాం.

ఇప్పుడు సృష్టించిన కొత్త మరొక శతాబ్దం తర్వాత నిలువలేక అప్పటికి వచ్చిన కొత్తకు తట్టుకోలేక కాల గర్భంలో కలిసిపోయినా నాకు సమ్మతమే. కానీ ఇప్పుడు కొత్తను సృష్టించ యత్నించడం మాత్రం ముమ్మాటికీ గొప్పే. చెప్పినదే చెప్పడం కంటే కొత్తగా చెప్పడం మేలు అంటారు.

వీరేశలింగం, గిడుగు, గురజాడలు అభ్యుదయ మార్గాన్ని స్థిరపరిచారని, జాషువా సమకాలీన పరిస్థితులను చుట్టూ ఉన్న సమాజాన్ని నిశితంగా గమనిస్తూ అభ్యుదయ కవిత్వానికి తొలిబీజాలు నాటిన ప్రజాకవి అని చెప్తారు. అభ్యుదయ యుగ ప్రారంభానికి ఇదంతా పూర్వరంగంగా ఉపయోగపడిందని అభిప్రాయపడతారు కుందుర్తి.

తాను చదువుతున్న చదివిన తెలుసుకున్న ప్రతి రచయితనూ నూతన దృష్టికోణంతో, అభ్యుదయ దృక్పథంతో పరిశీలించారనే విషయం అర్థమవుతుంది.

అభ్యుదయ మార్గంలో పయనించి విప్లవం దాకా ఒక ప్రభంజనంలా వచ్చిన శ్రీశ్రీ గురించి శ్రీశ్రీ కవిత్వంతో ఎట్లా అభ్యుదయ మార్గానికి బాట వేశాడో, అప్పటిదాకా ఉన్న కవిత్వాలను, కవులను శ్రీశ్రీ ఎట్లా ప్రభావితం చేశాడో, ఒక ఆరాధనతో, ఇష్టంతో, అభ్యుదయ మార్గం పట్ల ఎనలేని విశ్వాసంతో తన అభిప్రాయాలను ఇట్లా ప్రకటిస్తాడు. కాల్పనికోద్యమ మార్గంలో పయనిస్తున్న కవుల్నీ, ప్రజల్నీ ఎలుగెత్తి కేకేసి 'ఆగండర్రా' అన్నాడు. అతడు ముందే జాగ్రత్తపడి తెచ్చుకున్నాడు కాబోలు పంట్లాం జేబులోనుండి తీసి ఎర్రజెండా చూపించాడు. అంతటితో కాల్పనికోద్యమం అనే రైలు ఆగిపోయింది. అభ్యుదయ మహాప్రస్థానం ఆరంభమైంది అంటూ శ్రీశ్రీ పట్ల, అభ్యుదయం పట్ల తనకున్న అభిమానాన్ని చాటు కుంటారు.

అభ్యుదయ మార్గం పట్ల తనకున్న ఇష్టాన్ని, శ్రీశ్రీ పట్ల తనకున్న అభిమానాన్ని కలిపి, శ్రీశ్రీ కవితాతత్వమే

అభ్యుదయం అని ఎంతో విశ్వాసంగా ప్రకటిస్తారు. శ్రీశ్రీ కాదు, పెనుగాలి కాదు, జంఝూ మారుతం, ఇంతకంటే గట్టిమాట ఏదైనా ఉంటే అదైనా సరే అంటారు. శ్రీశ్రీ పట్ల కుందుర్తికి ఉన్న అభిమానానికి ఇదొక మచ్చుతునక మాత్రమే.

అభ్యుదయ కవితా మార్గం పట్ల అచంచల విశ్వాసం ఉంది. కనుకనే కాల్పనికతావాద ఉద్యమం తరువాత వచ్చిన అభ్యుదయ పథానికి శ్రీశ్రీ ఎట్లా మార్గదర్శనం చేశాడో, కుందుర్తి మాటల్లోనే విందాం.

శ్రీశ్రీ తాను వస్తూవస్తూ వందలమంది ఫ్యాక్టరీ కార్మికులను, కొంతమంది రైతులను వెంట తెచ్చుకున్నాడట. పైగా వాళ్ళందరినీ పతితులార, భ్రష్ములార, బాధాసర్ప దష్టులార ఏడవకండేడవకండి - నేనున్నాను అంటూ భరోసానిస్తూ అభ్యుదయ కవితా సింహాసనాన్ని అధిరోహించాడు శ్రీశ్రీ అంటారు.

సాహిత్యంలో అనేకమైన మార్పులు చోటు చేసుకున్నప్పటికీ నిజమైన మార్పు, సాహిత్య విలువలను తలక్రిందులు చేసిన మార్పు అభ్యుదయ సాహిత్యయుగంలోనే కలిగిందనే విషయాన్ని నిర్వివాదంగా నమ్మారు కుందుర్తి.

అభ్యుదయ కవితాతత్త్వం దాని అంతర్గత శక్తి వల్లనే అది నిలుస్తుంది. చరిత్రే దాని జయాపజయాలను నిర్ణయిస్తుంది అనే నమ్మకం కుందుర్తిది. అంతేకాదు ఆ సమకాలీన సమయంలో వచ్చిన వచన కవిత, దిగంబర కవిత, విప్లవ కవిత - వీటన్నిటికీ అభ్యుదయ కవిత్వమే పునాది అని భావిస్తారు.

వచన కవిత తెలుగు కవిత్వంలో ప్రక్రియాపరంగా వచ్చిన విప్లవంగా భావిస్తాము. వచనకవిత, అభ్యుదయ భావన కవలపిల్లలని కుందుర్తి భావన. అభ్యుదయ భావనతోనే వచన కవిత్వం వ్యాప్తి చెందిందనే ఆలోచన వారి మాటల్లో కనిపిస్తుంది.

"అభ్యుదయ కవిత్వానికి సామాజిక స్పృహ ప్రాణం వంటిది. ఆ సాహిత్యం మన సాహిత్యంలో వచ్చిన అన్ని విప్లవాలలోనూ సంపూర్ణమైనదీ హేతుబద్ధమైనది[5] .ఈ మాటలతో కుందుర్తి ఎంతగా సమాజాన్ని గురించి, సామాజిక స్పృహతో ఉన్నారో, ఎంతగా ప్రగతిశీల భావాలతో ఉన్నారో, ఎంతగా అభ్యుదయాన్ని ఆకాంక్షించారో స్పష్టంగా తెలుస్తుంది.

అయితే ఇంతటి అభ్యుదయ కాంక్ష కలిగిన కుందుర్తి మొదట విశ్వనాథ వారి అభిమాని. అయితే ఒకానొక సందర్భంలో విశ్వనాథ గారి ఉపన్యాసం వినడానికి వెళ్ళిన కుందుర్తికి, ఆ సభలోనే ఉన్న శ్రీశ్రీ మహాప్రస్థానం కావ్యం వినడం అనుకోకుండా జరిగింది. మహాప్రస్థానం శైలి, అందులోని నవ్యత ఎంతో నచ్చాయట. అప్పట్నుంచీ శ్రీశ్రీ అభిమానిగా మారారు కుందుర్తి. అయితే శ్రీశ్రీ కవితా శైలిని, శ్రీశ్రీని వ్యక్తిగతంగా అభిమానించడమే కాకుండా అతని కవిత్వం సమసమాజానికి, ముఖ్యంగా కార్మిక కర్షకులకు మేలుచేస్తుందనే నమ్మకం కలిగింది కుందుర్తికి. సమాజంలో మార్పుకు శ్రీశ్రీ చూపిన అభ్యుదయ మార్గమే అవసరమని విశ్వసించారు. అప్పట్నుంచే తానూ అభ్యుదయ మార్గంలోనే కవిత్వం రాయాలని నిర్ణయించుకున్నారు.

నిజానికి కుందుర్తికి బెల్లంకొండ రామదాసు, ఏల్చూరి సుబ్రహ్మణ్యం చిన్నప్పట్నుంచీ స్నేహితులు. గుంటూరులోని బ్రహ్మసమాజం దగ్గర రైలుపట్టాల మీద కూచుని విప్లవం, మార్క్సిజం, అభ్యుదయం, సాహిత్యం అన్న అంశాల గురించి చర్చించుకునేవారట.

బ్రహ్మసమాజానికి వచ్చే పెద్దల ముందు తమ ప్రతిభ, పాండిత్యాలను నిరూపించుకోవాలనే కోరిక ముగ్గురికీ ఉండేది. వారందరిలో కుందుర్తి గారు బిడియస్తుడు. ఏల్చూరి చెప్పే విషయంలో అయోమయం ఉన్నా ధైర్యంగా మాట్లాడేవాడు. రామదాసు కొంత చొరవతో పెద్దవాళ్లను పరిచయం చేసుకునేవాడు.

ముగ్గురూ మూడు రకాల మనస్తత్వం కలిగిన వారైనా అందరికీ కలిసిన అభిప్రాయ ఐక్యత "నవ్యత" అనే అంశం. నవ్యతను సాధించడమే వీరి ప్రధానలక్ష్యం.

ముగ్గురూ కలిసి బ్రహ్మసమాజ నిర్వాహకులను ఒక సభ ఏర్పాటు చేయమన్నారు. అప్పటికే ఉన్న నవ్యకవిత్వం కాకుండా 'అతి నవ్యకవిత్వం' అని వారి కవిత్వాన్ని ప్రకటించుకున్నారు. అయితే ఆ 'అతి నవ్యకవిత్వమే' ఆ సభలోనే అభ్యుదయ కవిత్వానికి అంకురార్పణ జరగనుందని, సభానిర్వాహకులైన తెలికచర్లకూ తెలియదు. సభలో కవిత్వం చదివిన కుందుర్తి మిత్రబృందానికి తెలియదు. కానీ ఆ సభే సాహిత్యంలో ఒక చారిత్రాత్మక మార్పుకు నాందిగా నిలిచిందనే విషయం మాత్రం నిజం.

ఆనాడు ఆ సభలో జరిగిన చర్చలో ఛందస్సు లేకపోతేనే నిజమైన కవిత్వం బైటికి వస్తుందని కుందుర్తి దబాయించి చెప్పిన జవాబే, భవిష్యత్తులో ఒక కవితా సిద్ధాంతంగా రూపొందింది. ఆ సిద్ధాంత రూపకల్పనకు తానే బాధ్యత వహించవలసి వస్తుందని కుందుర్తి ఆనాడు ఊహించలేదు.

శ్రీశ్రీ ప్రారంభించిన సాహిత్య విప్లవానికి 'నవ్యకళా పరిషత్తు' సభలో మలిదశ ప్రారంభమైంది. సాహిత్య రంగంలో అభ్యుదయ కవితా విప్లవం సర్వవ్యాప్తం కావడానికి అవసరమైన తొలిబీజాలు ఈ సభలో పడ్డాయి అని చెప్తారు కుందుర్తి. గుంటూరులో సరస్వతీ టాకీసు హాల్లో ఏర్పాటుచేసిన నవ్యకళాపరిషత్తు సభకు విశ్వనాథ గారిని, చలాన్ని పిలిచారు. విశ్వనాథ తన మొదటి గురువు కనుక అతని ముందు తన కవిత్వాన్ని ఘనంగా వినిపించాలని కుందుర్తి తాపత్రయం. ఆ సభకు కార్మికులు, కర్షకులు చాలా మంది వచ్చారట. ఆ సభలో 'జయిస్తుంది' అనే కవిత చదువుతుంటే ప్రేక్షకులనుంచి చప్పట్ల రూపంలో గొప్ప స్పందన వచ్చిందని, అట్లా ఆ సభలో చదివిన కవిత్వం ముందుతరాలకు అభ్యుదయ కవితామార్గాన్ని అందించిందని స్పష్టమవుతుంది. 'నవ్య కళా పరిషత్తు' పేరుతో జరిగిన మొదటి, చివరి సభ అదే. అందుకే కుందుర్తి నవ్యకళాపరిషత్తు జీవితకాలపు అధ్యక్షునిగా తనను తాను ప్రకటించుకున్నారు.

కుందుర్తి, ఏల్చూరి, బెల్లంకొండ అనే ముగ్గురు యువమిత్రులు కలిసి, ప్రాంతీయ ఉద్యమాలను, సంఘటనలను వస్తువుగా చేసుకొని అభ్యుదయ కవితా మార్గంలో సంచలనం సృష్టించారు.

కుందుర్తి వ్యక్తిగత జీవితాన్ని, సాహిత్య జీవితాన్ని విడదీసి చూడలేము. ఆయన నమ్మిన అభ్యుదయ వాదాన్నే తాను విడనాడలేదు. అంతే సామాన్యమైన జీవితాన్ని గడిపారు. సామాన్య ప్రజల జీవితాల్లో మార్పులకై రచన చేశారు. అట్లాంటి రచనా పద్ధతినే అభిమానించారు. అందుకే శిష్ట్లా అనే కవి తనను చేసిన ఇంటర్వ్యూలో ఇలా చెప్పారు.

వస్తువుకా, శిల్పానికా, రీతికా దేనికి మీరు ప్రాధాన్యమిస్తారు అని అడిగిన ప్రశ్నకు నిస్సందేహంగా వస్తువుకే అని చెప్పారు. అంతేకాదు అభ్యుదయ కవిత్వం కావ్య వస్తువుతోనే ప్రారంభమైంది అని చెప్పారు.

అయితే తాను శ్రీశ్రీ, శిష్ట్లాలఉద్యమస్ఫూర్తితో ప్రభావితమయ్యాను. కానీ, ఏ రచనా ప్రభావానికీ, ఏ రచయితకూ తాను లొంగలేదని, తనకంటూ ఒక ప్రత్యేకమైన శైలి ఉందని స్పష్టంగా చెప్పారు.

అదే ఇంటర్వ్యూలో తనకు అత్యంత ఆప్తుడైన శీలా వీర్రాజు అభ్యుదయ కవిగా మంచి రచనలు చేస్తున్నాడని చెరబండరాజు రచనాశైలి కూడా బాగుంటుందని తన అభిప్రాయాన్ని ప్రకటించారు.

ఏ రచననైనా శాస్త్రీయ దృక్పథంతో, మార్క్సిస్టు దృక్పథంతో పరిశీలించాలి అనేది వారి అభిప్రాయం. 'సంపూర్ణ వచన కవిత్వంలో మొట్టమొదటి కావ్యం నా 'తెలంగాణ'. అందులో అనేకవిధాలుగా ఫ్యూడలిజం విశ్వ రూపాన్ని క్లాస్ ఎక్స్‌ప్లాయిటేషన్‌ను కళ్ళకు కట్టినట్టు చూపించే ప్రయత్నం చేశాను. ఎందుకంటే ఎక్కడో ఒక ఘట్టంలో పాఠకుడి హృదయాన్ని మార్క్సిజం వైపు మళ్ళించగలుగుతాననే ఆశతో ...అని అంటారు. తన వ్యాసాల్లో ఒక చోట.. ఈ వాక్యంతో కుందుర్తికి ఉన్న అభ్యుదయ దృక్పథం, అభ్యుదయ భావన స్పష్టంగా తెలుస్తుంది. సంఘంలో అభ్యుదయం సాధించేందుకు మాత్రమే కవిత్వం రాయాలి.తాను నమ్మిన అభ్యుదయ

సిద్ధాంతాన్ని తనవరకే పరిమితం చేసుకోకుండా, కవిత్వం రాసేవాళ్ళు అభ్యుదయాన్ని సాధించడానికి మాత్రమే వారు రచన చేయాలి అనే సూచనను కూడా ఇచ్చారంటే కవిత్వరచన ఎవరి కోసం అనే స్పష్టత, అభ్యుదయాన్ని, మార్పును కోరుకున్న రచయితగా, కవిగా వారు ఎంత స్పష్టమైన అభిప్రాయాన్ని కలిగి ఉన్నారో కూడా అర్థమవుతుంది. నా కవితా లక్ష్యమే సామాజిక ప్రయోజనం అని కూడా చెప్తారు. తన టార్గెట్ కూడా సామాన్యుడే అనే విషయాన్ని స్పష్టం చేస్తారు.

ప్రజాదృష్టితో రాసే అభ్యుదయ కవిత్వమే నిజమైన కవిత్వమనే నమ్మకంతోనే, తన రచనలకు మార్క్సిస్టు భావననే ప్రాణమని చెప్తారు.

గుర్రంజాషువా రాసిన గబ్బిలం నికార్సయిన అభ్యుదయ కవిత్వంగా అభివర్ణిస్తారు. అభ్యుదయ కవిత్వం పుట్టకముందే పుట్టిన అభ్యుదయ కవి జాషువా అని కుందుర్తి అభిప్రాయం.

అభ్యుదయ, విప్లవ కవిత్వాల మధ్య పెద్దగా భేదాన్ని గుర్తించలేదు కుందుర్తి. క్షీణ ప్రబంధ యుగం మీద, దాని లక్షణాలతోనే కొత్తరూపంలో అవతరించిన, భావకవిత యుగం మీద జరిగిన తిరుగుబాటే అభ్యుదయ కవిత్వం అని భావిస్తారు. అభ్యుదయ కవిత్వం సమాజంలో ఒక పెనుమార్పును కలిగిస్తుందనే బలమైన విశ్వాసం వారి మాటల్లో కనిపిస్తుంది. అనేకమైన మార్పులు సాహిత్యంలో వచ్చినప్పటికీ, నిజమైన మార్పు, విప్లవాత్మకమైన మార్పు, పునాదులను కదిలించిన మార్పు, సాహిత్యపు విలువలను తలక్రిందులు చేసిన మార్పు అభ్యుదయ సాహిత్యయుగంలోనే కలిగిందనే విషయం నిర్వివాదాంశం..... అని అనడంలో వారికున్న విశ్వాసం ప్రకటితమవుతుంది.

శ్రీశ్రీ రాసింది మాత్రా ఛందస్సా, వచన గేయమా అనే విషయం పక్కన బెడితే, ఆధునిక కవిత్వానికి సంపూర్ణమైన ప్రజాదృక్పథాన్ని కల్పించినవాడు శ్రీశ్రీ అనడంలోనే కుందుర్తి అభ్యుదయ దృక్పథం స్పష్టమవుతుంది. అధునాతన కవితాకాశంలో శ్రీశ్రీ ఉదయించిన కవి మిత్రుడు. అభ్యుదయ కవిత్వంలో అతని స్థానం అట్టిది అని తన 'దండియాత్ర' కావ్యంలో నిర్ద్వంద్వంగా ప్రకటిస్తాడు. శ్రీశ్రీ గురించి ఇంకొక మాట చెప్తారు. ఆయన 'మహానియంత' అని మొత్తం ప్రపంచాన్ని తానే ఏలాలనుకొని, అంతటా తన వంటి గుండాలను ఏర్పాటు చేసుకున్నారట. కానీ పైకి మాత్రం మీ రాజ్యం మీరేలుకోండి అంటూ ప్రజలకు పిలుపునిచ్చాడట. శ్రీశ్రీ మీద తనకున్న అభిమానంతో వ్యంగ్య ఛలోక్తులు విసిరిన సందర్భాలు కూడా కొన్ని ఉన్నాయి.

'తెలంగాణ' కావ్యంలోని కొన్ని అభ్యుదయ భావనలు ఇప్పుడు తెలుసుకుందాం. ఆ కావ్యానికి ముందుమాట రాస్తూ గోపీచంద్ గారు రాసిన మాటలు కుందుర్తి అభ్యుదయ దృక్పథాన్ని పట్టిస్తాయి. ఇది తెలంగాణ కన్నీటి గాథ, గుండెలను కదిలెడి ఎముకలను విదిలెడి, నెత్తురుల ప్రిదిలెడి తెలంగాణ కన్నీటి గాథ అని వర్ణిస్తారు. పైగా అదే కావ్యంలో తన విజ్ఞప్తిలో పనికిమాలినది, చారిత్రక పరిణామంలో మరీ పాతదైపోయిన ఫ్యూడల్ వ్యవస్థపై తెలంగాణ ఉద్యమం ఒక పెద్ద తిరుగుబాటు. దానిని ప్రతిభావంతంగా చిత్రించగలిగితే నేను కృత కృత్యుణ్ణి అని అన్నాడంటేనే, ఒక ఉద్యమాన్ని, ఒక చారిత్రక మార్పును, ఒక ప్రబల విజయాన్ని ఆకాంక్షించిన అభ్యుదయ వాదిగా కుందుర్తి మనకు కనిపిస్తారు.

ఈ దేశం ఎట్లా ఉందో దేశపటాన్ని ఈవిధంగా వర్ణిస్తారు. దరిద్రుడు వేసుకున్న అతుకుల బొంతలాగా మంచి చిల్లుల నుంచి కారిపోతుందట. అధర్మపు వానలాగా ఉన్న దేశపటాన్ని మార్చాలనే తపన కనిపిస్తుంది.

కాలాన్ని కొలిచేందుకు క్యాలండర్లు పంచాంగాలూ కాదు, ఆ కాలపు ప్రజలకష్టాలు, జీవితగాథలు కావాలంటారు.. ఈ మాటలే కుందుర్తికి సామాన్య ప్రజలపట్ల ఉన్న ఆర్ద్రతను పట్టిస్తాయి.

"ప్రగతిశిశువు జననంతో అధర్మానికిక కరువు" అంటూ ప్రగతిని కాంక్షిస్తారు. అధర్మం జయిస్తుందనే భావనను వెలిబుచ్చుతారు.

'నగరంలో వాన' కవితా సంపుటిలోని 27కవితలలోని కొన్ని కవితలలో అభ్యుదయ ధోరణులను రేఖామాత్రంగా పరిశీలించే ప్రయత్నం చేస్తాను.

నగరంలో కురిసే వానకు తెలుసు
గొడుగు జీతపు రూకల్లో మిగిల్చి

కొనగలగడం వట్టిమాటని ..... అంటూ చిరుద్యోగి జీవితాలను అక్షరీకరిస్తారు. ఉన్నవాడు ఉన్ని సూటు లేనివాడికి లేనేలేదు అంటూ సామాన్య మానవుని జీవితాన్ని చిత్రిస్తాడు. ఉన్నవాళ్ళకు లేనివాళ్ళకు మధ్య అంతరాలు ఎందుకనే ప్రశ్న అంతర్లీనంగా వినిపిస్తాడు.

"నమస్సులు" కవితలో పాతమేడలు పడిపోయి కొత్త గోడలు లేచాయి. అప్పటికే మొగ్గలు పట్టిన అభ్యుదయ మహాభావాలు ఆనందంలో పూచాయి అనడంలో కొత్తగోడలు లేవడం అభ్యుదయానికి నాంది. మొగ్గలు పువ్వులయ్యాయి అనడం అభ్యుదయ భావాల వ్యాప్తికి సంకేతంలాగా భావించొచ్చు.

ప్రజల భాషలో ముల్లోకాలు వినేంత బిగ్గరగా భావాలను ప్రతిపాదిస్తున్నానంటారు మరో కవితలో ...

ఇంకొక కవితలో అభ్యుదయ కవి ఉనికిని ప్రశ్నిస్తాడు.

నీ గుణం ఛందస్సులో లేక
వ్యాకరణం నీ రూపమే కాక
అలంకారాలు అసలే పట్టించుకోక

ఎక్కడయ్యా మరి నీ ఉనికి? అని ప్రశ్నిస్తాడు. వెంటనే ఆ కవిని తానే వెతికి పట్టుకున్నానంటాడు. కొత్తంటే గొంతు పిసుక్కునేవాళ్ళు, కొరివి దయ్యాలు, వెనక్కి నడిచే వారు అంటూ ప్రగతికి విరుద్ధమైన వారిని విమర్శిస్తాడు. పత్తాలేని నిన్ను శ్రమపడి సత్తాలేని నేను సాధించబూను కున్నాను అంటూ ఆశాభావాన్ని ప్రకటిస్తాడు.

రెండు చిన్న పదాలతో 'ఏదీఏదీ ఆ పువ్వు పేదల పాలిటి చిరునవ్వు' అంటూ అదే అభ్యుదయంగా వర్ణిస్తాడు.

ప్రజాశక్తి పట్ల తనకున్న అచంచల విశ్వాసాన్ని ప్రకటిస్తూ ....

ప్రత్యక్షంగా ప్రజలశక్తి
ప్రకృతిని గెలుస్తున్న చోటుకు నేనే వెళ్తున్నాను అంటూ ప్రకటిస్తాడు.

నిజమైన జనధర్మం పలికే నోరు
లోకంలో కవిది ఒకటే
నిజమైన జనధర్మం పలికే తీరు

లోకంలో కవిత ఒక్కటే ... అంటూ కవుల బలాన్ని కవిత్వ బలాన్ని కవిత్వం, సాహిత్యం ప్రజల ధర్మాన్ని పలికే తీరును ధృడంగా పలుకుతాడు.

ఇట్లా కుందుర్తిని అభ్యుదయ కవితావేత్తగా నిరూపించ డానికి ఎన్నో చెప్పవచ్చు. అభ్యుదయ కవిగా కుందుర్తిని సాహితీలోకానికి పరిచయం చేసింది 'నయాగరా' కావ్యం. అభ్యుదయతత్వం నిండి వున్న కావ్యంగా చెప్పుకోవచ్చు.

చివరగా అభ్యుదయ కవిత్వంపట్ల కుందుర్తి అభి ప్రాయాలతో ఈ పత్రాన్ని ముగిస్తాను.

అభ్యుదయ కవితావిప్లవం తెలుగు సాహిత్యంలో నన్నయ కాలంనుంచి వచ్చిన అన్ని విప్లవాల్లోకి మౌలిక మైనదీ, సమగ్రమైనదీ. తరతరాల నాటి కవిత్వపు విలువ లనూ, విశ్వాసాలను అది కూకటి వ్రేళ్ళతో కూల్చివేసింది. పునాదులను కదిలించింది. సుమారు 1910 సంవత్సర ప్రాంతంలో ప్రారంభమై పాతిక సంవత్సరాలు సాగిన భావ కవిత్వోద్యమాన్ని చావుదెబ్బ కొట్టింది. ఈ ప్రభావంతో ఉన్న కవులందరి ఆశయమూ ఒకటే. కవిత్వాన్ని ప్రజల దగ్గరకు తీసుకుపోవాలి. పండిత వర్గాల చెరనుంచి విడిపించాలి. ఎవరికి ఇష్టం ఉన్నా లేకున్నా అభ్యుదయ సాహిత్యోద్యమం మార్క్సిజం ప్రచారం చేసిన ఊహలకే ప్రభావితమైన ఉద్యమమని చెప్పకతప్పదు.

వచన కవిత్వం ఇంకా ప్రజలకు చేరువవ్వాలి. అట్టడుగు వర్గాల కవిత్వమైన జానపద సాహిత్యం వైపే నడవాలి. అలా జరిగినప్పుడే అభ్యుదయ కవిత్వోద్యమ లక్ష్యం నెరవేరుతుంది అనే స్పష్టమైన అవగాహన కుందుర్తికి ఉంది కనుకనే ఆయనను అభ్యుదయ కవితావేత్తగా గుర్తిస్తాము. ★

BHAVAVEENA
Vol. 19, Issue. 2 (2), February - 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

ఏకదేశి వ్యాకరణాలు : లఘు సమీక్ష

– డా॥. కులశర్ల శ్రీనివాసరావు, తెలుగుశాఖ, ఆంధ్ర విశ్వకళాపరిషత్, విశాఖపట్నం.

ప్రవేశిక :

"వ్యాక్రియంతే శబ్దా: అనేన ఇతి వ్యాకరణం"

అంటే ఈ శాస్త్రం చేత శబ్దాలు వ్యాకరింపబడతాయని అర్థం. వ్యాకరించటమంటే "ప్రకృతి ప్రత్యయాది విభాగేన వ్యుత్పాదనమ్ తత్ వ్యాకరణేన సాక్షాత్ క్రియతే".

ప్రకృతి, ప్రత్యయాది విభాగం చేసి శబ్దాలకు వ్యుత్పత్తుల్ని చెప్పటమే వ్యాకరించటమని భావం.

వ్యాకరణానికి శబ్దానుశాసనం, శబ్దశాస్త్రం అని పర్యాయ పదాలున్నాయి. ఇది శబ్దాలకు సంబంధించిన శాస్త్రం కాబట్టి శబ్దశాస్త్రం అయింది.

వ్యాకరణం భాష యొక్క నిర్మాణ స్వరూపాన్ని తెలియ జేసే శాస్త్రమేగాని, భాషను నిర్మించే శాస్త్రం కాదు. వేదకాలం నాటికే వ్యాకరణం ప్రత్యేక శాస్త్రంగా అభివృద్ధి చెంది, షడంగాలలో ఒకటిగా గుర్తింపబడింది. షడంగాలలో జ్యోతిష్యం, కల్పం తప్ప మిగిలిన నాలుగు శిక్ష, వ్యాకరణం, ఛందస్సు, నిరుక్తాలు భాషా సంబంధమైన శాస్త్రాలు. ఈ నాలుగింటిలో వ్యాకణానికే ప్రాధాన్యమీయ బడింది. అంటే వైయాకరుణులకే మంచి గుర్తింపునిచ్చారని అర్థమవుతుంది.

సమీక్ష :

తెలుగులో వచ్చిన వ్యాకరణాలు ఎక్కువగా బాల-ప్రౌఢ వ్యాకరణాల పద్ధతిలో రచింపబడ్డాయి. పరిచ్ఛేద విభాగాలు కూడా కొంత తేడాతో ఒకేరకంగా ఉన్నాయి. కొంతమంది వ్యాకర్తలు ఒకే విషయాన్ని తీసుకొని వ్యాకరణాలు రచించారు. వాటిని ఏకదేశి వ్యాక రణాలంటారు. ఆవిధంగా వర్ణాలు, అర్థానుసారం, రేఫలు, విభక్తులు, ధాతువులు మొదలైన అంశాలతో రూపొం దించారు.

వ్యాకర్తలలో కొంతమంది రెండు రకాల రేఫలను గూర్చి చర్చించారు. సాధురేఫ- శకటరేఫలకు యతిప్రాస లలో మైత్రి ఉండకూడదని లాక్షణికుల అభిప్రాయం. రేఫ ఱకారాలను గూర్చి మొదట గ్రంథరూపంలో తెచ్చిన వాడు తాళ్లపాక పెద తిరుమలయ్య. ఆయన తద నంతరం పెద్దపూడి భద్రన, చల్లాపేరయ్య, భారతం లక్ష్మీపతి, ఓరిగాల రంగనాథకవి, సి.పిబ్రౌన్, బహుజనపల్లి సీతారామాచార్యులు, వజ్ఝల చిన సీతారామాస్వామి శాస్త్రి మొదలైన వారు రెండు రేఫలును గూర్చి రచించారు.

బహుజనపల్లి సీతారామాచార్యులు తన "బాలచంద్రో దయము" గ్రంధంలో ప్రాచీనకాలంలో భాషలో ఉండి ఉచ్చారణలేని అర్థానుస్వార తత్వాన్ని పరిశీలించారు.

వర్ణవిధానాన్ని గురించి 'అక్షరగుచ్ఛము' పేరుతో చిన్నయసూరి వెలువరించారు. దీనిలో అచ్చులు-హల్లుల్ని వివరించి, హల్లుల అంతర్విభాగాన్ని రేఖాపటంలో చూపించారు. వర్ణోత్పత్తి స్థానాలను సూచించి, గుణింతాన్ని గుణింత సూత్రాలను చూపారు. ఈ అక్షర గుచ్ఛమే ఆ తర్వాత నారాయణం అహోబలయ్య చేత "నవీనాక్షర గుచ్ఛమ"ను పేరుతో కూర్చబడింది.

పానుగంటి పార్థసారధిరాయణింగారు "ఆంధ్రా క్షరములు" పేరుతో రచించిన గ్రంథంలో కొన్ని విశిష్ట ధ్వనుల వర్ణాలను కల్పించారు. 'తాటాకు'..... అనే పదంలో మిశ్రస్వరం, దంత్య్ర చజలు, ఇంగ్లీషులోని ఎఫ్ అక్షరం వకార భేదంగా ఉండటంతో పాటు మరికొన్ని విశేషాలను పేర్కొన్నారు. అర్థానుస్వారాన్ని గూర్చి బహజపల్లి సీతారామాచార్యులుగారి 'బాల చంద్రో దయం'తో పాటు, టి.ఎం.శేషగిరిశాస్త్రిగారి 'అర్థానుస్వార తత్వము" కూడా వెలువడింది. బహుజనపల్లి వారు నిఘంటు నిర్మాణంలో తనకు లభించిన అరసున్న తోడి పదాలను అకారాదిగా తెలియజేశారు.

శేషగిరి శాస్త్రిగారు తమ 'అర్థానుస్వార తత్త్వములో ఖండ బిందువు పుట్టు పూర్వోత్తరాలు, దాని స్వరూప స్వభావాలను విశదీకరించారు. అంతేగాక అర్థానుస్వారానికి పూర్వకాలంలో నకారధ్వని ఉండి ఉంటుందని నిర్ణయించారు. అర్థానుస్వార శబ్దాల వ్యుత్పత్తుల్ని, భిన్న స్వరూపాలైన, పదాల పరస్పర సంబంధాలను తెలుసుకోవడానికి అవి అనుకూలంగా ఉంటాయని సోదాహరణంగా నిరూపించారు. అర్థానుస్వారానికి ఉచ్చారణా విధానం లేకపోయినా అది అనేక విధాలుగా ఉపయోగపడటం వలన, దానిని గ్రహించాలని తెలియజేశారు.

రేఫగూర్చి దాదాపు ఎనిమిది ఏకదేశి వ్యాకరణ గ్రంథాలు రచింపబడ్డాయి. తాళ్లపాక పెదతిరుమలయ్య రేఫ ఱకార నిర్ణయము' వానిలో మొట్టమొదటిది. దానిలో తనకు లభించిన మహాకవుల ప్రయోగాలలోని రేఫ ఱకారాలను పరిశోధనాత్మకంగా చూపాడు. పద్యమయ గ్రంథంగా ఉన్న దీనిలో రేఫతో ఉన్న శబ్దాలను గూర్చి 50 కంద పద్యాలలోను, శకటరేఫతో ఉన్న శబ్దాలను గేర్చి 50 కందపద్యాలలోను చెప్పాడు. కొన్నిచోట్ల రేఫ-ఱకార శబ్దాలకు అర్థాలను కూడా చూపినాడు.

అప్పకవీయంలో "తిరుమల దేశికుండు మొదలైన వారలు" అని తెలియజేసిన దానిని బట్టి, మరికొంతమంది రేఫ-ఱకారాలను గూర్చి గ్రంథ రచన చేసినట్లు తెలుస్తుంది. కాని ఆ గ్రంథ కర్త వివరాలతో పాటు, ఆ గ్రంథాలు కూడా లభించటం లేదు.

పెదపూడి భద్రన్న 'రేఫఱకార నిర్ణయము' పేరుతో 48పద్యాల గ్రంథాన్ని అందించాడు. దీనికి ఉదాహరణలు కాని, ఆ గ్రంథ వివరాలుగాని తెలియజేయలేదు.

గణపవరపు వెంకటకవి "రేఫనిర్ణయ తారావళి", చల్లా పేరయ 'శకట రేఫావళి' అముద్రితగ్రంథాలు.

రేఫ-ఱకారాలను గేర్చి "రేఫ-ఱకార వచ్చబ్ద జ్ఞాపక లోకోపకారము" అను గ్రంథ పరిచ్ఛేదాంత గద్యలో" ఇది శ్రీసుకవి మిత్ర సమస్త విద్యాధురంధర బ్రౌన్ సమాఖ్య పుత్ర సి.పి.బ్రౌన్ ఆఖ్య ప్రణీతంబైన రేఫ ఱకార వచ్చబ్ద జ్ఞాపక లోకోపకారకంబనియెడు గ్రంథంబునందు ప్రథమ పరిచ్ఛేదము" అని ఉండుట వలన ఇది సి.పి.బ్రౌన్ కృతమని తెలుస్తుంది. ఇది 9 పరిచ్ఛేదాలతో ఉంది.

"శకట రేఫ నిర్ణయము" గ్రంథంలో భారతం లక్ష్మీపతి తెలుగుభాషలోని శకటరేఫ పదాలను గ్రహించి, వాటికి లక్షణాలను సంస్కృత శ్లోకాలలోను, టీకను తెలుగులో తెలియజేశాడు. చాలా పదాలకు భారతం నుండి ఉదాహరణలు చూపాడు. శకటరేఫను గూర్చి విస్తృతంగా చర్చించిన వారిలో లక్ష్మీపతిని మించినవారు లేరు.

ఛందశ్శాస్త్ర లక్షణసార సంగ్రహము గ్రంథంలో-

"ఆంధ్ర భాషాభ్యసన జిగీషాత్ములగు వారికి సులభోపయుక్తంబుగా పాపినేని వెంకటస్వామి నాయుని గారిచే రచియింపబడి వావిళ్లరామస్వామి శాస్త్రుల చేత బరిష్కరింపబడి అది సరస్వతీ నిలయ ముద్రాక్షర శాలయందు ముద్రింపబడి రౌద్ర" సం.ఆషాఢ-బ 6 యందు బ్రకటింపబడియె.

అని తెలిపిన దానినిబట్టి దీనికర్త పాపినేని వేంకట స్వామి నాయుడు గారని తెలుస్తుంది. శకట రేఫల నిర్ణయాన్ని,

"దైవభాషను దద్భవ తత్సమముల
గ్రియల తుదలను నుండు నన్నియును రేఫ
లగును ద్విత్వమ గలిగిన యవియు దేశ్య
ములగు క్రచ్చఱ యూది పల్కులును ఱాలు"

అని వివరించిన దానినిబట్టి తత్సమ- తద్భవాల క్రియల చివర ఉండేవన్నీ రేఫలుగాను, దిత్వంతో కూడినవి శకటరేఫలు దేశ్యశబ్దాలుగా ఉంటాయని చెప్పబడింది. దీనిలో పద్యాలకు అవసరమైనచోట టీకను ఇచ్చి, అకారాది క్రమంలో పదాలకు అర్థాలీయబడ్డాయి. అర్థాలు కూడా పద్యమయంగా ఉన్నాయి. మొత్తం 34 పాదాలుగా గల సీసమాలికలో నిర్మించాడు.

బహుజనపల్లి సీతారామాచార్యులుగారు "అలఘు కౌముది" గ్రంథంలో శకటరేఫ శబ్దాలను గూర్చి లఘు గ్రంథంగా రూపొందించాడు. దానిని గురించి-

"ఆంధ్రభాష యందు లక్ష్యైక వేద్యములుగా నుండు విషయములు రెండు. అందొక్కటియగు సిద్ధఖంగాను స్వారమును గుఱించి మొదట వ్రాయబడెను. అలఘు రేఫ విషయమై నన్నయభట్టు, తిక్కన, ఎఱ్ఱాప్రగడ, నాచన సోమన, భాస్కరుడు, శ్రీనాథుడు, సూరన లోనగు మహా కవుల ప్రయోగము లనే తఱుచుగా, గొని దొరికినన్ని యాపదముల నేర్చి కూర్చి యలఘు కౌముది యను పేరిట నొక పుస్తకము వ్రాయబడియెను".

అని తెలిపిన దానిలో అకారాదిగా మొత్తం 265 పదాలను చూపినాడు.

ఓగిరాల రంగనాథకవి కృతమైన "ద్విరేఫ వర్ణ దర్పణము" గ్రంథాన్ని పూండ్ల రామకృష్ణయగారు పరిష్కరించి తమ అముద్రిత గ్రంథచింతామణిలో ప్రకటించారు. దీనిలో మొత్తం నాలుగు ఆశ్వాసాలున్నాయి. ప్రథమాశ్వాసంలో రేఫ స్వరూప నిరూపణం, ద్వితీయాశ్వాసంలో శుద్ధరేఫ గల శబ్దాలు- వాటికి ప్రయోగాలు, తృతీయాశ్వాసంలో శకటరేఫను గూర్చి, చతుర్థాశ్వాసంలో ఉభయరేఫలు- వానికి ప్రయోగాలు చెప్పబడ్డాయి.

"ఈ రేఫమ్ముల బ్రాక్తన సూరి గ్రంథములయందు శోధింపగ జే కూరిన యన్ని వచింతును"

అని తెలియజేసి మొత్తం 373 రేఫలకు ప్రయోగాలు ఇచ్చాడు.

ఏకదేశి వ్యాకరణాలలో మరికొన్ని పేర్కొనదగినవి ఉన్నాయి. వానిలో తత్సమ, తద్భవాలను గూర్చి వెలువడిన బహుజనపల్లివారి-వైకృత దీపిక, సన్నిధానం సూర్యనారాయణశాస్త్రిగారి-తత్సమచంద్రిక, చిన్నయసూరి -విభక్తిబోధిని, వి. సుబ్బారాయుడుగారి- విభక్తి చంద్రిక, మహాకాళి సుబ్బారాయుడు- విభక్తిదీపిక, సరస్వతి వేంకట సుబ్బారామశాస్త్రి- విభక్తి దీపిక, వేదం పట్టాభిరామశాస్త్రి- ఆంధ్రధాతుపాఠము, చిన్నయసూరి- ఆంధ్రధాతుమాల చెప్పదగిన గ్రంథాలు.

వ్యాకరణ గ్రంథాల్లో ఏక కావ్య వ్యాకరణ గ్రంథం ఒకే ఒక్కటి వెలువడింది. అది మానవల్లి రామకృష్ణకవి గారి నన్నెచోడుని కుమార సంభవ కావ్యభాషపై రచించిన "ప్రాచీన శబ్దానుశాసనము". మొత్తం 22 సూత్రాలలో సూత్రీకరించారు.

ఉపయుక్త గ్రంథ సూచి :

1. అహోబలుడు - "అహోబల పండితీయము".
2. కేతన మూలఘటిక- "ఆంధ్ర భాషా భూషణం" వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్, మద్రాసు, 1911.
3. చినసీతారామశాస్త్రి, వజ్జల- "వయాకరణ పారిజాతం"
4. చినసీతారామశాస్త్రి, వజ్జల- "వ్యాకరణ సహితా సర్వస్వము"
5. నాగభూషణం అంబడిపూడి- "బాలవ్యాకరణ వికాస వివేచనము"
6. పురుషోత్తం, బొడ్డుపల్లి- "తెనుగు వ్యాకరణ వికాసము", శ్రీ గిరిజా ప్రచురణలు, కొత్తపేట,గుంటూరు-11
7. రాజేశ్వర శర్మ, అమరేశ్వరం- "ఆంధ్ర వ్యాకరణ వికాశము" ప్రాచ్య విద్యా పరిషత్తు, కామారెడ్డి, 1973.
8. రామబ్రహ్మం, బేతవోలు- "తెలుగు వ్యాకరణాలపై సంస్కృత,ప్రాకృత వ్యాకరణాల ప్రభావం"
9. లలిత, జి. -"తెలుగు వ్యాకరణముల చరిత్ర"-వెలగపూడి ఫౌండేషన్, మద్రాస్.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 2 (2), February - 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

మలయాళంలో మహాభారతాలు

– డా॥. వి. వళని, సహాయాచార్యులు, తెలుగు శాఖ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

ఈ వ్యాసంలో మలయాళ భాషలో వెలువడిన మహా భారతాలనుననుసరించి వివరించే ప్రయత్నం చేస్తాను.

"వేదములకు నఖిల స్మృతి
వాదములకు బహు పురాణ వర్గంబులకున్
వాదైన చోటులను దా
మూదల ధర్మార్థకామ మోక్షస్థితికిన్" (విరాట 1-4)

వేదాలకు, స్మృతులకు, పురాణాలకు, ధర్మ, అర్థ, కామ, మోక్షాల ఆచరణ విషయాల్లో సందిగ్ధం ఏర్పడితే మహాభారతం పురుషార్థాన్ని నిర్ణయించే శక్తిగా నిలుస్తుందని కీర్తించాడు. ఇటువంటి విశిష్టమైన ఇతిహాసం మహా భారతం. భారతం ప్రధానంగా సాహిత్య సృష్టి జరిగిన అన్ని ద్రావిడ భాషల్లోకి అనువాదమైంది. ఈ వ్యాసంలో మలయాళ భాషలో వెలువడిన మహాభారతాలను తులనాత్మకంగా వివరించే ప్రయత్నం చేస్తాను.

మలయాళ సాహిత్యంపై సంస్కృత ప్రభావం అధిక మైనప్పటికి కేరళీయులు జానపద సారస్వతం ద్వారా తమదైన ముద్రని, సహజ చైతన్యాన్ని ప్రకటించారని చెప్పవచ్చు. మలయాళ సాహిత్యంలోని మరొక ముఖ్య లక్షణం మణి ప్రవాళం. పాట్టు ప్రక్రియ మలయాళీల చేతనకు ప్రతీకయైతే, మణిప్రవాళం వారి ఆదరణకు ప్రతీక.

మొదటగా మలయాళంలో మహాభారతాన్ని అందించి నది కణ్ణశ్శ కవులు. వీరు పాట్టు ప్రక్రియతో మలయాళ సారస్వతంలో చెరిగిపోని ముద్రను వేసినారు. మాధవ ఫణిక్కర్, శంకర ఫణిక్కర్, రామఫణిక్కర్, అని కణ్ణశ్శ కవులు ముగ్గురు. మొదటి వారిద్దరూ అన్నదమ్ములు. మూడవ వాడైన రామఫణిక్కర్ వారి సోదరి పుత్రుడని కొందరు, సోదర పుత్రుడని కొందరు భావిస్తున్నారు. మొత్తంమీద ముగ్గురు ఒకే కుటుంబంవారు. 'కరుణేశన్' అనే వంశకర్తవల్ల వీరికి కణ్ణశ్శ కవులని పేరు కల్గింది. రామఫణిక్కర్ కరుణేశన్‌ను 'మహాత్ముడు, గురు పుంగవుడు, కవిరాజు' అని ప్రశంసించారు. కణ్ణశ్శ కవులు తిరువాణ్‌కూర్ ప్రదేశంలో తిరువిళ్ళా తాలూకాలోని 'నిరాణం' గ్రామానికి చెందినవారు కావడం వల్ల వీరికి 'నిరాణం' కవులు అనే ప్రసిద్ధికల్గింది. వీరు 14వ శతాబ్దం ఉత్తరార్ధంలోను, 15వ శతాబ్దానికి పూర్వార్ధంలోను ఉన్నట్లు తెలుస్తుంది. వీరిలో మాధవ ఫణిక్కర్ భగవద్గీతను, శంకర్ ఫణిక్కర్ భారతాన్ని, రామఫణిక్కర్ భారత, భాగవత, రామాయణ, శివరాత్రులు అనే గ్రంథాలను రచించారు.

మాధవ ఫణిక్కర్ భగవద్గీతను, మలయాళంలో భారతంలోని వస్తువును గ్రహించి రాసిన మొదటి గ్రంథంగా చెప్పవచ్చు. కొందరు దీనిని భగవద్గీతకు భారతీయ భాషల్లో వెలువడిన మొదటి అనువాదమని భావిస్తున్నారు. (మలయాళ వాఙ్మయ చరిత్ర, పి.కె. పరమేశ్వర నాయర్) ఈ కవి శంకర భగవత్పాదుల గీతాభాష్యాన్ని సమగ్రంగా అవగాహన చేసుకొని, వ్యాసుని గీతలోని భావాల్ని లోతుగా అర్థం చేసుకున్నాడని పిస్తుంది. గీతలోని మొత్తం 700 శ్లోకాల్ని ఈయన 328 ద్విపదల్లో సంగ్రహించాడు. మొత్తం భగవద్గీతను కేవలం 49 పద్యాల్లోనే చెప్పగల ప్రాజ్ఞుడు తిక్కన సోమయాజి, ఆయన భగవద్గీతను విపులంగా అనువదించి ఉంటే తెలుగువారు తాత్త్విక సముద్రం లోతును చూడగలిగే వారనడంలో సందేహం లేదు.

శంకర్ ఫణిక్కర్ భారతమాల మూల భారతానికి చాలా సంగ్రహరూపం. ఇది 1363 ద్విపదల్లో రచించబడింది. మలయాళంలో వెలువడ్డ మొదటి భారతంగా దీన్ని భావించవచ్చు. కథాగతికి ఈ గ్రంథం ప్రాధాన్యమిచ్చింది.

రామఫణిక్కర్ కణ్ణశ్శ కవులలో ప్రముఖుడు. ఈయన రచించిన 'కణ్ణశ్శ భారతం' పఠితులను ఆకట్టుకునే కథన విధానంతో సాగుతుంది. ప్రాచీన ఆధునిక మలయాళాల్లో లేని పదాలు కొన్ని కణ్ణశ్శ కవులలో దర్శనమిస్తున్నాయి. వీరు స్వీకరించిన పాట్టు ప్రక్రియలో కూడా దీర్ఘమైన సంస్కృత సమాసాలున్నాయి. మలయాళ కవితా కన్యకు ఆత్మవిశ్వాసం, సౌందర్యం, ప్రాగల్భ్యం కల్గించి మనోహర మూర్తిని చేసింది రామఫణిక్కరేనని కేరళీయుల విశ్వాసం. కణ్ణశ్శ భారతం కూడా వ్యాస భారత కథకు సంపూర్ణాను వాదం కాదు.

కణ్ణశ్శ కవుల తర్వాత మలయాళంలో వెలువడ్డది 'చెరుస్సరి' లేదా 'చెరుశ్శేరి భారతం' కవి ఇంటిపేరైన చెరుశ్శేరి పేరుతోనే ఇది జన బాహుళ్యంలో స్థిరపడింది. ఈ భారత కర్తను చెరుశ్శేరి శంకరన్ నంబూద్రిగా పరిశోధకులు గుర్తించారు. 'భారతగాథా, కృష్ణగాథా' అనేవి ఇతని రచనలు, రెండూ గాథా ఛందస్సులోనే ఉన్నాయి. ఈ రెండింటిలో కృష్ణగాథకు ప్రాచుర్యమెక్కువ, నంబూద్రీలు ఉత్తరాదినుండి వచ్చి స్థిరపడిన వారు కావడం వల్ల వీరికి ఆర్య సంస్కృతిపైన, సంస్కృత భాషపైన అభిమానం ఎక్కువ. వీళ్ళు మణి ప్రవాళంలో మలయాళ పదాలే ఎక్కువగా ఉండాలన్న 'లీలాతిలకం' లక్షణాన్ని లెక్కచేయ లేదు. అందులోనూ చెరుశ్శేరి. సంస్కృతంలో పారమంటిన పండితుడు. ఈయన సంస్కృత పదాలనే కాకుండా సంస్కృత విభక్తులను కూడా యథాతథంగా మలయాళం లోకి దిగుమతి చేసేందుకు ప్రయత్నించాడు.

చెరుశ్శేరి, తిక్కన భారతాల్లో కొన్ని పోలికలున్నాయి. తిక్కన సోమయాజి విరాటపర్వంలోని ఉత్తరగోగ్రహణ ఘట్టంలో ద్రోణుని చేత అర్జునుణ్ణి ప్రశంసింపజేసిన పద్యం ప్రసిద్ధమైంది.

శా॥ "సింగంబాఁకటితో గుహాంతరమునం జేడ్పాటుమై నుండి మా
తంగ స్ఫూర్జిత యూధ దర్శన సముద్యత్క్రోధమై వచ్చునో
జం గాంతార నివాసఖిన్నమతి నస్మత్సేనపై వీఁడె వ
చ్చెంకుంతీసుతమధ్యముండు సమరస్థేమాభి రామాకృతిన్"

(విరాటపర్వం, చతుర్థాశ్వాసం-95)

చెరుశ్శేరి భారత కర్త కూడా,

"వారణ జాలతై కండొరు నేరత్తు
పారాదె చెల్లున్న సింహంబోలె
నేరెపోయ్ చెల్లున్న పార్థనె కండిట్టు
వీరవాయుళ్ళొరు భీష్మర్ చొన్నాన్"
మండి వరున్నదు షండనల్లేదు మె
విండలర్ కోనుడె సూను వత్రె
ఉగ్ర నాయుళ్ళవన్ తన్నోడు చెంచమ్మె"

(చెరుశ్శేరి భారతం, 32వ అధ్యాయం)

ఏనుగు గుంపులను చూసినపుడు ఎదురపడే సింహం లాగా పార్థుని చూసి వీరుడైన భీష్ముడే అంటున్నాడు. ఆ వస్తున్నవాడు షండుడు కాడు ఇంద్రుని కుమారుడు, ఉగ్ర స్వరూపుడైన అతని ధాటికి తట్టుకోలేము. అంటూ చెరుశ్శేరి కారుడు భీష్ముని నోట పల్కించాడు.

16వ శతాబ్ది వాడైన 'తుంజత్తు ఎళుత్తచ్చన్' ఆధునిక మలయాళ వైతాళికుడు. 'పాట్టు' ద్విపదలోని సంగీత శక్తిని, మణి ప్రవాళంలోని వ్యక్తీకరణ సామర్థ్యాన్ని ఎళుత్తచ్చన్ చక్కగా సమన్వయించినవాడు. ఆయన రచించిన 'మహాభారత కిళిప్పాట్టు' మలయాళ సారస్వతానికే తలమానికమైంది. కిళిప్పాట్టు అంటే చిలుకపాట అని అర్థం. కావ్యారంభంలోనే చిలుకరావడం, దానిని స్వాగతించి సత్కరించడం, కథ చెప్పమని ప్రార్థించడం, తర్వాత కథ నడవడం ఈ 'కిళిప్పాట్టు' ప్రత్యేకత.

"శ్రీమయ మాయా రూపం తేడుం పైంగిలి పెణ్ణే
సీమ యిల్లాద సుఖం నల్కణం ఎనిక్కునీ
శ్యామళ కోమళ నా యూడున్న నారాయణన్
తామరస సాక్షన్ కథకేళ్ ప్పాన్ ఆగ్రహిచ్చుజ్ఞాన్"

'శ్రీకరమయిన మాయారూపివైన ఓ చిలుకమ్మా! ఎల్లలులేని ఆనందాన్ని నాకు ప్రసాదించు. శ్యామల

కోమల గాత్రుడయిన నారాయణున్ కథను వినినిష్ట మౌతున్నది నాకు.'

ఎఱుత్తచ్చన్ భక్తి ఉద్యమ కాలంలోని కవి. అంతేకాదు ఉద్యమ స్ఫూర్తి దాతల్లో ఒకడు. అందుకే ఈయనలోని భక్తి భావావేశం అలౌకిక వీథుల్ని దర్శిస్తుంది. కర్ణుని వధిస్తానని ధర్మరాజుకు ప్రతిన చేసి అర్జునుడు పార్థ సారథితో వస్తున్నాడు. కర్ణునికి సారథ్యం చేస్తున్న శల్యుడు పార్థసారథిని చూశాడు. ఆ సందర్భంలో కృష్ణుని లీలా మానుషత్వాన్ని కర్ణునికి చెపుతూ శల్యుడు చేసిన కృష్ణవర్ణన మలయాళీల నాల్కలపై నిత్యం నాట్యం ఆడుతూ ఉంటుంది.

"నిరన్న పీలికళ్ నిరక్కవే కుత్తి
నెరుకయిల్ కూట్టిత్తిరమొడు కెట్టి
కవిముకి లొత్త చికుర భారవుం
మణికళ్ మిన్నున్న మణి కిరీటవుం
కున కునచ్చిన్నుం కురుళ్ నిరతన్మేల్
నను ననప్పాడి ఞ్ఞారు పాడి పట్టి
త్తిలకపు మొట్టు వియర్పినాల్ నన
ఞ్ఞలగు సృష్టిచ్చు భరిచ్చు సంహరి
చ్చిళకున్న చిల్లీయుగళ భంగియుం."

(కిళిపాట్టు-577)

"ఈ కలు చక్క తీర్చి నెత్తిమీద
మనోహరంగా కట్టిన నెమలి పించం
నీల శకలోపమ కైశిక భారం
దగద్ధగిత మణి కిరీటం
ముంగురులు దోగాడె పాల భాగం
తీర్చిదిద్దిన తడి తిలకం
చెమటలో ముద్దయిన రూపం
లోకాన్ని సృష్టించి రక్షించి హరించే
కదలాడె కనుబొమల మనోహరత్వం"

అంటూ సుదీర్ఘంగా, మనోహరంగా సాగిపోతుందీ వర్ణన.

ఎఱుత్తచ్చన్ భారతంలో కథా కేంద్రం కృష్ణుడే చిలుకను కథ చెప్పమని అడిగినప్పుడే కవి ఈ విషయాన్ని స్పష్టం చేశాడు. శ్రీకృష్ణుని దివ్యత్వం ప్రకాశించే విధంగా కథా సంవిధానమంతా కల్పించబడింది. ఎఱుత్తచ్చన్ భారతం సంస్కృత మూలానికి సంక్షేప రూపమే. ఎఱుత్తచ్చన్ భావావేశం స్వచ్ఛందమైనది. విశుద్ధమైనది. కథాకథన కౌశలంలో, సన్నివేశకల్పనలో, రసపాత్ర పోషణల్లో ఎఱుత్తచ్చన్ అద్వితీయుడు. అతని మాటలు, సూచించిన దానికంటే గొప్ప అర్థాన్ని వ్యక్తం చేస్తూ రసానందాన్ని కలిస్తాయి.

ఎఱుత్తచ్చన్ కవిగా నన్నయ, తిక్కనలతోనూ, భక్తకవిగా పోతనతోనూ పోల్చదగినవాడు. శకుంతల ఆశ్రమాన్ని విడిచి వెళ్ళే సందర్భంలో ఆమె మానసిక స్థితిని, కణ్వముని పరివేదనను వర్ణించిన తీరు ఎఱుత్తచ్చన్ లోక పరిశీలనకు, భావయుక్తమైన భాషా పటిమకు రసావిష్కరణ చేయగల పద ప్రయోగ శక్తికి తార్కాణంగా చెప్పవచ్చు. శకుంతల తండ్రిని విడువలేక, మదిలో దుఃఖం పొంగుచుండగా, ఊరట పొందలేక, జారుతున్న వేడి కన్నీటిని తుడుచుకుంటూ, చేతులు మోడ్చి భక్తితో నమస్కరిస్తూ, తన కుమారుడు కణ్వుని చుట్టూ తిరుగుతుండగా, గాద్గిదికమైన వీడ్కోలు వాక్యాలను పల్కుతూ, కలత పొందిన శకుంతల లేచి నిల్చిందని వర్ణించాడు.

ఇక, కణ్వముని అయితే భరతుని ఆలింగనం చేసుకుని పరవశించాడు. శిరస్సుని పలుమార్లు ముద్దాడి, చిరంజీవిపై వర్ధిల్లుమని దీవించాడు. అర్చన పాత్రలను చేత బట్టి ఆశీశ్శతములను వర్షించాడు. తర్వాత శకుంతలను ప్రేమతో నిమిరి ఘనమైన సుఖములు పొందగలవని అన్నాడు. అప్పటికే ఆయన కళ్ళ నుండి అశ్రువులు అవధులు లేక జాలువారుతున్నాయి. గుండె గతిని తప్పి తాపసి గాంభీర్యాన్ని విడిచి ఊర్పులు విడుస్తూ మనస్సు కదులుతుండగా కలతను ఓర్చుకోలేక వేయిమాట లెందుకు ప్రాకృత ప్రేమకు ఆర్ద్రమైపోయాడు. అంత రాంతరాల్లో అతనికి రాగ సంజాతవేదనా సమ్మర్థమైనదని వర్ణించాడు.

ఈ నన్నివేశంలో ఆడపిల్ల అత్తవారింటికి వెళ్ళే సమయంలో మున్యాశ్రమంలో పెరిగిన శకుంతల కూడా స్త్రీ సహజమైన రాగబుద్ధిని కోల్పోలేదు. కణ్వమునిని శమదమాదులుగల ఋషిగా గాక మానవ సహజమైన పరివేదన పొందిన తండ్రిగా తీర్చిదిద్ది కరుణ రస ప్లావితం చేశాడు ఎఱుత్తచ్చన్.

ఈ సందర్భంలో నన్నయ పౌరాణిక పద్ధతిలో కథాకథనం చేశాడు.

తే॥. "తల్లి! నీకులగోత్ర సౌందర్యములకు
దగిన పతిఁగంటి, దానికిఁ దగఁగ గర్భ
మయ్యె! నీదు గర్భమున వాఁడఖిల భువన
వహన మహనీయుఁడగు చక్రవర్తి సుమ్ము"
(ఆదిపర్వం, చతుర్థాశ్వాసం 62)

ఆ॥ ఎట్టిసాధ్వులకును బుట్టిన యిండ్లను
బెద్దకాల మునికి తద్ద తగదు
పతులకడన యునికి సతులకు ధర్మువు
సతుల కేడుగడయుఁ బతులచూవె.
(ఆదిపర్వం, చతుర్థాశ్వాసం-66)

అని చెప్పి ఆమె కోరిన వరమిచ్చి భరతుడు జన్మించిన తర్వాత ఇలా అన్నాడు.

వ. "కావున నీ విక్కుమారునిం దోడ్కొని నీపతి పాలికి నరుగు' మని పంపాడు. ఇక్కడ నన్నయ భట్టు కణ్వమునిని ధార్మిక దృష్టితోనే తీర్చిదిద్దటం కన్పిస్తుంది. నన్నయ సూక్తి నిధి, జగద్ధితంబుగా భారత సంహితా రచన చేసిన ధార్మికుడు.

వీర, రౌద్ర రసావిష్కరణలో తిక్కన, ఎఱుత్తచ్చన్‌ల మధ్య చాలా సామ్యమున్నది. దుశ్శాసన వధ సందర్భంలో భీముని రౌద్రాకారాన్ని ఎఱుత్తచ్చన్

".....కైవాళాల్
పాళిచ్చు మారిడం నఖంగ శెకొండుం
పాడు పాడె ప్పాడిచ్చుడి నుడనుడన్
చుడు చుడ త్తిళచ్చరుని యార్ పోలె
తుడు తుడె వరుంరుధిర పూరలై
క్కుడు కుడె కుడిచ్చు అలరిచ్చాడియుం
పెరువెళ్లం బోలె వరున్న శోణిత
మొరుతుళ్ళి పోలుం పురత్తు పోగాదె"
"కైవాళంతో పొడిచి పొడిచి
గోళ్ళతో చీల్చి చీల్చి
గల గల పారే సెలయేటిలాగ
పొంగే నెత్తురంతా
గడగడ జుర్రుతూ గెంతులు వేస్తూ
నెత్తుటి వెల్లువ నంతా ఒక్క బొట్టు జారనీక".

అని వర్ణిస్తూ ఇంకా,

"అతని ప్రేవులు పైకి లాగి
అగ్ని దండల్లాగా మెడలో వేసి
కాళ్ళను దట్టిస్తూ దుమ్మురేపుతూ
ఒడలు చరస్తూ, భూమిని వణికిస్తాడని" వర్ణించాడు.

ఈ సన్నివేశాన్ని ఊహించుకుంటేనే గుండె దడ దడలాడుతుంది. దుశ్శాసుని స్థితిని తలచుకోవడానికే భయమేస్తుంది. భీముని రౌద్రాకారం మనముందు భీకరంగా నిలుస్తుంది.

ఈ సన్నివేశంలో తిక్కన,

మ॥ "నరసింహుఁడసురేంద్రు వ్రచ్చుకరణి, రౌద్రం
బుదగ్రంబుగా
నుర మత్యుగ్రతఁజీరి, క్రమ్మ్ర రుధిర
మ్ములాసియై దోయిట
న్వెర వారం గొని త్రావు, మెచ్చుఁ జనికి, న్మేనుల్
మొగంబున్ భయం
కరరేఖం బొరయంగఁ జల్లికొను, నక్కొరవ్వుఁ
జూచుంబొరిన్,"
(కర్ణపర్వం, తృతీయాశ్వాసం-214)

ఈ సన్నివేశం తిక్కన రసావిష్కరణ శక్తికి ప్రతీక. "కుడె కుడిచ్చు అలరిచ్చాడియుం"/"దోయిట న్వెర వారం గొని త్రావు, మెచ్చుఁ" అని ఇద్దరు కవులు ఒకే అంగిక చర్యను

వర్ణించారు. ఇద్దరు కవులు సన్నివేశాన్ని సహజమైన అంగిక చర్యలతో, నాటకీయ రామణీయకతతో చెప్పడంలో సిద్ధహస్తులు. దుశ్శాసన వధ సందర్భంలోనే వీరిరువురి మధ్య ఇటువంటి సామ్యం స్పష్టంగా కన్పిస్తున్నది. ఎళుత్తచ్చన్ వర్ణించిన భీముడు దుశ్శాసనుని నేలపై పడవేసి అతని ఎముకలు నుగ్గు అగునట్లు పిడికిలితో కొడుతూ ఒళ్ళు చరుచుకుంటూ-

"ముడనుడన్ చాడిత్తుడ మేలే తచ్చుం
పశుసమన్మార్ పాండవన్మార్ ఎన్నల్లో
పఱష్టిదు మున్నం వలరుం కేళ్కవే
పరిహాసత్తోడు మదిచ్చుకై కొట్టి
చ్చిరిచ్చు కుత్తడి నడున్ను నిష్టలుం
పశు సమ్మన్మార్ కౌరవ రెన్నిక్కాలం
పఱఇష్ట ఞాన్ తాను వితా కూత్తాడున్నేన్".

"పశువులతో సమానులు పాండవులు అని కదరా నీవన్నది
అందరూ విన్నారు లేరా
పరిహాసంగా చేతులు తట్టి
ఎకసెక్కం చేస్తూ ఇటూ అటూ తిరుగుతూ
కౌరవులే పశుసమానులు అని ఇప్పుడు అంటాను నేను.
ఎకసెక్కమాడతాను నేను"

- అని భీముని ఆంగిక చర్యలను వర్ణిస్తూ మాటల్లోని వ్యంగ్య ధోరణిని మనస్సుకు హత్తుకొనేట్లు చిత్రించారు. ఈ సందర్భంలో తిక్కన,

వ॥ 'చలంబు నెఱియ నతని కాలుగేల నమర్చి మొగంబు గనుంగొనుచు నక్కిమ్మీరవైరి యిట్లనియె' (కర్ణపర్వం, తృతీయాశ్వాసం - 220)

క॥ "ఏమిర! పసులని యార్వవు?
నీ మాటలు నిలువఁబడియెనే? పసరమ మి
మ్మేము మగుడ నిదె యార్చెద
మీ మాటకు మాఱు వల్క రెవ్వరుగంటే?"
(కర్ణపర్వం, తృతీయాశ్వాసం-221)

ఇరువురు 'పసరమ' అనడం, కౌరవులే పసరము లంటాను, ఏమి చేస్తావని? ఎదురు ప్రశ్నించడం వంటి సామ్యప్రయోగాలు చేశారు. పగపెచ్చుమీరగా అతడి కాలు చేతితో పట్టి ముఖాన్ని చూస్తూ భీముడు మాట్లాడటం నాటకీయత. తిక్కన వ్యంగ్య ధోరణి హృద్యమైంది. అనన్య సామాన్యమైంది కూడా! ఈ విధంగా ఎళుత్తచ్చన్, తిక్కనల మధ్య నాటకీయత, రసావిష్కరణలో చాలా సామ్యాలు కన్పిస్తున్నాయి. అయితే ఎళుత్తచ్చన్ కవితా లక్ష్యం భక్తి ప్రతిపాదనే. తిక్కనకు అనన్య సామాన్య కరణంబగు పరమ ధర్మం బోధించుట.

ఆధార గ్రంథాలు :

1. తమిళ వాఙ్మయ చరిత్రము, ము. వరదరాజన్, అనువాదం- తిమ్మావజుల కోదండరామయ్య, సాహిత్య అకాడమి, ఢిల్లీ.
2. కన్నడ సాహిత్య చరిత్ర, ఆర్వీయస్. సుందరం, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు.
3. దక్షిణ భారత సాహిత్యములు, చల్లా రాధాకృష్ణశర్మ, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు.
4. తెలుగు కన్నడ భారతముల తులనాత్మక పరిశీలనము (తిక్కన, కుమార వ్యాసుల విరాటోద్యోగ పర్వములు) డా॥ బి.వి.ఎస్. మూర్తి, (తి.తి.దే. వారి ఆర్థికసహాయం)
5. తమిళాంధ్ర భారతముల తులనాత్మక పరిశీలనము, శ్రీ వి.ఎస్. రాఘవన్, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి. హైదరాబాదు.

6. మలయాళ వాఙ్మయ చరిత్రము, పి.కే. పరమేశ్వరన్ నాయర్, (డా॥ దివాకర్ల వేంకటావధాని). సాహిత్య అకాడమీ, ఢిల్లీ.
7. పంపకవి-తిక్కన, శ్రీ గడియారం రామకృష్ణశర్మ.
8. తిక్కన భారతం - మలయాళ భారతం, డా॥ ఎన్. భక్తవత్సలరెడ్డి, తిక్కన తిరునాళ్ళ 716వ వర్ధంతి సప్తాహ సంచిక, నెల్లూరు.
9. శ్రీమదాంధ్ర మహాభారతం, తి.తి.దే., తిరుపతి.
10. విక్రమార్జున విజయ, పంప, కన్నడ సాహిత్య పరిషత్తు, బెంగళూరు
11. గదాయుద్ధ, రన్న, కన్నడ సాహిత్య పరిషత్తు, బెంగళూరు.
12. గదుగిన భారత - ఒందు సాహిత్య అధ్యయన, జవరేగౌడ, కర్ణాటక విశ్వవిద్యాలయం, ధారవాడ.
13. మహాభారత కిళిప్పాట్టు, ఎళుత్తచ్చన్.
14. మహాభారతము - సాహిత్య అకాడమి, ఢిల్లీ.
15. ఆంధ్రసాహిత్య చరిత్ర, పింగళి లక్ష్మీకాంతం, హైదరాబాదు
16. తిక్కన, కుమార వ్యాస భారతముల తులనాత్మక పరిశీలన, జగన్నాథాచార్, అనంతపురం.
17. భారత కథా మంజరి - కుమారవ్యాస.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 2 (2), February - 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

వలస కథల్లో... స్త్రీ పాత్రల చిత్రణ

– దూలం స్వరూప, పరిశోధకురాలు, తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయం, టిఎస్‌డబ్ల్యుఆర్‌డిసి, వరంగల్ ఈస్ట్.

మానవుడు కూడు గూడు గుడ్డకోసం వేల ఏళ్ళుగా ప్రస్థానం కొనసాగిస్తున్నాడు. నిజానికి మనదేశంలో కుల వృత్తులతో వేల ఏళ్ళుగా ప్రతి గ్రామం స్వాలంబనతో కొనసాగుతుంది. పారిశ్రామిక విధానంలో కుల వృత్తులు కూలిపోయాయి. జీవనం భారమై, జీవితం దుర్భరమై బతుకుదెరువు కోసం, బుక్కెడు బువ్వకోసం కడుపు చేతబట్టుకొని, కన్నవాళ్ళను, కట్టుకున్న వాళ్ళను విడువలేక మనసు చంపుకొని పుట్టేడు దు:ఖాన్ని నెత్తిమీద పెట్టుకొని వలసలు వెళ్ళుతున్నాడు. తెలంగాణ పల్లెల్లో ఆర్థికంగా చితికిపోయిన ప్రతీ యువతీయువకులకు ముందుగా గుర్తుకు వచ్చేది. గల్ఫ్ దేశమే.

పెద్దింటి అశోక్ కుమార్ గారు రాసిన 'ఘర్షణ' కథలో వెంకెట్ అనే వ్యక్తి తన భార్య పిల్లలను వదిలి తాను మాత్రం విదేశాల్లో సంపాదనకోసం వెళ్ళినప్పుడు అతని భార్య అయిన సుజాత ఒంటరిగా ఉంటూ కుటుంబం లోని అత్త, తోటికోడళ్ళు, ఇంటి పక్కవాళ్ళు, ఊర్లోని వ్యక్తులు మాట్లాడే ఎత్తిపొడుపు మాటలు, తిట్లు విని ఎంతగానో కుమిలిపోతుంది. కొంత అందంగా, ఆకర్షణీయంగా, తెలుపుగోలుగా మాట్లాడే స్వభావం, వయసులో ఉన్న స్త్రీ అయినందున ఇతర పురుషుల వలన సంఘర్షణకు లోనవుతుంది సుజాత. పక్కింటి స్త్రీలతో ఎంతమంచిగా, మర్యాదగా వ్యవహరించిన కూడ సూటిపోటి మాటలతో వెక్కిరించేవారు. ఎవరైనా ఏదైనా అడిగినప్పుడు ఇవ్వలేకపోయినా, అప్పుఅడిగితే ఇవ్వలేక పోయినా మంచిగా అలంకరించుకున్నా, ఊర్లోని వ్యక్తులు విదేశాలకు వెళ్ళిన వ్యక్తి యొక్క భార్యనుద్దేశించి అనేక రకాలుగా మాటలం టుంటారు. అవ మాటలు వింటున్న సుజాత ఘర్షణకు లోనవుతూ మానసికంగా హింసను పొందుతుంది బాధలు పడేసందర్భంలోని ఇతరుల మాటలు ఈ క్రింది విధంగా ఉంటుంటాయని పాఠకులు గ్రహిస్తారు.

> భర్త మస్కట్ పోయాడని ఆగుతలేదు
> పూటకో చీరకట్టి ఊర్లు తిరుగుతుంది
> బొమ్మలెక్క తయారవుతుంది.
> వచ్చిపోయే వాళ్ళతో విడవకుండా ముచ్చట లాడుతుంది.
> చేతిలో నాలుగు పైసలు కనబడగానే కళ్ళు నెత్తికెక్కినయి.
> ఇంతకు ముందు బిత్తిరి దాని లెక్క ఉండేది
> ఇప్పుడు కళ్ళకు అద్దాలు.... కాళ్ళకు చెప్పులు వచ్చినయి

నీకేందిమహారాణివి పనాపాటనా కూసుండి తినుడే నాయే అని రకరకాలుగా మాట్లాడుతుంటుంటారు. ఈ కథలో మానవుల మధ్య ఉండే ఈర్ష్యాసూయలను చక్కగా వర్ణించారు. పెద్దింటి అశోక్ కుమార్, ఇంకా కొంతమంది. ఏం పోవుడు వయసు పెండ్లాము ను ఇక్కడ విడిచి పెట్టిపోతే మంచిదాయె, చెడ్డదాయె ఏం పైసా పాడ యింది. పైసా సంపాయించాలన్న వెర్రికొద్దీ మొగోళ్ళు దేశాలు పెట్టుకొని తిరిగితే ఆడోళ్ళు ఊర్లు తిరుగుతున్నరు. అంటూ లేనిపోని అనే కమాటలు ముఖం ముందే అంటుండగా ఆ స్త్రీ తనలోతాను కుంగిపోతుంది. మానసిక సంఘర్షణకు లోనవుతూ, ''ఈ మస్కట్ల మన్ను వడ మస్కటంట పోయి నన్ను మందినోర్లల్ల వేసి పోయిండు. ఏం తిన్నానో యాడఉన్ననో, ఎవ్వలకు తెల్వ కుంటున్న... ఇప్పుడు అందరి కండ్లు మండవట్టే అని తనకు తాను సమాధానం చెప్పుకుంటు దుఃఖాన్ని దిగ మింగుకుంటుంది. ఎన్నెన్నో సూటిపోటి మాటలను విన్న సుజాత మనసులో ఏవేవో తెలియని ఆలోచనలు, బాధలు నిరంతరం వేధిస్తుంటాయి. మానవీయ జీవితంలోని అనేక కోణాలను ఆర్ద్రతతో అవగతం చేసుకొని సాహిత్య సృజన చేశారు రచయిత. ఒక్కొక్కసారి రాత్రిళ్ళు నిద్ర

లేకుండా ఆలోచిస్తున్నా తన పరిస్థితి తనకే అర్థం కాకుండా పోతుంది సుజాతకు.

బతుకమ్మ పండుగ రోజు కూడా ఎత్తిపొడుపు మాటలతో సుజాత మనస్సును గాయం చేస్తారు. ఇతర స్త్రీలు. ఒక బతుకమ్మ పండుగకు జ్యోతి అనే ఆవిడ సుజాతను చీర ఇవ్వమని అడగ్గ పాడవుతుందని ఇవ్వనందుకుగాను, మగ వాళ్ళంతా సుజాతనే చూసేలా తయారవుతుందని, పక్కింటి లక్ష్మితో జ్యోతి చెప్తుంది. ఒకరోజు చేబదులు అయినా ఇవ్వకుంటే పెంటయ్య అనే అతను తనమీద ఇతరులకు చెడుగా చెప్తుంటాడు. తనపైన చెయ్యి వెయ్యనీయకపోతే ఎల్లవ్వ కొడుకు సాంబయ్య తనమీద చెడ్డగా చెప్తున్నాడని బాధపడుతుంది సుజాత.

అర్ధరాత్రివేళ కడుపునొప్పితో బాధపడుతున్న సమయంలో ఎవరితో చెప్పుకోవాలో తెలియని పరిస్థితి. తన అత్త మామలు ఎదురింటికి కాని దూరంలో ఉంటారు. ఇంతలోనే గ్రామీణ వైద్యుడు కనబడగా, జరిగిన విషయం చెప్పగా ఇంటికొచ్చి సూది, మందులిస్తున్న సమయంలో ఇంటి తలుపులు వేసి బయట గొళ్ళెం పెట్టి, అందరికి పిలిచి అల్లరి చేయడం వలన సుజాత చాల దుఖిస్తుంది. చెయ్యి వెయ్యనియ్యనంత మాత్రాన సాంబయ్య నాకింత శిక్ష వేశాడని ఘర్షణకు లోనవుతుంది. మానవీయ సంబంధాలను ఎంతో అవగతం చేసుకొని సాహితీ సృజన చేశారు రచయిత. చివరకు సుజాత చనిపోయిందని టెలిగ్రాంఇచ్చి, భర్త వెంకట్ను పిలిపించి అవాకులు, చెవాకులు లేనిపోని కట్టుకథలు చెప్తారు. కాని వెంకెట్ తన స్నేహితుడి ద్వారా ఇక్కడి విషయాలు తెలుసుకున్నానని, తన భార్య గురించి తనకు తెలియదా అని సుజాతను దగ్గరికి తీసుకోగా, అతని పాదాలను కన్నీటితో అభిషేకించింది సుజాత.

వలసలు ఒక వైపు జీవితాన్ని కబళిస్తూనే మానవ సంబంధాలను విధ్వంసం చేస్తున్నాయి. ఇందులో ముఖ్యంగా బాధితులు ఎక్కువగా స్త్రీలే కన్పిస్తారు. భర్త జీవిక కోసం సుదూర తీరాలకు ప్రవాసం వెళ్తే భార్య స్వదేశంలో ఇంటాబయట నిఘామధ్య కత్తులబోనులో ప్రవాసం అనుభవించవలసి వస్తోంది.

అసూయతో నిందలు వేసేవాళ్ళు కొందరైతే. అవకాశం దొరికితే అదునుచూసి మోసం చూసేవాళ్ళు కొందరు. సమాజపు హింసవల్ల తమలో తామే దగ్ధమయ్యే స్త్రీలు ఎందరో కనిపిస్తారు ఇలాంటి జీవిత పార్శ్వాలను వలస కథల్లో పెద్దింటి అశోక్ కుమార్ అద్భుతంగా చిత్రీకరించారు. రచయిత వలస కుటుంబాలతో మమేకమవ్వడం వలన వాస్తవ జీవితచిత్రణ చేశారు.

మరో రచయిత చక్రవేణుగారు 'కువైట్ సావిత్రమ్మ' అన్న కథల్లో బడుగు వర్గాల బతుకు తీరుతెన్నులను, స్త్రీల కన్నీళ్ళను, కష్టాలను, యాతనను కళ్ళకు కట్టినట్లుగా, హృదయం ద్రవించేవిధంగా చిత్రీకరించారు. సావిత్రమ్మను అందరూ కువైట్ సావిత్రమ్మ అని పిలుస్తారు. కారణం ఉబ్బు సంపాదనకోసం కువైట్ వెళ్ళిరావడం వల్ల ఆమెకా పేరు వచ్చింది. సావిత్రమ్మ కొడుకు కూతురుకిద్దరికీ ఒకేరోజు ముహూర్తాలు నిర్ణయించి పెండ్లి ఘనంగా జరిపించింది. ఆ పెండ్లి గూర్చి కొందరు గొప్పగా కీర్తించారు. ఇంకొందరు "అహా దేశం కాని దేశం పోయి, సిగ్గు శరము లేకుండా అయి పుట్టినోడి కిందల్లా కొంగుపరచి సంపాయించి తగుదునమ్మా అంటూ ముదరపెట్టి ముదర పెట్టి ముసలోళ్లను చేశాక పిల్లలకు పెండ్లిల్లు చేసింది. అది గొప్పేనా అని పెదవి విరిచారు.

సావిత్రమ్మ కొత్తగా కట్టుకున్న ఇంటిని తేరిపార చూసింది. ఊరి వాతావరణం మనసులో మెదిలింది. తన భర్తతో కలసి జీవించిన రోజులు గుర్తు వచ్చి కన్నీళ్లు ఆగలేదు. వెనుకటి రోజుల్లో తనబతుకులో మరిచిపోలేని భర్త మరణం, పీడకలలాంటి సంఘటనలు గుర్తుకు వచ్చాయి.. భర్త చనిపోయి నెలతిరుగక ముందే మరిది బెదిరించి చెరిపి వేయడం వల్ల ఎంతో మానసిక వ్యధను అనుభవిస్తుంది. కూలి నాలి చేసి కష్టాలు పడుతూ పిల్లల్ని కాపాడుకుంటుంది. ఒకరోజు మీ అత్తింటివారు పంచాయితీ స్థలానికి పిలుస్తున్నారని వెంకటయ్య వచ్చి

చెప్పడంతో కంగారు పడుతూ పంచాయితి స్థలానికి వెళ్ళుతుంది. పంచాయితి పెద్ద (నాగయ్య)కు బావ (రామయ్య) మరిది (చిన్నబ్బ) పథకం ప్రకారం చాడీలు చెప్పి ఊరినుండి బహిష్కరిస్తారు. దిక్కుతోచని పరిస్థితిలో కళ్ళల్లో నుండి నీళ్ళు ఉబుకి వస్తుండగాగుండె నిబ్బరం చేసుకొని తల్లిగారింటికి చేరుకుంటుంది. సావిత్రమ్మ భర్త చనిపోయిన కుటుంబాన్ని ఆదుకోకుండా కాకుళ్ళ పాడుస్తున్న బావ, మరుదుల హింసకు నిప్పుల కొలిమిలా కాలిపోతుంది. జీవిత పార్వాలను ఈ కథలో కళ్ళ ముందు సాక్షాత్కరింప చేశారు రచయిత.

తల్లిగారింటి దగ్గర రహిమాన్ అనే వ్యక్తి సహాయంతో కువైట్ చేరుకుంటుంది. ఎన్నో కష్టాలను ఓర్చుకొని బాగా డబ్బు సంపాదిస్తుంది. తిరిగి భర్తఊరు చేరుకుంటుంది. ఆస్తిపరురాలుగా వచ్చిన సావిత్రమ్మకు పోయిన ప్రతిష్ట తిరిగిరావటం విచిత్రంగా ఉంది. ఊరి నుండి తరిమి కొట్టిన బంధువులు గౌరవించడంచూస్తే నటన అని అర్థమవుతుంది. 'డబ్బుకు లోకం దాసోహం' అనే సామెత గుర్తుకు వస్తుంది. మరిది (చిన్నబ్బ) భార్యతో రామ లక్ష్మమ్మ) వచ్చి, కువైట్‌కు తీసుకువెళ్ళిసిందిగా కోరుతాడు. తాను వీసాలు తేలేదని చెబుతుంది. రహిమాన్ స్త్రీలకు మాత్రమే వీసాలు తేవడంతో రహిమాన్‌తో తన భార్య రామలక్ష్మమ్మను కువైట్ పంపడానికి నిశ్చయించు కుంటాడు చిన్నబ్బ.

సావిత్రమ్మ, రామలక్ష్మమ్మతో రెండు, మూడు నెలలు బొంబాయిలో ఉండాలని ఆసమయంలో ఏజెంటులు మర్యాదగా చూడరని వాళ్ళకు కావల్సిన మొగోళ్ళదగ్గరకు పంపిస్తారని ఇష్టమున్న లేకున్న వాళ్ళు చెప్పింది చేయకుంటే కోనేటికి పోలేరని అంతసులభంగా కోనేటికి పోతారనుకోవద్దని ఏజెంటుల మోసాలకు క్లుప్తంగా వివరిస్తుంది. ఇదంతా తన భర్తకు తెలిసే పంపిస్తున్నాడని, వాళ్ళు ఏది చెప్పినా కప్పుకొమ్మాడని, ఒప్పుకోకుంటే చావగొడు తానని బెదిరించాడని బోరున ఏడుస్తుంది. స్త్రీ, పురుషుల సంబంధాల్లో నిక్షిప్తమై ఉండే అంకనాన్ని, అభద్రతాభావాన్ని గమనించవచ్చు. ఈ కథలో చక్రవేణుగారు సామాజిక, మానవీయ, ఆర్థిక సంబంధాలను అవగతం చేసుకొని సాహితీ సృజన చేశారు.

సావిత్రమ్మ తన బిడ్డలను పస్తులుంచలేక కాని కూడని పని చేశానని నిన్ను నీభర్త తెలిసి కూడా పంపిస్తున్నా డని అంతర్గత సంఘర్షనకు లోనవుతుంది. బొంబాయి వెళ్ళడానికి రైల్వే స్టేషన్ వెళ్ళుతారు రహిమాన్, సావిత్రమ్మ, రామలక్ష్మమ్మకు బంధువులంతా వీడ్కోలు చెబుతూ ఉంటే, పెద్దగా ఏడుపులతో ఆ ప్రాంతమంతా మారుమ్రోగుతుంది. అందరి దృష్టి అటువైపు మల్లుతుంది. ఒక పెండ్లిగాని ముస్లిం అమ్మాయి 17 సంవత్సరాలు ఉంటుంది. తల్లిదండ్రులు కువైట్‌కు పంపిస్తుంటే దిక్కులన్ని పిక్కటిల్లెలాగా ఏడుస్తుంది. నీకేంభయం లేదని తోడుగా మామ ఉన్నాడని రెండు సంవత్సరాలు పోయి వస్తే చాలని తల్లిబిడ్డకు నచ్చ చెబుతుంది. కసాయికి గొడ్డును తోలినట్టు తోలుతున్నారు. తల్లిదండ్రులు, అన్యంపుణ్యం తెలియని, లోకంపోకడ తెలియని అమాయకురాలు డబ్బు సంపాదన కోసం బలిచేస్తుంటా రని "కువైట్ సావిత్రమ్మ" కథలో రచయిత సమాజంలోని లోపాలను నిర్భయంగా చూపించారు

మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలే అనే కోణంలో కథను సృజన చేశారు రచయిత. ముఖ్యంగా స్త్రీలకు భర్త చనిపోయిన, భర్త ఉన్న, పెంట్టికాకున్న ఎన్నో కష్టాలు అనుభవిస్తూ కనీళ్ళను, దు:ఖాన్ని దిగమింగు కుంటూ హృదయవిదారకరమైన జీవనాన్ని జీవిస్తున్నారు. మధ్యతరగతి స్త్రీల బతుకు వెతలు హృదయాన్ని కదిలించి వేసేలా ఉన్నాయని చెప్పడమే ఈ వ్యాసం ముఖ్యోద్దేశం.

ఉపయుక్త గ్రంథాలు :

1) ఒక తరం తెలుగు కథ - డి.రామలింగం (సంకలన కర్త) 2) వలస కథలు - పెద్దింటి అశోక్ కుమార్
3) 50 ఏళ్ల తెలుగు కథ తీరు తెన్నులు - సాహిత్యనిమర్శ - బి.ఎస్. రాములు

★

BHAVAVEENA
Vol. 19, Issue. 2 (2), February - 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

మన్నెం శారద వరకట్న సంబంధ కథలు : విశ్లేషణ

– గుబ్బల సత్యశ్రీ, టి.జి.టి., తెలుగు, బాలయోగి గురుకులం, కొవ్వూరు, పశ్చిమ గోదావరి.

తెలుగు సాహిత్య చరిత్రలో కథా ప్రక్రియకు ఒక విశిష్ట స్థానముంది. మానవ పరిణామ క్రమంలో భాష అనేది ఆవిర్భవించింది. ఈ భాష లిపి రూపం పొందిన తర్వాత అప్పటి వరకూ మౌఖికంగా చెలామణి అవుతున్న కథలు లిఖితం కాబడినవి. 'కథ అనగా కొంత సత్యాంశంతో కూడిన కల్పిత గద్య రచన'. దేనినైనా కథారూపంగా చెప్పే వెసులుబాటుండటం, మనసుకి నచ్చే ఆకృతి స్వభావాది గుణగణాలున్న కథలకు ఆదరణ ఎప్పుడూ అనంతం. అందుకే అన్ని ప్రక్రియలకన్నా కథలకే పాఠకులు అధికం అన్నది సాహితీలోక విదితం. ప్రాచీన సాహిత్యంలో ఆఖ్యానాల రూపంలోనూ, అనంతర కాలంలో నీతియుక్త పంచతంత్ర కథలు, సాహసాది భేతాళ కథలు, విక్రమార్క కథలు, వినోద కథలు, హాస్య భరితాలైన పేదరాశి పెద్దమ్మ కథలు, తెనాలి రామలింగని కథలు సాహితీ ప్రియులైన అన్ని వయస్కుల వారిని అలరించాయి. ఆధునిక కాలంలో పత్రికలలోను, సంపుటాలుగాను రచయితల కలాలు అక్షర ప్రవాహాలను నిరంతరం పరుగులు తీయుస్తూ అందరినీ ఆకట్టుకొని ఆలోచింపజేస్తున్నాయి.

ఆధునిక రచయితల కథా గమనాలను పరిశీలిస్తే, ఇతవృత్తాలు దాదాపు సమాజంనుండే పుట్టుకొస్తున్నాయి. అన్నీ ఏదో ఒక ప్రయోజనాన్ని చేకూరుస్తూ 'సాహిత్యం సమాజ హితం' అని నిరూపించే ప్రయత్నం చేస్తున్నారు. ఇలా లోకరీతిని, లోకనీతిని వెలువరిస్తూ, సమకాలీన సాంఘిక చరిత్రను ఒడిసిపట్టి లోపాలను, కారణాలను, పరిష్కారాలను విశదపరుస్తున్నారు. తొలి కథానిక గురజాడ వారి 'దిద్దుబాటు' నుండి ఇప్పటికీ ఇదే బాటలో కథా ప్రక్రియ సార్ధకం అయ్యింది. అలా సామాజిక స్పృహ కలిగిన రచయిత్రి మన్నెం శారద. వీరి రచనా శైలి అత్యంత సహజంగాను, పాఠకులను లీనంచేయించి, మెప్పించడంతోపాటు వారి హృదయాలలో ఈ కథలకొక ప్రత్యేక స్థానాన్నిస్తూ అభిమానించేలా ఉంటుంది. సమాజాన్ని, వ్యక్తులను చదువుతూ అక్షరాలలో ఆర్ధ్రతను నింపడంలో ఈమెకు ఈమె సాటి అని ఖచ్చితంగా చెప్పవచ్చు. గాలిలో వేలాడటం, గారడీలతో మభ్యపెట్టడం కాకుండా తెలిసిన దాన్నే చెప్పడం, తెలుసుకున్న దానినే తెలపడం, తెలియని దాని గురించి పరిశీలనాత్మంగా చెప్తూ, వాస్తవ చిత్రీకరణే ప్రధాన ధ్యేయంగా తన రచనలను అందించారు.

కొందరి రచనా వ్యాసంగం వృత్తి. మరికొందరికి ప్రవృత్తి. కానీ కొందరికి మాత్రం వరం. ఎటువంటి అభ్యాసం లేకుండా,రచనలకు సంబంధించిన నేపథ్యం గానీ సహకారం గానీ లేకుండా రచనలు చేయడం, అందులోనూ పురుషాధిక్యత ఎక్కువగా ఉన్న కాలంలో తన రచనలతో పాఠకులకు దగ్గర కావడం ఇంకా కష్టం. కానీ అసాధ్యాన్ని సాధ్యం చేశారు మన్నెం శారద. పువ్వు పుట్టగానే పరిమళిస్తుంది అంటారు. ఆ కోవకు చెందిన వారే సహజసిద్ధమైన ప్రముఖ రచయిత్రి మన్నెం శారద. మానవత్వమున్న ప్రతీ మనిషి స్త్రీని బాగా అర్థం చేసుకోగలుగుతారు. అందుకోసం స్త్రీ వాదమే అవసరం లేదు. అందుకే 'నేను ఫెమినిస్టుని కాదు హ్యూమనిస్టుని' అంటారు రచయిత్రి.

మన్నెం శారద అక్టోబరు 28వ తేదీన మన్నెం సీతారాయ్య, వెంకట సుబ్బమ్మ దంపతులకు రెండవ సంతానంగా అమ్మమ్మ గారి స్వగ్రామం అయిన కాకినాడలో జన్మించారు. శారద గారి ప్రాథమిక విద్యాభ్యాసం మొత్తం ఇంటి దగ్గరే జరిగింది. తర్వాత నేరుగా ఆరవ ఫారమ్‌లో చేరారు. అక్కడి నుండి డిప్లమో వరకు చదివి తరవాత విద్యాభ్యాసం కొనసాగించలేదు. డిప్లమో

పూర్తి చేసిన అనంతరం పంతొమ్మిది సంవత్సరాల వయసులో ఇరిగేషన్ డిపార్ట్‌మెంటులో ఉద్యోగినిగా జీవితం ప్రారంభించిన శారదగారు, అక్కడ నుండి ఆర్. అండ్ బి. డిపార్ట్‌మెంటులో ఇంజనీరుగా సేవలందించారు. తదనంతర కాలంలో అనివార్య కారణాల వలన ఉద్యోగ కాలం పూర్తి కాకుండానే స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసి ప్రశాంత వాతావరణంలో జీవితాన్ని సాగిస్తున్నారు.

స్పందించే ప్రతీ మనసుకు దాన్ని వ్యక్తపరిచే లక్షణం ఉండదు. ప్రతీ స్పందనను, ప్రతిస్పందనను అక్షర రూపంలో పెట్టే గుణం కొందరు రచయితలకు మాత్రమే ఉంటుంది. అటువంటి వారిలో మన్నెం శారద ఒకరని ఖచ్చితంగా చెప్పవచ్చు. ఈమె రాసిన కథలలో వరకట్న సమస్యలకు ప్రాధాన్యమిచ్చారు. ముఖ్యంగా రెండు కథలు ఈ అంశానికి సంబంధించి ఉన్నాయి. వాటిని ఈ విశ్లేషించడమే ఈ వ్యాస ఉద్దేశ్యం.

వరకట్న సమస్యలు - విశ్లేషణ :

తల్లి గోదారి :

సుశీల, రాజశేఖర్ దంపతులు. సుశీల స్నేహితురాలైన విమల మనుమరాలు సుస్మిత వివాహానికి వెళ్తుంటారు. గోదావరి నది మీదకు బస్సు వెళ్ళేసరికి రాజశేఖర్ ఆ నదిని అసహ్యించు కుంటాడు. కారణం తన కూతురు సౌమ్యకు గల ఒక్కగాని ఒక కూతురు ప్రత్యూషను ఇదేనది మింగేసిందని బాధ. గతంలోకి వెళితే సౌమ్యకు ప్రసాద్ అనే ఇంజనీరునిచ్చి వివాహం చేయగా, కట్న దాహంతో ఏడవ నెల గర్భిణితో ఉన్నప్పటికీ ఆమెను పుట్టింటికి పంపించేస్తారు అత్తగారు. మొత్తానికి విడాకులయ్యాక సుశీల స్నేహితురాలు ఆనంద్ అనే అబ్బాయిని తీసుకొచ్చి సౌమ్యకిచ్చి పెళ్ళి చేద్దామంటుంది. దానికి సౌమ్య అంగీకరించదు.

ఒక రోజు సుశీల ప్రత్యూషను తీసుకుని విమల ఇంటికెళ్ళి, తిరిగి వచ్చిన తరవాత పాప గోదావరిలో జారిపోయిందని అబద్ధం చెప్పి విమల దగ్గరే ఉంచేస్తుంది. తరవాత విమల తెచ్చిన సంబంధాన్ని చేసుకుని ఒక కొడుక్కి జన్మనిస్తుంది సౌమ్య. అయితే విమల కూతురు నిరుపమకు సంతాన యోగం లేకపోవడంతో ప్రత్యూషకు సుస్మిత అనే పేరు పెట్టి తన కూతురు నిరుపమకు దత్తత ఇస్తారు విమల, సుశీల. ఈ విషయం ఎవరికీ తెలియదు. ఇప్పుడెళ్ళుతున్న వివాహానికి సుశీల దంపతుల తోపాటు సౌమ్యకూడా వస్తుంది. వివాహం అయిపోయాక సౌమ్య వెళ్ళిపోయాక సుశీల నిట్టూర్చినా సుస్మిత అయిన ప్రత్యూష బాగానే సంతోషంగా ఉందని అనుకుంటుంది. వచ్చేదారిలో నదిని తిట్టిన తన భర్త రాజశేఖర్‌తో ప్రత్యూష బ్రతికే ఉందని, సుస్మితే ప్రత్యూషని చెప్పేసరికి ఎంతో సంతోషిస్తాడు.

విశ్లేషణ :

కుటుంబాలలో వరకట్నాలు లేవనెత్తే సమస్యలకు అడ్డుకట్ట ఉండదు. ఇంటిల్లపాదీ ఆ కష్టాల కడలిలో కొట్టుమిట్టాడినా దారీ తెన్నూ అనేవి ఉండవు. పూర్వం ఎప్పుడో ఇంటి ఆడపిల్లను వైభోగంగా సాగనంపాలని ఆర్థిక స్థిరత్వానికి ఉపయోగపడుతుందని పుట్టింటివారు తమ స్థితిగతులను బట్టి సంపదలతో కూతుర్ని అత్తగారింటికి పంపేటప్పుడు పెళ్ళి లాంఛనాలను అందించేవారు. అది పోనుపోను వరకట్నంగా రూపుదిద్దుకొని సమాజంలో స్థిరపడిపోయింది. ఎన్నో సాంఘిక దురాచారాలను రూపుమాపిన సంస్కర్తలు, చట్టాలు కూడా వరకట్నాన్ని అడ్డుకోలేకపోయాయంటే వ్యక్తులు, కుటుంబాలు, సమాజాలలో ఈ వరకట్నమనేది ఎంత బలంగా పాతుకునిపోయిందో తెలుస్తోంది. ఈ వరకట్నాలపైనున్న మోజు ఎలాంటిదో, 'భర్త' అనే మగవాడిలో అదెలాంటి భావనలు కలిగిస్తుందో ఈ కథలో ప్రసాద్ సౌమ్య తల్లి దండ్రులతో చెప్పిన మాటలే సాక్ష్యాలుగా తీసుకోవచ్చు.

''నీ కూతురిని ఏడో నెలలో ఎందుకొదిలేశానో తెలుసా? దానికి నువ్వు అబార్షన్ చేయించలేవు. అదింక మరో పెళ్ళి చేసుకోలేదు. అలాగే మీరంతా ఏడుస్తూ

బతకాలి. నీ కూతురు నీ దగ్గర మోడులా ఉండాలి" అనే మాటలు ఎంత ఒక కూతురి తండ్రిని ఎంతగా బాధిస్తాయో అర్థం చేసుకోవచ్చు. వరకట్నాలు, అదనపు కట్న కానుకలను పొందాలన్న ఆలోచన దుష్ట ఆచరణలకు మార్గాలు వేస్తూ వ్యక్తుల్లో ఎంతటి క్రూరత్వాన్ని, స్వార్థాన్ని నిద్రలేపి దుష్టత్వాన్ని పరాకాష్టకు చేర్చుతుందో ప్రసాద్ మాటల్లో వెల్లడైంది. వరకట్నాల సంతలో ఆడపిల్ల బతుకు ఎలాంటి బేరసారాల మయమై చివరకు ఆమె గతి ఏమవుతుందో తెలుస్తోంది. అలాగే ఆడపిల్ల కన్నవారిని నిలువునా కూల్చి మార్గమెరుగని హృదయకోతను విధిస్తుందో గమనించవచ్చు. ఇంకా ఏ పాపమూ ఎరగని, ఈ కట్నాల గోలేంటో, ఈ సంప్రదాయాలేంటో, ఆ చిచ్చులు ఎలాంటివో తెలియని, కళ్ళు కూడా తెరవని కడుపులోని బిడ్డయిన ఈ ఫలితానికి విలవిలలాడాల్సిందే. సౌమ్య విషయంలో ఆమె బిడ్డ పరాయి ఇంటి వారసురాలిగా పెరగాల్సి వచ్చింది. అదనపు కట్నం పదే పదే కోరుకున్న ప్రసాద్ నిండు గర్భిణి అయిన భార్యా బిడ్డల్ని వదిలేయడంలో ఈ దురాచారం, దురాశలే కారణాలయ్యాయి. అంత చదువు చదివి విజ్ఞతను కోల్పోయిన వ్యక్తిత్వం స్త్రీ పుట్టింటి ధనాన్ని కోరుకోవడంలో నేనేం చేసినా అడిగేవారెవరు? అనే అహంకారం తెగించేలా చేసింది. ఎంతో కట్నమిచ్చి, ఘనంగా పెళ్ళి జరిపించినా తిరిగి అదనపు కట్నాలకై కూతురు పీడింపబడటం ఆ కన్న వారి గుండెల్లో కుంపట్లనే రగిలించి మనో వేదనకు దారి తీయిస్తుందని వరకట్నాల మోజు రేపే దుష్టత్వ సమస్యల్ని తెలిపారు.

సమాజంలో చదువుకున్న కుటుంబాలు కూడా వరకట్న దాహాలకు బలైపోతుండటం రాజశేఖరం, సుశీల, సౌమ్య పాత్రలను చూస్తే అర్థమవుతుంది. ఇందుకు కారకులైన వారిని కోరి తెచ్చుకున్న గృహలక్ష్మి అయిన స్త్రీ కంట కన్నీరు పెట్టించకూకడదని, స్త్రీ ధనానికి అర్రులు చాచడం మగతనం కాదని తెలుసుకోలేకపోవడం. వర కట్నాల రూపంలోని ధన సంపదలకై ఉన్న ఆశ కళ్ళు మూసుకుపోయి ప్రవర్తించడానికి కారణమైంది. ఎన్ని చట్టాలు వచ్చినా ఇలాంటి ఆర్థిక నేరగాళ్లనేం చేయలేక పోవడం మరింత బలాన్ని చేకూర్చింది. సాధారణంగా తల్లిదండ్రులు కట్నాన్ని ఆశిస్తే కొడుకు వారించాలి, లేదా కొడుకు కోరితే కన్నవారు ఇంటికి రాబోయేది తమ ఇంటి కోడలని, తమ ఇంటి కుటుంబ సభ్యురాలని చెప్పగలగాలి. కోడలి పుట్టింటివారు వారి బిడ్డకు ఇచ్చుకునేదాంతో తృప్తి పడగలగాలి. అలా కాకుండా గొంతెమ్మ కోరికలు, డబ్బుదాహాలతో కోడల్ని జీతభత్యం లేని పనిమనిషిగా మార్చడంతోపాటు ఆమెను హింసిస్తూ పుట్టింటి సొమ్ము తేవాలని కోరడం ఏమాత్రం సహింపరానిది. 'కట్నం తీసుకున్నవాడు గాడిద' అంటూ ప్రచారాలు చేసినా దులుపుకొనిపోవడం కట్నంపై మక్కువ ఉన్నవాడు చేసేపని దీనికి సమాజంలో నివసిస్తున్న చాలామంది అతీతులేంకాదు.

యువతీ యువకులు పెళ్ళి సంప్రదాయంతో ఒక కుటుంబంగా మారే తరుణం ఇరు కుటుంబాలకూ ఆనందదాయకమైంది. పెళ్ళి అనే వేదికపై అధికారిక పెత్తనంతో కట్నాలను ఘనంగా అందుకోవడం మగ పెళ్ళివారి హక్కుగా అందించడం తమ బాధ్యతగా ఆడపెళ్ళివారు భావించడం చూస్తే ఈ కట్నాలనే దురాచారానికి దాని మూలంగా సంభవించే సమస్యలు ఎలా ఎప్పటికీ సమాజాన్ని వీడుతాయో చెప్పలేం. వ్యవస్థలోని మనుషుల ఆలోచనా విధానాల్లో విశాలత్వం, సంస్కర్త తత్వం అబ్బితే తప్ప వీలు కాదు. ఆడపిల్లల కుటుంబాలు ఇలాంటి దారుణాలకు కృంగిపోక సౌమ్యను చదివించి తిరిగి వివాహం జరిపించిన రాజశేఖరంగారిలా స్థైర్యంగా వ్యవహరించాల్సిందే. అలాగే సౌమ్యను వివాహమాడిన ఆనంద్‌లోని సంస్కారాన్ని కొనియాడాలి. కానీ అందరి జీవితాలకు ఇలాంటి ముగింపులుండవు.

ఇది కథ కాదు :

శ్రీ అసలు పేరు షారోన్. ఈమెను కన్నకూతురుకంటే ఎక్కువగానే చూస్తుంది నర్మద. నర్మద తండ్రి లేకపోయినా తల్లి అనసూయ సపోర్ట్‌తో బాగానే చదువు పూర్తిచేస్తుంది.

చదువుకునే రోజుల్లోనే చంద్రశేఖర్‌తో ప్రేమతో పడు తుంది. ఒకరంటే మరొకరికి ఎంతో ఇష్టం. చంద్రశేఖర్ కుటుంబం మొత్తం అతని మీదే ఆధారపడటంతో చెల్లి దుర్గ పెళ్ళి చేయాలంటే దుబాయ్ వెళ్ళి సంపాదించాలని నర్మద దగ్గర విషయాలన్ని చెప్పి అగ్రిమెంటు పూర్తికాగానే వచ్చిన పెళ్ళి చేసుకుందాం అంటాడు. వెళ్ళడం ఇష్టం లేకపోయినా సరే అంటుంది. మూడు సంవత్సరాలు రివ్వున తిరుగొస్తాయి. చంద్రశేఖర్ చెల్లి పెళ్ళిచేసి ఇంకో ఆర్నెల్లో వస్తానని చెప్పి వెళ్ళి కాలం ముగిశాక, తన ఫ్రెండ్ డేనియల్ చనిపోయడని, అతు భార్య సుమిత్రకు అండగా ఉంటున్నానని, ఆమె కూతురు షారోన్ పరిస్థితి బాగాలేదని, ఇక ఈ కుటుంబానికి తోడుగా ఉండి పోవాలని నిశ్చయించుకున్నానని తనని క్షమించమని ఉ త్తరం రాస్తాడు. నర్మద చలించిపోకుండా అతను ఏ పరిస్థితుల్లో అలా చేయాల్సి వచ్చిందోనని ఆలోచించేలోగా తను పనిచేసే ఆఫీసు నుండి ముకుందరావు అనే ఆయన కొడుకు నిన్ను పెళ్ళి చేసుకోడానికి సిద్ధంగా ఉన్నాడం టుంది తల్లి అనసూయ. కానీ నర్మద అంగీకరించదు. కొంతకాలానికి అనసూయ కాలంచేస్తుంది. ఇంతలో చంద్రశేఖర్ నుండి ఉత్తరం వస్తుంది. నర్మదకు చేసిన అన్యాయానికి తనకు తగిన శాస్తి జరిగిందని, సుమిత్ర చనిపోయిందని, తన ఆరోగ్యం క్షీణించిందని ఇక బ్రతికే అవకాశంలేదని, తన కూతురుగా ఉన్న షారోన్‌కి నువ్వే తల్లిగా చూసుకోవాలని ఇండియాని పంపిస్తాడు. నర్మద ఆ మాటను స్వీకరించి, షారోన్‌ని పెద్దచేసి, తండ్రి కోరిక అయిన అమెరికాకు పంపుతుంది. కానీ షారోన్ పేరు శ్రీగా మార్పుచేసి కూతురులాగా పెంచుతుంది.

విశ్లేషణ :

ఈ కథ స్త్రీ సమస్యల్లో ఒకటైన వరకట్నం గురించి చర్చించింది. సమాజంలో కట్నాలను ఇంటికి తెచ్చేది కాబట్టి ఆనందపడుతూ వారసుబడొచ్చాడని కుటుం బాలు మురిసిపోతాయి. అలాగే ఆడపిల్ల పుట్టగానే ఇవ్వాల్సిన కట్నకానుకలు గుర్తొచ్చి ఇంటి మహలక్ష్మి పుట్టిందని కూడా మరచి లోలోన కన్నీరు కన్నవారిది అవుతుంది. ఎప్పుడో ఇరవై ఏళ్ళ తర్వాత జరగాల్సిన కార్యం బిడ్డ పుట్టీ పుట్టగానే కళ్ళకు కట్టి దైన్యాన్ని నింపుతుంది. ఇది ఆడపిల్ల తప్పుకాదు, ఆమె తెచ్చిన తంటా అసలేకాదు. అయినా ఇంటి ఆర్థిక స్థితిగతులు, ఆమె భవిత ఎలా ఉండితీరుతాయో నిర్ణయించేయడం వరకట్నమనే సాంఘిక దురాచారం ఆమెకు పెట్టిన శాపం. మరోరకం గా ఆడపిల్ల ఉన్న కుటుంబాలకూ ఓ శాపంగ పరిగణిస్తోందని చంద్రశేఖర్ అక్కపెళ్ళికి ఎదురైన వరకట్న సమస్య ఎంతటి తీవ్రంగా మారిందో నర్మదకు చెప్తోన్న మాటల్లో సాక్ష్యాలయ్యాయి.

''ఇంట్లో ఆర్థిక పరిస్థితులు బాగాలేవు. దుర్గకి సంబంధాలొస్తున్నాయి. తను అందరికీ నచ్చుతోంది. కట్నమే నచ్చక వచ్చిన సంబంధాలు వచ్చినవి వచ్చినట్లే పోతున్నాయి'' అంటుంది.

ఇక్కడ గమనించి చూస్తే, కుటుంబ ఆర్థికత వరకట్నా నికి లోటుని తీసుకురాగా, ఈ రెండూ ఆడపిల్లకు సమస్యలయ్యాయి. సంపదలేమి ఉన్న ఇంట కట్నం ఎపుడూ భారమే. ఈ రెండింటితో ఆడపిల్లకు ప్రత్యక్ష సంబంధం లేకున్నా ఆమె వివాహానికి ఉంటుంది. కోరినంత కట్నాన్ని అందిస్తే తప్ప వరుడు తాళి కట్టడానికి సమ్మతించడు. చాలినంత కట్నం ఇవ్వకున్నా, ఆర్థిక కారణాల వల్ల తర్వాత అందజేస్తామని బకాయి పడినా ఇక ఆమె మెడకు కట్టే పసుపుతాడు ఉరితాడులా బిగుసుకోక తప్పదు. పుట్టింటి స్తోమంత తెలిసీ అత్తింట తన కట్న బాధల ఫలితాలను వ్లెడించలేదు. డబ్బుకోసం హింసించే అత్తింటిపై పగను పెంచుకోనూలేదు. భర్త కట్టిన తాళి తనకో కట్నానికో అర్థం కాక దిక్కుతోచని దై దినమొక గండంగా గడుపుతుంది. ఇలా పుట్టింటి సంపద కరువైతే ఆడపిల్లకు కట్నం కొరత ఏర్పడి ఆమెని పెళ్ళి పీటలపై ఎక్కించాలన్నా పిల్ల నచ్చినా వరకట్నం మొత్తం నచ్చక వచ్చిన సంబంధాలు వచ్చినట్లే వెనక్కి పోవడం ఆమెకు భవిష్యత్‌లో పెళ్ళి అవుతుందో లేదోనన్న ఆలోచనే

మానసిక సమస్యగా మారుతుందని నేటి కాలపు సమాజం లోని స్త్రీల ఆవేదనని వెల్లడించారు.

ఆడపిల్ల ఎంత అందంగా ఉన్నా, ఎంత చదువుకొన్నా, మంచి ఉద్యోగంలో కొనసాగుతున్నా అవి ఆమెకు వివాహ సంబంధాన్ని ఇంటి వాకిట వరకూ తెస్తాయి. ఆరు అడుగులు పెళ్ళి వేదిక వరకూ పడాలంటే వరకట్నం వరుడి చేతిలో పడాల్సిందే. అక్కడ కుటుంబ రాబడులు, ఆదాయాలు, ఖర్చులతో కట్నానికి పొంతనుండదు, పట్టింపూ ఉండదు. కేవలం ఆడపిల్ల పుట్టిల్లు వీడి అత్తింట పెట్టే అడుగుని వరకట్నమే నిర్ణయిస్తుంది. ఏ కొంత తేడాలు వచ్చినా గడప తొక్కి లోనకి వెళ్ళాలా లేక గడపదాటి వెనుదిరగాలో తెలియని పరిస్థితి స్త్రీ వివాహ సంబంధిత వరకట్న సమస్య తెచ్చే తంటాగా మారక తప్పదని ఆలోచింపజేశారు. కనుక కుటుంబ పరిస్థితి ఎంత తలకిందులుగా ఉన్నా వరకట్నం తగినంతగా తల తాకట్టు పెట్టైనా సమకూర్చుకోక తప్పదు. లేదంటే ఆ ఆడపిల్ల శాశ్వతంగా పుట్టింట్లో ఉండిపోకా తప్పదు. అలా కట్నమే ఆమె వివాహాన్ని నిశ్చయిస్తుందని తెలిపారు.

తల్లిదండ్రులు కుమార్తె పెళ్ళి సమయంలో భూమి, డబ్బు, ఆభరణాలను పెళ్ళికొడుకుని కన్నవారి చేతికందించే వరకట్నం. నూతన దంపతులకు ఆర్థిక సామర్థ్యాన్నందించే ఉద్దేశ్యంతో ఏర్పరచబడిన ఈ ఆచారం వరకట్నం పేరుతో ఓ దురాచారంగా సమాజంలో పాతుకుపోయింది. కొంత ఆర్థిక స్థితిగతులు బాగున్నవారికి కట్నాన్నివ్వడం ఒక సమస్య కాకపోవచ్చు. కానీ మధ్యతరగతి, నిరుపేద కుటుంబాలకు మాత్రం దీని భారం తట్టుకోలేనిది. ఆడపిల్ల పుట్టినప్పటి నుండీ రూపాయికి రూపాయి చేర్చడం కోసం మరింత కష్టపడాల్సి రావడం లేదంటే అప్పులు చేసి మరీ అబ్బాయి తరపువారికి కట్నాలను ఇవ్వడం వారికి కోలుకోలేని దెబ్బ. అలాంటి వరకట్న పిశాచిని గూర్చి నర్మద తన అభిప్రాయంలో ఈ స్త్రీ సమస్య ఎలా తయారైందో చంద్రశేఖర్‌తో చెప్తూ- ''అవును మన దేశం ఎంత ప్రగతి సాధించినా, ఈ దురాచారం మాత్రం పోవడంలేదు''

ఇలా అనడంలో వరకట్నం వ్యక్తి సమస్య, కుటుంబ సమస్య మాత్రమే కాక అది ఒక సామాజిక సమస్యగా తయారై ఆడపిల్ల జీవితాన్ని వెంటాడే దుష్ట ఆచారమనే ఆవేశం, అసహనం నర్మద మాటల్లో వెలువడ్డాయి. చంద్రశేఖర్ అక్క పెళ్ళికి ఈ వరకట్నం అనేది ఎంతటి గుదిబండగా మారిందో చెప్పడంతోపాటు మనిషి ఎంత ఎదిగినా, ఏం సాధించినా కట్నం కోసం దిగజారి చేతులు చాచడం నీచమని ఇక్కడి భావన. ఎదో తమ తమ స్థాయిని అనుసరించి కట్నాలు అందించినా అదనపు కట్నాల కోసం కూతురిలా చూసుకోవాల్సిన కోడల్ని మానసిక, శారీరక చిత్రవధలు చేయడం అమానుషం. ఒకోసారి ఈ తీవ్రత హత్యలు, ఆత్మహత్యలకు దారి తీయడం ఎన్నో సందర్భాలలోనూ, సంఘటనలలోనూ చూస్తూనే ఉన్నాం. చివరకు ఈ దురాచారాన్ని రూపుమాపాలని ప్రభుత్వం 1961లో వరకట్న నిరోధక చట్టాన్ని రూపొందించి కట్నం ఇవ్వడం, తీసుకోవడం నేరంగా పరిగణించింది. గృహ హింస కింద ఐపిసి. సెక్షన్ 498ఎని 1983లో ప్రవేశపెట్టి వరకట్నం కారణంగా జరిగే హింసల నుండి స్త్రీకి విముక్తిని ఇవ్వడానికి చట్టపర అసరాని ఇచ్చింది. అయినా పరిస్థితిలో ఎలాంటి మార్పురాలేక ఇప్పటికీ స్త్రీ సమస్యల్లో వరకట్నం ప్రధాన సమస్యగా ఉందంటే సమాజం కట్నానికి ఎంత సమర్థింపునిచ్చిందో తెలుస్తోందని కథాకర్త ఆవేదన చెందిన విధానం ఈ కథలో కనిపించింది.

ఆసరా ఇవ్వడానికి ఆరంభమైన వరకట్నమనే ఆచారం చివరకు అత్తింటి వారికి ఓ హక్కుగా పరిణమించింది. ఈ కట్న ఏర్పాట్లకు ఆడపిల్ల పుట్టిల్లు పలు వైపరీత్యాలతో బాధపడుతుంది. దుర్గ పెళ్ళి, కట్నం అనేవి ప్రధాన ఆర్థిక సమస్య కావడంతో చంద్రశేఖర్ విదేశాలకు వెళ్ళడం నర్మద ప్రేమకు తెరపడిందనే కొత్తకోణంను ఈ కథలో ఆవిష్కరించారు. ఈ సంగతి పక్కన పెడితే వరకట్నం వలన ఎందరో జీవితాలు ఆటుపోట్లమయంగా

మారాయి. డబ్బుతో ముడిపడిన ఈ పితృస్వామిక సమాజం ఇలాంటి సాంప్రదాయానికి పూర్తిగా సహకరించడం వల్ల ఈ ఆచారం నేటికీ కొనసాగడానికి ప్రధాన కారణం అని చెప్పవచ్చు.

ముగింపు :

వరకట్నం విషయంలో వ్యక్తుల పరివర్తన చైతన్యశీలంగా ఓ విప్లవాత్మక పరిణామంగా మరాతే తప్ప ఈ రకమైన స్త్రీ సమస్యకు ఒక ముగింపు దొరకదు. యువతి చదువుకి, ఉద్యోగానికి అర్హత సాధించి ఆర్థిక స్వతంత్రిగా ఉన్నా కూడా వరకట్నం తీసుకెళ్తేనే అత్తింట్లో కోడలిగా ఆమెకు అనుమతి లభిస్తుంది. ఇక స్త్రీ సాధికారత సంపూర్ణంగా సాధించే అవకాశం వరకట్న భూతం ముందు ఒక భ్రమేనని ఆలోచింపజేశారు. ఈలోగా ఈ వరకట్న పిశాచి దాహానికి ఆడకూతుర్ల అలమటింపుల బాధలు తప్పవన్నట్లగా ఈ కథలో తెలిపారు రచయిత్రి.

ఆధార గ్రంథాలు :

1. దక్షిణామూర్తి, పోరంకి: కథానిక - స్వరూప స్వభావాలు, హైదరాబాద్ - 1986.
2. రామకోటి శాస్త్రి, డా॥ కేతవరపు: ఆధునిక తెలుగు సామాజిక ఉద్యమాలు, వరంగల్: పశ్యంతి 2001.
3. శారద మన్నెం : మన్నెం శారద కథలు, జె. వి.పబ్లికేషన్స్, హైదరాబాదు,2016
4. సిమ్మన్న, వెలమల : తెలుగు సాహిత్య విమర్శ సిద్ధాంతాలు, దళిత సాహిత్య పీఠం, విశాఖపట్నం, 2005

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 2 (2), February - 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

పెన్నా శివరామకృష్ణ సాహిత్యేతర రచనలు - అధ్యయనం

- ఐ. చిదానందం, తెలుగు పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం

సాహిత్య రచనైనా సాహిత్యేతర రచనైనా ప్రధాన విషయాన్ని వివిధ అంశాలుగా విభజించుకొని పరిశీలన చేసి అన్వయ విమర్శను పరిపుష్టం చేయడం పెన్నా శివ రామకృష్ణ ప్రత్యేకత. వీరి రచనల్లో ఆత్మాశ్రయత్వం, అనుభూతివాదం తాలూకా లక్షణాలు ఎక్కువ. అందుకే విషయ విశ్లేషణ లోతు ఎక్కువగా ఉంటుంది. పెన్నా సాహిత్యేతర రచనలు కింది విధంగా ఉన్నాయి.

1. ఆవిష్కరణ సంపుటిలో(2009) - కళాకారుల జీవితాలు కల్లోల సాగరాలు. (వ్యాసం)
   కన్నీటి కథ (వ్యాసం)
2. రోజురోజుకో చరిత్ర (2004)
3. జాతీయ, అంతర్జాతీయ దినోత్సవాలు (2006)
4. నిరాశావాది నిఘంటువు (2006)
5. ప్రేమ... మరికొన్ని సంగతులు (2009)
6. ముద్దుల ముచ్చట్లు (2009)

పెన్ని తన రచనలలో కింది విషయాలను భూమికగా చేసుకొని వారి రచనా ప్రస్థానాన్ని విశ్లేషించవచ్చు.

1. రచనల్లో కొత్త విషయాలను తెలియపరచడం.
2. కొత్త భావాలను క్రోడీకరించడం.
3. సాహిత్యేతర రచనల్లో కొత్త ఒరవడిని, పరిశోధనత్మకతను ప్రవేశపెట్టడం.
4. పరిమితులకు లోబడి ప్రామాణికమైన సిద్ధాంతాలను ప్రతిపాదించడం.

పెన్నా సాహిత్యేతర రచనల్లో అనుభూతి కోణం గమనించవచ్చు. మనోవైజ్ఞానిక విధానంలో పరిశీలనచేశారు. అలాంటి రచనలను ఈ వ్యాసంలో పరిశీలనగా చూద్దాం.

కళాకారుల జీవితాలు కల్లోల సాగరాలు (వ్యాసం):

అన్ని వృత్తులలో విలక్షణమైన వృత్తి కళాకారులది. ఇతర ఉద్యోగ జీవితాలతో పోల్చుకుంటే కళాకారుల జీవనశైలి విభినమైనది. కళాకారుల నిజజీవితంలో అంతా సుఖంగా సాఫీగా సాగినట్లు కనిపించదు. వారి వ్యక్తిగత జీవితం క్రమశిక్షణా రాహిత్యంగా ఉంటుంది.

కళాకారులంటే ఇక్కడ కవులు, రచయితలు, చిత్రకారులు, రంగస్థల కళారులు, ప్రత్యేకించి సినిమా రంగానికి చెందినవారు మొదలైనవారిగా భావించవచ్చు. కళాకారుల జీవితం గందరగోళంలో సాగడానికి గల కారణాలను వారి ఉద్వేగాలను, ప్రతిస్పందనలను, వారి జీవితాలపై పరిశోధనా విషయాలను పెన్నా "కళాకారుల జీవితాలు - కల్లోలసాగరాలు" అనే వ్యాసంలో చర్చించారు. ఇది ఆవిష్కరణ సంపుటిలో చోటుచేసుకుంది. పై వ్యాసంలో పెన్నా కళాకారుల వ్యక్తిగత జీవితంలోని అగాధాలను ఈ విధంగా కారణాలు చెప్పారు. "వివాహం, విడాకులు, పునర్వివాహాలు, అనేక ప్రేమవివాహాలు, భగ్నప్రేమలు, వివాహేతర సంబంధాలు, మధ్యపానం మొదలైన వ్యసనాలకు బానిసలు కావడం అనారోగ్యంతో హఠాన్మరణాలు"(పుట-34).

పైన చెప్పిన విషయాలలో ముఖ్యంగా గుర్తింపు పొందాలనే తపన, కళాకారుల వ్యక్తిగత జీవితాన్ని ఆలోచనలో పడేసి పరిస్థితులను విస్మరించేలా చేస్తుంది. మరో విధంగా చెప్పాలంటే గుర్తింపు కాంక్షకోసం అడ్డదారులు తొక్కవలసిన పరిస్థిని కళాకారులు ఎదుర్కొంటారు. ఇలాంటి విషయాలనే పెన్నా తన వ్యాసంలో విపులంగా వివరించారు. పై కారణాలతోపాటుగా విశృంఖలత్వం, మధ్యపానం వంటి అంశాలు కూడా సృజనాత్మక రంగంలోని వారి జీవితాలపై ప్రభావాన్ని చూపిస్తాయని పెన్నా అభిప్రాయం. కళాకారుల ఆత్మవిధ్వంసక ప్రవృత్తి, ఆత్మ హసనానికి దారి తీస్తుందనడానికి ఉదాహరణలు తన ఇచ్చారు.

కళాకారుల కల్లోల సాగరం వ్యాసంలో కళాకారుల పరిధిని గురించి చర్చించారు. మౌళికాంశాల వివేచన చేసి చాలా ఖచ్చితమైన, నిష్పక్షపాతమైన విమర్శకృషిని సాగించారు. ఈ వ్యాసాన్ని అనువర్తిత విమర్శగా చెప్పవచ్చు.

కన్నీటి కథ (వ్యాసం) :

జీవితంలో మనసారా నవ్వనివాడు ఉండవచ్చునేమో కాని ఒక్కసారైనా కన్నీరు కార్చనివారు ఉండరు. నిజానికి ఎవ్వరూ దుఃఖించాలని కోరుకోరు. కాని చాలా సందర్భాలలో కన్నీరు అనివార్యమవుతుంది. ఇలాంటి కన్నీరు గురించి కన్నీటి కథ అనే వ్యాసాన్ని రాసారు పెన్నా. ఇది ఆవిష్కరణ వ్యాస సంపుటిలో ప్రచురితమైంది.

ఈ వ్యాసంలో కన్నీరు ఏఏ సందర్భాలలో ఏ కారణాల వల్ల వస్తుంది, కన్నీరుకు కారణాలు ఏమిటి? ఏడ్చినప్పుడు కాకుండా నవ్వినప్పుడు కన్నీరు ఎందుకు వస్తాయి? దుఃఖాశ్రువులు మనుషులకేనా? ఇతర ప్రాణులకు ఉన్నాయా? ఇలాంటి అనేక ప్రశ్నలకు ఆసక్తికరమైన వివరణను పెన్నా ఇచ్చారు. ఈ వ్యాసం కళాతత్వ ఆవిష్కరణలతో కూడినది. లోతైన ఆలోచన చేసి కొత్త కోణాల నుండి దర్శించి విశ్లేంచి వివేచించారు పెన్నా.

రోజురోజుకో చరిత్ర (2004), జాతీయ, అంతర్జాతీయ దినోత్సవాలు (2006), తారీఖులో తెలంగాణ (2020) :

వివిధ రంగాలలో ప్రసిద్ధులైన వారిని గురించి రేఖా మాత్రముగా సమాచారాన్ని వివిధ రంగాలలో వ్యక్తులు చేసిన కృషిని విలక్షతను సంకలనం చేస్తూ పెన్నా రోజు రోజుకో చరిత్ర అనే గ్రంథాన్ని ప్రచురించారు. ఈ పుస్తకాన్ని విశాలాంధ్ర పబ్లికేషన్ హౌస్ వారు ప్రచురించారు. మన దేశంలో, ఇతర దేశాలలో వివిధ సంధర్భాలలో ప్రత్యేకంగా కొన్ని అంశాలలో దినోత్సవాలను జరుపుకుంటాము. అలాంటి దినోత్సవాలను గురించి జాతీయ, అంతర్జాతీయ దినోత్సవాలు అనే గ్రంథాన్ని ప్రచురించారు. ఈ పుస్తక రచనల్లో పెన్నా సమాచార విషయాన్ని సంక్షిప్త వివరణ ఇచ్చారు. ఇది పోటీపరీక్షలకు ప్రిపేరయ్యే అభ్యర్థులకు ఎంతో ఉపయోగకరం.

పై గ్రంథాల లాంటిదే తారీఖుల్లో తెలంగాణ దీనిని తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ వారు ప్రచురించారు. ఇందులో సమకాలీన తెలంగాణ ఉద్యమం, చరిత్రలోని ప్రధాన ఘట్టాలు, ప్రముఖ వ్యక్తుల గురించి సంక్షిప్త సమాచారాలు తేదీల వారీగా తెలంగాణ చరిత్రను లఘు పరిచయం చేశారు.

పెన్నా రచనలను అర్థం చేసుకోవడానికి మూడు పద్ధతుల ద్వారా అర్థం చేసుకోవచ్చు. అవి :

1. నిర్వచన స్థాయి.
2. ప్రయోగస్థాయి.
3. పఠన స్థాయి

తను ఎంచుకున్న అంశాన్ని ప్రాధాన్యత ఇచ్చి విషయాన్ని విపులంగా చర్చించి సిద్ధాంతీకరిస్తారు.

నిరాశావాది నిఘంటువు :

ఈ రచన చమత్కారాన్ని కలిగించే హాస్య, వ్యంగ నిర్వచనాల నిఘంటువు. దీనిలో వివిధ అంశాలకు, వివిధ వస్తువులకు ఉన్న విభిన్నమైన కోణాలను ఆవిష్కరించారు రచయిత. పుస్తకానికి ఉన్న శీర్షికను బట్టి ఇందులోని నిర్వచనాలు నిరాశకు ప్రతిబింబాలు అనుకుంటారు. కాని ఇవన్నీ నిగూఢార్థతను ఇచ్చే నిర్వచనాలు. పెన్నాయే అన్నట్లు "సహృదయత విశాల దృక్పథం ఉంటే వీటిని ఆనందించవచ్చు" ఈ నిర్వచనాలలో వ్యంగాన్ని అంతస్తవాన్ని బహిరంగంగా ఆమోదించకపోయినా అంతరంగికంగా విశ్లేషించి చూసుకోవచ్చు. ఈ నిర్వచనాలు ధ్వనించే సత్యాలను పాక్షిక సత్యాలుగా అర్థం చేసుకోవచ్చు.

జీవితంలో వివిధ సందర్భాలలోని వాస్తవ దృష్టి, లోతైన పరిశీలన దృష్టి మనం గమనించవచ్చు. వీటిలో చాలా నిర్వచనాలు మనల్ని ఆలోచింపచేస్తాయి. అకారాది

క్రమంలో రచయిత వివిధ అంశాలను నిర్వచించారు. వాటిలో కొన్ని మనం చూద్దాం.

1. అదృష్టం : ఇతరుల విజయానికి మనం చెప్పే ప్రధాన కారణం.

2. అబద్ధం : బుద్ధిహీనుడైనా నిజం మాట్లాడగలడు. అబద్ధం చెప్పేవాడు మాత్రం తెలివికలవాడై ఉండాలి. (శ్యామూల్ బట్లర్)

3. కమ్యూనిష్టు : నీ దగ్గర నుంచే వంట పాత్రను తీసుకొని నీ కోడిని వండుకుతినేవాడు.

4. కవిత్వం : రాజకీయనాయకులకు కోపం వస్తే కవిత్వం మాట్లాడతారు. కవులకు కోపం వస్తే రాజ కీయాలు మాట్లాడతారు.

5. నిర్ణయం : ఆలోనలతో అలసిపోయిన తర్వాత మనిషి స్వభావం.

6. న్యాయవాది : ప్రాక్టీస్ చేయడానికి అనుమతించ బడిన అబద్దాలకోరు.

7. పరిశోధన : ఒకరి నుంచి దొంగలిస్తే కాపీ అంటారు. అనేక మంది రచయితల నుండి దొంగిలిస్తే పరిశోధన. (విల్సన్)

8. పిసినారి : ధనవంతుడుగా చావడం కోసం నిత్యం పేదవాడిగా బతికేవాడు.

9. పుట్టుక : మరణానికి ప్రారంభం.

10. హీరో : పారిపోవడానికి భయపడేవాడు (ఇంగ్లీష్ సామెత)

ఈ నిర్వచన కూర్పు సేకరణ అంతా పెన్నా సరదాగా చేసారని అనుకోవడానికి వీల్లేదు. ఇందులో ప్రతి అంశంపై క్లుప్తం, వ్యంగ్యంగా, చమత్కారంగా నిగూఢార్థంగల నిర్వచనాలనే రచయిత ఇచ్చారు. కొన్నింటిలో నిరాశా, ప్రతికూల ధోరణి కనిపించినా వాటిలో కొన్నింటి అంత ర్థారం గ్రహిస్తే నగ్నసత్యాలుగా కనిపించక మానవు.

ప్రేమ.... మరికొన్ని సంగతులు :

ఇందులో ప్రపంచ ప్రసిద్ధమైన చమత్కారమైన ప్రేమ కొటేషన్లు సమాహారంగా ఉన్నాయి. మనుషులను, ప్రేమ అనే భావనను విడదీసి చెప్పలేము. జీవితంలో ఏదో ఒక దశలో ప్రేమ అనే భావనకి లోనుకాకుండా ఉండలేము. ప్రేమ గురించి మనకు తెలిసినా తెలియని అనేకానేక సంగతుల సమాహారం ఈ పుస్తకం.

దీనిలో రచయిత ప్రేమ అనే అంశాన్ని 13 విభాగాలుగా విభజించారు. అవి ప్రేమ, ముద్దు, సౌందర్యం, భార్య, భర్త, శృంగారం, స్త్రీ, పురుషుడు, పెళ్ళి, విడాకులు, బ్రహ్మచారి, ప్రేమలేఖ, కౌగిలింత పై విభాగాలలో ఆయా అంశాలకు సంబంధించిన వివిధ కవులు, విమర్శకులు, ప్రముఖులు ఇచ్చిన నిర్వచనాలను ఇచ్చారు. వాటిలో కొన్ని చూస్తే...

1. ప్రేమ ఒక అభిమాన సంఘం లాంటిది. కాకపోతే అందులో ఇద్దరే సభ్యులు.(అడ్రియాన్)
2. ప్రేమను కొనలేవు కాని దానికోసం బాగా ఖర్చుచేయవలసి వస్తుంది.(హెన్రీ హెంగ్‌మ్యాన్)
3. భార్య, భర్త పట్ల అతిగా ప్రేమను ప్రదర్శిస్తుందంటే ఆమె అతనిలోని లోపాలను నవరించాలని అనుకొంటుందనమాట.
4. పెళ్ళి చేసుకొమనే నేను పురుషులకు సలహా ఇస్తాను. మంచి భార్య దొరికితే ఆనందంగా జీవిస్తాడు. లేకపోతే తత్వవేత్త అవుతాడు.(సోక్రటీస్)
5. ఈ ప్రపంచంలో చాలా మంది మంచి మగవాళ్ళు ఉండవచ్చు. కాని మంచి భర్తలు చాలా తక్కువ.
6. చాలా మంది స్త్రీలు పురుషుల స్వభావాన్ని మార్చాలని ప్రయత్నిస్తుంటారు. నిజంగా పురుషులు మారితే స్త్రీలు వారిని ఇష్టపడలేరు.
7. స్త్రీలు స్త్రీలుగా పుట్టరు. స్త్రీలుగా పెంచబడతారు.
8. స్త్రీకి కూడా శరీరం ఉంది. దానికి వ్యాయామం ఇవ్వాలి. ఆమెకు మెదడు ఉంది. దానికి జ్ఞానం ఇవ్వాలి. ఆమెకు హృదయం ఉంది. దానికి అనుభవం ఇవ్వాలి.(చలం)

ముద్దుల ముచ్చట్లు :

ముద్దు అనేది ఎవరికైనా మధురానిభూతినే. ముద్దు ప్రేమకు తొలిసంకేతం. ఇలాంటి అంశంపై మహాఅయితే

ఒక పెద్ద వ్యాసాన్ని రాయవచ్చు కాని పెన్నా ఏకంగా ఒక లఘు గ్రంథంగా రాయడం సామాన్యవిషయం ఏమీ కాదు. ఈ పుస్తకం కోసం రచయిత ఎంతో శ్రమ చేశాడనే విషయం విషయ సూచిక చూస్తేనే అర్థమవుతుంది. దీనిలో పెన్నా సృజనాత్మకత శీర్షిక నుంచి చివరి పేజీ వరకు మనం గమనించవచ్చు. విషయ సూచికకు చుంబనశ్రేణి అని పేరు పెట్టడం సమంజసంగా ఉంది. దీనిలో ముద్దు ఎలా ఆరంభమైంది. ముద్దు తొలి లిఖిత ఆధారాలు, ముద్దుల ప్రయోజనం, పెదవుల స్వరూపం, రకారకాల ముద్దులు, వివిధ దేశాల ముద్దులు. ముద్దుల వివాదాలు ఇలా అనేకమైన విషయాలతో 39 శీర్షికలతో వివరించారు. ఈ గ్రంథంలో సాహిత్యపరంగా శాస్త్రీయ పరంగా అనేక విషయాలను చెప్పారు.

పెన్నా శివరామకృష్ణ తన ప్రతి రచనలో తీసుకున్న అంశాన్ని క్రమవికాసాలను ముగింపులను సమన్వయం చేస్తూ చర్చ సాగించారు. సాహిత్యేతర రచనల్లో కొత్తగా ఏ సిద్ధాంతాన్ని ప్రతిపాదించకపోయినా విలువైన సమాచారాన్ని క్రోడీకరించి ఒక క్రమంలో చెప్పారు. పెన్నా సాహిత్య అనుభవ వ్యక్తీకరణకు అధిక ప్రాధాన్యమిచ్చారు. పెన్నా తన అనుభూతి మూలక విమర్శలో కింది విషయాలను ప్రధానంగా గమనించవచ్చు. అవి:

1. ఒక వస్తువు మీద భిన్నకవులు చేసిన వ్యాఖ్యలను ఒక దగ్గర కూర్చడం.
2. వస్తువును, విషయాన్ని ఒక క్రమంలో చెప్పడం.
3. తాను ఎంచుకున్న ప్రతి అంశాన్ని వివిధ భాగాలుగా విభజించుకొని సమగ్రంగా క్రమపద్ధతిలో చెప్పడం.

పెన్నా సాహిత్యేతర రచనల్లో పెన్నా శ్రమ, పరిశోధన, పరిశీలన అనే అంశాలు స్పష్టంగా తెలుస్తాయి. ఎంచుకున్న అంశాన్ని అవగాహన చేసుకొని సంధర్భోచితంగా వివరించారు.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 2 (2), February - 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

మన వాగ్గేయకారులు

– డా॥. మానమ మునిరత్నం, తెలుగు శాఖాధ్యక్షులు, సర్ త్యాగరాయ కళాశాల, చెన్నై, తమిళనాడు.

సృష్టిలో ప్రాణుల ఉచ్ఛ్వాస నిశ్వాసాలు, హృదయ స్పందన లయాత్మకాలు. మనస్సును ఆలయతో మేళ వించడాన్ని, 'అజపాగాయత్రి' అన్నారు యోగసిద్ధులు. ఆ జపంలో ప్రాణా యామంవల్ల క్రమబద్ధమైన శ్వాసక్రియతో మనస్సు చేరి నిశ్చలమై అంతర్ముఖత్వానికి దారి కల్పి స్తుంది. అంతర్వీక్షణవల్ల మూలాధారంలో క్లుప్తమై, నిద్రాణమైయున్న ఆత్మశక్తి ఉద్బుద్ధమై ఊర్ధ్వగమనం పొందుతుంది. యోగసిద్ధికి ఇది ప్రారంభదశ, పరాశక్తి అనీ, కుండలినీ శక్తి అని పిలువబడే మూలాధార స్థానం లోని ఈ చైతన్య శక్తి ఉద్దీప్తమైనప్పుడే దివ్యనాదం జని స్తుంది. ఆత్మానుభవంకూడా దానితోబాటు కలుగు తుంది. ఈ నాదయోగాన్ని అనుభవగతం చేసుకొని దానితో సహజాతమైన దివ్యతత్వాను భవాన్ని నాదయోగ సిద్ధులైన మహనీయులు పశ్యంతీస్థితిని దాటి తమ దివ్యవాక్కులతో గాన రూపంలో వైఖరీ మార్గాన వ్యక్త పరిచారు. వైఖరిలో ఆనాదమే విభిన్న భాషా రూపాలతో అర్ధ పుష్టిగల మధుర పదబంధంతో వేద మంత్రాలకు సాటియైన కీర్తనలుగా వెలువడు తుంది. అలాంటి అందమైన సంకీర్తనలని మనకందించిన వాగ్గేయకారకులలో కొందరిని గురించి ఈ వ్యాసంలో ముచ్చటించుకొందాం.

లీలాశుకుడు :

పదమూడవ శతాబ్దివాడని అభిజ్ఞులు భావించే లీలాశు కుడు ఆంధ్రుడని కొందరు విమర్శకులు, ఉత్కళుడని మరికొందరు, కేరళీ యుడని మరికొందరు పేర్కొన్నారు. ఇతనికే 'బిల్వ మంగళు' డని ప్రసిద్ధికలదు. ఇతడు రచించిన గ్రంథం శ్రీకృష్ణ కర్ణామృతం. సంస్కృత శ్లోక రూపం, పాపయల్ల యసూరి అనే తెలుగు పండితుడు దీనికి వ్యాఖ్య రచించాడు. ఈ గ్రంథంలోని ప్రసిద్ధమైన శ్లోకాల్లో ఒకటైన కస్తూరీ తిలకం' అనే దానికి ముక్కకు ముక్కగా (కొద్ది మార్పుతో) గావింపబడిన అనువాదం - 'అరచంద్రులోని చిహ్నం శంబునుంబోలె నుదుట కస్తూరి బొట్టు పదనుకొనగ''

అని ప్రారంభమయ్యే సీస పద్యం, తెనాలి. రామకృష్ణుని 'పాండురంగ మాహాత్మ్యంలో ఉంది. ఇవి లీలాశుకుని ఆంధ్రత్వ నిరూపణకి ఆధారాలుగా విమర్శకులే పేర్కొన్నారు. ఉత్కళ దేశీయుడు, రూపగోస్వామి శిష్య వర్గంలోని వాడు అయిన కృష్ణదాసుకూడా. దీనికి వ్యాఖ్య వ్రాయడం వల్ల ఇతడు ఉత్కళుడే అని మరికొందరు. ఈ గ్రంథంలోని చాలా శ్లోకాలు నృత్యానుగుణంగా ఉన్నందున ఈ కవిని వాగ్గేయకారకుల కోవలో చేర్చవచ్చు.

అన్నమయ్య :

'శ్రీ కృష్ణ కర్ణామృతం'లోని భాష సంస్కృతం, లీలాశు కుని తర్వాత ఆంధ్ర దేశంలో వెలసిన కృష్ణమాచార్యులు రచించిన 'సింహగిరి వచనాలు' గేయలక్షణాల్ని సంపూ ర్ణంగా ఆకళించుకోని 'చూర్ణిక' అనే గేయ ప్రబంధం కావడం వల్ల సర్వాంగ లక్షణాలతో కూడిన అనేక పదాలని తెలుగులో రచించిన తాళ్లపాక అన్నమాచార్యులకే 'పద కవితా పితామహుడన్న బిరుదం సార్థకమైంది. సంకీర్తనలకి తొలి లక్షణ గ్రంథాన్ని అన్నమయ్య సంస్కృతంలో రచించి యుండడం ప్రసిద్ధం. అన్నమన్నార యేవచ'' అన్నట్లు అన్నం-అన్నాదః' అనే ఈ రెండు భగవంతుని పేర్లే. తైత్తరీయోపనిషత్తులో 'అన్న' శబ్దానికి ''వాక్'' అనే అర్థం ఉన్నట్లు పేర్కొనబడి ఉంది. సకల వాక్కులకు మూల మైన దివ్యవాక్శక్తియే 'అన్నమయ్య' అనే పేరుతో ఆవిర్భ వించింది నడం అతిశయోక్తి కాదు.

శ్రీ మహా విష్ణువు ఖడ్గమైన 'నందకం'' యొక్క అంశగా అన్నమయ్య అవతరించాడని అతని మనుముడు రచిం చిన 'అన్నమయ్య చరిత్ర' ద్విపదకావ్యం వల్ల తెలుస్తోంది.

అతని మూడు తరాలవారు పండితులై, కవులై పదకవితా, ప్రబంధకవితా ధురీణులై మీదు మిక్కిలి శ్రీ వేంకటేశ్వర పదారాధకులై కీర్తి పొందడం అన్నమయ్య వంశపు విలక్షణత. శఠగోపయతి శిష్యుడై, దేశికుడు పీఠాధిపత్యం వహించిన అహోబిల మఠంలో ముఖ్యారాధ్య దైవ మైన నృసింహ స్వామియొక్క మంత్రాన్ని ఉపదేశం పొంది జపసిద్ధి బడసినవాడు. అన్నమయ్య, అందువల్ల నృసింహ మంత్రంలోని ముప్పైరెండక్షరాల్లో అక్షరానికి వేయి చొప్పున కీర్తనలు రచించాడని అన్నమాచార్య కీర్తనలని పరిశోధించి వెలయించిన గౌరిపెద్ది రామ - సుశర్మగారు పేర్కొన్నారు.

భగవద్గుణాను భవాన్ని పెన్నిధ్ధరు. ఆళ్వారులు పాశు రాలనబడే తమిళ పద్యాలలో కీర్తించినవి దాదాపు నాలుగు వేలు. వీటికి "నాలాయిర దివ్య ప్రబంధ" మని ప్రశస్తి. దాని విశేషాలన్నింటినీ అన్నమయ్య తన పాటల్లో. నిక్షేపించాడని అభిజ్ఞుల తలంపు. ఈ విష యంలో తక్కిన వాగ్గేయకారులకన్న అన్నమయ్య. కున్న స్థానం విశిష్ట మైనది. జయదేవుడి "గీతగోవిందం' ఇలాటి లక్షణాలతో ఉన్నా. పరిమాణంలో అది రెండవదే. దాన్లో అష్ట పదులు ఇరవైనాలుగే శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రుల వారు తాము పరిశోధించి వెలయించిన అన్నమయ్య కృతుల సంపుటాల్లో క్రింది విధంగా ఆయన రచనలని గుర్తించారు. అవి: జాజర, చంద మామలు, కోవెల, చిలుక, తుమ్మెద పదాలు, లాలి, సువ్వి, గొబ్బి, ఉయ్యాల జోల, జోజో, జేజే, విజయాభవ, శోభన, మంగళ వైభోగ ములు, మేలుకొలుపులు, నలుగులు, దంపుళ్ళు, కొన్నారు. కూగూగు, గుజ్జన గూళ్ళు, చందమామ గుటికలు, నివాళులు, ఆరతులు, మంగళారతులు, జయ మంగళాలు, అల్లో నేరెళ్లు, ఛాంగుభూలు, భళాభళాలు, సానముఖాలు, అవధానములు, తందానాలు, వెన్నెలలు, చిత్తమా మనసా బుద్ధి సంబోధనలతో తగేయాలు. మనకు లభించినవి ఆయన కీర్తనల్లో సగానికన్న తక్కువే. దొరకని కీర్తనల్లో మరికొన్ని రీతులు ఉండి ఉండవచ్చు.

గేయ కవిత్వానికి వ్యావహారిక భాష్ణ ఉపయుక్తమనే ఒకఅభిప్రాయం వ్యాప్తిలో ఉంది. సమకాలీన ప్రజాభాష లోని నుడికారపు సొంపు, సంభాషణారీతి, ప్రజా సామాన్యులలో కనిపించే భావపరంపరలు సహజోప మానాలు, జాతీయత మొనవి అడుగడుగున, పదపదాన నిగ్గులుదేరేట్లు అన్నమయ్య కూర్చిన సాగసు ఏ ఇతర వాగ్గేయకారకుల రచనల్లోనే కాదు, ప్రతిభా సంపన్నులైన ప్రబంధకవుల రచనల్లో కూడ కనబడదంటే అది అతి శయోక్తి కాదు. భావుకతతో, అపురూపమైన భావాలతో "చిరునవ్వు నిప్పులు దోసిట ముంచేనే, తీగలు సాగెను తీరని వలపులు, పులియదెప్పుడును పూచిన వలపు, లేత మాయలు పూత సిగ్గులు, నిట్టూర్పులెండలు, కన్నుల వలపు చిలుకగ జడ మొదలైన నుడికారపు సొంపు సహృదయుల మనస్సులని పులకరింపజేస్తాయి. శృంగార కీర్తనలుగ, ఆధ్యాత్మ కీర్తనలుగ ఇహపర సుఖానుభవా నంద స్ఫూర్తి కలిగించే అన్నమా చార్య కృతులలోని పద సంపదకు, అర్థ వైశిష్ట్యానికి వ్యాఖ్యాన గ్రంథాలెన్ని వచ్చినా ఇంకా వెల్తి ఉంటూనే ఉంటుంది. ద్రావిడ వేదమన్న ప్రసిద్ధి పొందిన దివ్య ప్రబంధాలకి పరశ్శత వ్యాఖ్యానాలు ఏర్పడట్లు అన్నమాచా రుల కృతుల్ని తెలుగు వేదాలుగా గ్రహించి సులభవ్యాఖ్యలతో ప్రజాబాహుళ్యానికి ఆస్వాద నీయం గావించడం మన కర్తవ్యం.

నారాయణ తీర్థులు :

తెలుగు జాతీయ నృత్యగేయ ఫణితిని మేళవించుకొని వ్యాప్తిపొందిన సంగీత నాటక విధానం యక్షగానం. నృత్యమే వృత్తిగా గల జక్కులనబడే ఆంధ్రదేశంలోని ఒక తెగవారిచే ప్రదర్శింపబడేది కనుక దీనికి "యక్షగానమ"ని పేరు. శాస్త్రీయ నృత్య విధానం, దేశీయ పద్ధతి తగు మాత్రం సమ్మేళన పొంది, సంస్కృత నాటక లక్షణాలకంటె వేటైన లక్షణాలతో విభిన్న రగడలు, తాళ ప్రధానమైన రేకు, ద్విపద, ఏల, అర్ధచంద్రికలు, ధవళ శోభనములు అల్లోనేరెళ్లు మొదలైన దేశీచ్ఛంద విధానాలతో మధ్య మధ్య స్వల్ప మాత్రంగా ఉన్న వచనాలతో కూడిన మనోహర రచనా ప్రక్రియ యక్షగానం. తెలుగు సంప్ర దాయానికి చెందిన యక్షగాన ప్రబంధాన్ని సంస్కృత

వ్యాయానికి పరిచయం చేసిన మహనీయుడు శివ నారాయణ తీరులు. ఈయన రచించిన కృష్ణలీలా తరంగిణి'' అమృతథుని, శ్రీ భాగవతంలోని శ్రీకృష్ణలీలలు కొన్ని ఆధ్యాత్మిక తత్వవిన్యా సంతో ఈ గ్రంథంలో సహృదయ రంజకంగా చోటు చేసుకున్నాయి. శ్రీ కృష్ణజన్మ మొదలు అతని వివాహపర్యంతం గల లీలావిశేషా లిందులో వర్ణించబడ్డాయి. గజ్జెలరవళిలా గల గల శబ్దించే మధుర పదగుంభనతో, నృత్య భంగిమలకి చాలా అనుకూలించే వివిధ అభినయోపయుక్త భావ ప్రకర్షతో కూడిన దీన్లోని తరంగాలు నిజానికి పాలకడలి తరంగాలే, ఈ తరంగాల్లోని లయవిన్యాసాలు, తాళపు విరుపులు మరొక నృత్య భంగిమలో కనబడవు. వాడషయజ్ఞంగా కన్నుల పండువు చేసే అభినయంతో శ్రవణామృతంగా గానం చేస్తూ, సమర్థులైన వర్తకులు అభినయించే టప్పుడు ప్రేక్షకుల హృదయాల్లో ఆనంద ధునీ వీచికలు ఉవ్వెత్తుగా పొంగడం అనుభవైక వేద్యం. కృష్ణలీలల్లో నిగూఢ తత్వ రహస్యంతో కూడిన ఘట్టాలు గోపికా వస్త్రాపహరణం, రాసలీల, గోపికా గీత మొదలైనవి. ఈ ఘట్టాలని అభివర్ణించే సందర్భాల్లో కావ్యరసప్రకర్ష.. ఆధ్యాత్మిక తత్వవివేచన రెండింటికి సమ ప్రాధాన్యం కలిగేట్లు తనకున్న నాటకీయ పరిధిలోనే తీర్థలవారు కావించిన రచన మిక్కిలి ప్రశంసనీయం. దీనికొక నిదర్శనం.

'గోపికా వస్త్రాపహరణ' సందర్భంలో గోపికలకి శ్రీకృష్ణుడికి జరిగిన సంభాషణలో 'వస్త్రం' అనే పదానికి తీర్థలవారు' ఆవరణం' అనే పదాన్ని ప్రయోగించడం ఎంతో ప్రతిభా వంతమైంది. ఆవరణ శబ్దం వినగానే మనకి మొదట స్ఫురించే అర్థం 'కప్పు', ఇక్కడ మాయ - ఆవరణం. బ్రహ్మతత్వమే మాయా వరణం కారణంగా జీవుడుగా తన్ను భావించుకొని భేదదృష్టి పొందడమే సంసారం హేతువు. ఇది అద్వైత పద్ధతి. ఆ ఆవరణం తొలగి పోవడమే సంసార బంధ విముక్తి. 'లోకుల దృష్టిని కప్పివేయగల ఆవరణం. 'మాకిమ్ము'- అని గోపికలు వేడుగా, 'మీ కీయ దగ్గ ఆవరణం అనగా మాయావరణం నా వద్ద లేదని ''ఆవరణం మమ సహితే దాతుం, భావయ గోప వధూజనబృంద'' అని శ్రీకృష్ణుడు సమాధానం ఇస్తాడు. ఈ ఘట్టంలో గల సంవాదాన్ని అభినయం సమయంలో వినే సహృదయ ప్రేక్షకులకి గోపికా కృష్ణులన్న భావన గాక జీవ, పరమాత్మల సంవాదమనే దృష్టి కలుగు తుంది. తనలో గల జీవ సామాన్య లక్షణంవల్ల తాను కూడా ఒక గోపికగా బ్రహ్మతత్వోపదేశం పొందుతున్న భావన కలుగుతుందనడంలో అతిశయోక్తి లేదు.

ఇలాగే రాసక్రీడా సందర్భంలోను, శ్రీకృష్ణుని చేత తత్వో పదేశం పొంది గోపికలు ''పరమిహ పశ్యత పురుషం, స్వీకృత మాయిక మానుషం'' అంటూ మాయామానుష రూపంతో ఆవిర్భవించిన పరతత్వమే శ్రీ కృష్ణుడని పరస్పరం సంభాషించుకుంటూ నిర్మల హృదయులై రాస క్రీడలో పాల్గొన్నట్లు వర్ణింపబడింది.శ్లోకాలు, చూర్ణికలు, సంగీత సంవాదాలు దరువులు, ద్విపదలు, మంజ రులు, చతుష్పదులు, తద్ధిమితములు మొదలైన వానితో కూడిన ఈ తరంగాలు ఈ నాటికీ ఆంధ్రదేశంలో విజ్ఞులైన నటకులచే నృత్యనాటక రూపంగా ప్రదర్శింపబడుతూ సహృదయులకి మహానందాన్ని, బ్రహ్మ, తత్వ్రప్రబోధాన్ని కలిగిస్తున్నవిషయం మనమెఱిగినదే.

నారాయణ తీర్థులు 1580-1680 ప్రాంతంలో నివసించిన మహనీయులు. సన్యాసం స్వీకరించడానికి ముందు వీరి పేరు గోవిందశాస్త్రి. గుంటూరు సీమలోని 'ఖాజా' వీరి స్వస్థలం. తండ్రి తల్లావజల నీలకంఠశాస్త్రి గురువు శివరామానంద తీర్థలు. కృష్ణాతీరంలో షటాస్త్రాలు, సంగీత సాహిత్య పరిజ్ఞానం పొందారు. తెలుగులో కూడా పారిజాతాపహర ణమనే యక్షగానాన్ని రచించారు. తర్క, సాంఖ్య, మీమాంస శాస్త్రాలకి చెందిన సంస్కృత గ్రంథాలనే కాక యోగశాస్త్రానికి కూడ వ్యాఖ్య రచించినట్లు అభిజ్ఞులు చెబుతున్నారు. ఆంధ్రదేశీయులై నప్పటికీ తమిళ దేశంలో కావేరీ తీరంలో వరాహక్షేత్రమని ప్రసిద్ధి పొందిన వరహూరిలో నివాస మేర్పరచుకొన్నారు. వరహూరిలోని వేంకటేశ్వరాలయంలో తీర్థల వారి

చిత్తరువు ఈ నాటికీ ఉన్నదనీ, ఆయన ఆ ఆలయంలో ప్రారం భించిన ఉత్సవ విశేషాదులు ఈనాటికీ జరుప బడుతున్నాయనీ పెద్దలు చెబుతారు.

సిద్ధేంద్రయోగి :

సంగీత - సాహిత్య - నృత్తకళల్లోని మధుర రీతుల సమ్మేళనంతో రచింపబడిన సంగీత నాటకం 'భామా కలాపం' దీనికే 'పారిజాతా.. పహరణం' అనే నామాంతరం ఉంది. ఆంధ్ర జాతీయ గేయ ప్రబంధ రీతుల్లోని యక్షగాన ప్రక్రియలో అత్యుత్తమం, ప్రథమం అయిన యక్షగాన మిది. ఈయన నారాయణ తీర్థులకి సమకాలికులు. విమర్శకులు వీరిని తీర్థులకన్న దాదాపు ఇరవైయేళ్లు తరువాతివారని నిర్ణయిం చారు. తీర్థుల నిర్యాణానంతరం కొంతకాలం ఈయన జీవించినట్లు తెలుస్తోంది. సిద్ధేంద్ర యోగి 'గొల్ల కలాపమ' నే మరొక యక్షగానాన్ని రచించారు.

'కూచిపూడి నృత్యమనే తెలుగు జాతీయ నృత్య లక్షణ సమన్వితమైన భరత నాట్య ప్రక్రియకు ఈయనే ఆద్యుడు. 'భామా కలాపం' శృంగార రసాభ్యంచితంకాగా గొల్ల కలాపం'లో ఆధ్యాత్మిక తత్త్వమెక్కువ. చల్లనమ్మ వచ్చిన గొల్లభావంకి, శ్రీ కృష్ణ సఖుడైన విదూషకుడికి జరిగిన సంభాషణ రూపంగా సృష్టితత్వం, ఆధ్యాత్మిక తత్వాలు, జీవ, బ్రహ్మ తత్వాలు మొదలగునవి పేర్కొన బడ్డాయి. కూచిపూడి వారి ప్రదర్శనల్లో శబ్దాలు, సలాములు, జతులు, ముఖ్యంగా దశావతార శబ్దం ప్రసిద్ధ నృత్య విధానాలు. దశావతార శబ్దంలో ప్రాచీన, నవీన పద్ధతులు రెండూ వీరి సంప్రదాయంలో ప్రసిద్ధి చెందినవే.

క్షేత్రయ్య :

నారాయణ తీర్థులు, సిద్ధేంద్ర యోగి, రామదాసు అనే ముగ్గురికీ క్షేత్రయ్య సమకాలికుడు. కృష్ణా జిల్లాలోని 'కూచిపూడికి దగ్గరగల ''మువ్వ' ఇతని నివాసస్థానమని 'క్షేత్రయ్య పరముల' పీఠికలో శ్రీవిస్సా అప్పారావు. సహేతుకంగా నిరూపించారు. క్షేత్రయ్య చిన్ననాటి పేరు 'వరదయ్య'. అనేక క్షేత్రాలు దర్శిస్తూ తిరిగినందువల్ల 'క్షేత్రయ్య' అనే ప్రసిద్ధి కలిగింది. ఇతని పదాల్లో మన్నారు గుడి వద్దనున్న వరహూరు వరాహస్వామి, చిదం ఎంబరం తెల్ల గోవిందరాజస్వామి, వేదనారాయణ పురి నారాయణుడు, హేమకూటం హేమాద్రి స్వామి, యాదగిరి చెలువరాయడు, తిరుమల వేంకటేశుడు, తిరువళ్ళూరు వీరరాఘవస్వామి, శ్రీశైలం మల్లికార్జునుడు మరికొన్ని క్షేత్రాల ప్రశంసలూ ఉన్నాయి. తమ కీర్తనల్లో ఇతనివలె ఇన్ని క్షేత్ర దైవాల్ని ప్రశంసించిన కవి మరొక్కడు లేదు. కాబట్టి ఇతనికే క్షేత్రజ్ఞ నామం సార్థకమౌతుంది. ఈయన రచనల్లో కంచి వరదరాజుని ప్రశంసించే పదాలే ఎక్కువ. తన పేరిమీద వెలసిన స్వామిమీద అభిమానం దీనికి కారణం కావచ్చు! తంజాపుర రఘునాథ నాయకులు, అతని కుమారుడు విజయ రాఘవ నాయకుల నాశ్రయించి వారిమీద కూడా పదాలు పాడి బహుచూనాలందుకున్నవాడు క్షేత్రయ్య, తుపాకు వేంకటకృష్ణరాజుకు అంకితంగా రెండు, మూడు పదాలు గోలకొండ అబ్దుల్లా కుతుబ్షా పాదుషాని గురించి కొన్ని పదాలు రచించడం, రాజాశ్రయంతో వైభవం పొందడం ఈతని లౌకిక సుఖాసక్తికి నిదర్శనాలు.

అన్నమాచార్యుల కవితలోని పదాల కూర్పులకు అనుకరణాలనదగినవి క్షేత్రయ్య కవితలో ఉన్నాయి - క్షేత్రయ్య కవితలో కూడా ప్రజా వ్యవహారంలో ఉన్న చక్కని సామెతలు, పలుకుబళ్లు, సహజభావాలు, సహజ సంభాష ణలు కోకొల్లలుగా కనబడతాయి. '' అనుకొనే మున్నది. అరటాకు ములు, సామ్యమైనందు కిప్పుడు, తోటకూర దొంగవలె తొలిగిపోయే వాడు, వలపు సిగ్గెరుగదు, పైడి చేతికి వచ్చినదే చాలునటవే ఊరికి పోయిన వంగడం ఉట్టిపడ్డట్లు వచ్చి - మొదలగునవి నిదర్శనాలు. శ్రీనాథుడు, చేవుకూర వేంకటకవి మొదలైనవారి పలుకుబళ్లు కూడా ఈతని కవితలో కనబడతాయి. ''మెరుగు చామది ఛాయ మేను మరువాడె, కాయజుని తలిరు పదను కత్తులమ్మ యీచెలులు'' (కంచి యర వత కుసుమాస్తు ఖడ్గలతలు - శ్రీనాథుడు) వంటివి దీనికి నిదర్శనాలు. కొన్నిచోట్ల మేరమీరిన శృంగారం ఇతని

పదాల్లో కనిపించడం వల్ల భక్తి భావం కన్న శృంగార రసలోలత ఇతనిలో ఎక్కువ అనిపిస్తుంది. అయినా ఇతని రచనని మధురభక్తి భావనలతో కూడినదిగా భావించే విద్వర్వర్యులు లేకపోలేదు.

ఏది ఎలా వున్నా నాట్యానికి బాగా అనుకూలించే భావాలు, భావానుగుణాలైన మృదుపద గుంభనలు, సహజ జాతీయోక్తుల తోడి సంభాషణలు సామాన్యులనే కాక పండితులను కూడ తలలూపింపజేయడం నిర్వివాదం, ప్రౌఢభావాలతో, వింత చమత్కృతులని వెదజల్లే పదగుంభనలతో రచన చేసే కవివర్యులుండ వచ్చును గాని, అత్యంత సహజంగా మృదుమధుర లలిత పదముల తోడి అలతి అలతి కూర్పులతోనే ఎంతో రసపుష్టిగల పదాలని రచింపగల అనితర సాధారణ ప్రజ్ఞలో రేవుకూర వేంకటకవికి సాటి అనదగిన ప్రతిభాశాలి క్షేత్రయ్య.

సారంగపాణి :

చిత్తూరు మండలం కార్వేటినగర సంస్థానంలో ఉండిన వాగ్గేయకారుడు. సారంగపాణి. ఈయన క్షేత్రయ్య మార్గాన్నే అనుసరించి అతివేల శృంగారంతో కూడిన పదాలని రచించాడు. ఇవి 195 వరకే మనకు దొరుకు తున్నాయి. శృంగారంలో ఉదాత్తమైన రచన కనిపించదు. కాని ప్రజాసామాన్య వ్యవహార భాషలో, సామాన్య శృంగార భావనలే ఇతని కృతుల్లో కనిపిస్తాయి. లోకాభిజ్ఞత ఇతని పదాల్లో అడుగడుగున ఉట్టిపడుతూ ఉంటుంది. వైరాగ్య నీతి ప్రబోధకాలనదగిన పదాలు కొద్దిగా మాత్రమే ఉన్నాయి.

''పడతి నేస్తము వేణుగోపాల మాను
తడబడక నీవికను దాని చింత మాను
పంతమున అటుదిక్కు పదినాళ్ళు పోక మాను
యింతికిచ్చేవు సుమా ఈతమాను''

ఇటువంటి సామాన్య శ్లేష చమత్కృతులు ఇతని కవితలో కనబడతాయి. భక్తి, నీతి, వైరాగ్యాలని వెల్లడించే పదాలు కొన్ని వ్రాసినా, ఇతని కవిత్వాన్ని గురించి ఆలోచించి నప్పుడు కొట్టవచ్చేట్లు కనబడే అతివేల శృంగార భావనలే చదువరుల మనస్సులో నిలుస్తాయి. కాబట్టి వాగ్గేయకారుల్లో ఇతనిది క్షేత్రయ్య తరువాత స్థానమే.

రామదాసు :

'కంచర్ల గోపన్న'యే భద్రాచల 'రామదాస'న్న ప్రసిద్ధి పొందాడు. తెలంగాణా ప్రాంతంలోని 'నేలకొండ పల్లె' నివాసి. రఘునాథ భట్టరాచార్యుల వద్ద సమాశ్రయణం (పంచ సంస్కారాలు పొంది శ్రీ వైష్ణవుడ య్యాడు. చిన్నప్పటి నుంచి సహజసిద్ధమైన రామభక్తి కలవాడు. ఆ కాలంలో గోలకొండని అబ్దుల్లా తానీషా, అబుల్ హసన్ తానీషాలు పాలించేవారు. వారి కొలువులో ఉన్నతాధి కారులై యుండిన అక్కన్న, మాదన్నలు తన మేనమామ లువడంవల్ల వారి పలుకుబడిలో గోపన్న భద్రాచలానికి తహసీల్దారుగా నియ మింపబడ్డాడు. తాను వసూలు చేసిన సర్కారు పైకంతో భద్రాచలంలోని రామాలయానికి ప్రాకార గోపుర మంటపాలు నిర్మించి, దివ్యా భరణాలు చేయించాడు. అందువల్ల నవాబు కోపించి, గోపన్నను చెరసాలలో బంధించాడు. 12 సంవత్సరాలపాటు చెర సాలలోనే మగ్గుతూ, చివరకి విషం త్రాగి మరణించడానికి నిర్ణయించుకున్నాడు. సీతాదేవిని సంబోధిస్తూ ''నను బ్రోవమనీ చెప్పవే'' కీర్తనని పాడగా సీతాదేవియొక్క ప్రోద్బలంతో శ్రీరాముడే లక్ష్మణునితో సహా మారువేషాల్లో వచ్చి నవాబుకి చేరవలసిన రొక్కం చెల్లించి భక్తుడిని చెర విడిపించినట్లు జనశ్రుతి. రామదాసు రచించిన 'దాశరథీ శతకం' అచ్చు ప్రచారంలో ఉంది. కాని ' రామదాసు కీర్తన' అంటూ ప్రత్యేక గ్రంథమేదీ ముద్రింపబడలేదు. ప్రస్తుతం 'సింగరిదాసు' రచించిన 'రామదాసు చరిత్ర'' లోనే రామదాసు రచించిన కీర్తనలు కలిసియున్నట్లు విమర్శ కులు అభిప్రాయపడుతున్నారు.

రామదాసు చరిత్రని యక్షగానంగా యాదవదాసు, సింగరిదాసు, కృష్ణదాసు అనేవారు రచించారు. రామదాసు కీర్తనల్లో జాలి కలిగేటట్లుగా రక్షింపుమని శ్రీరామున్ని

వేడుతూ పాడిన పాటలు, లలిత భావాలతో కూడిన గుణవైభవ ప్రశంసలు, ఒకటి, రెండూ తత్త్వబోధక కీర్తనలు తప్ప శృంగార భావంతో కూడినవి మచ్చుకైనా కనబడవు. అందరికీ అర్థమయ్యే భావాలని లలతపద గుంభనతో, సరళధారతో ఎలాంటివారికైనా పాడుకోవడానికి అనుకూలంగా ఉంటాయి ఈయన కీర్తనలు. చిందులు త్రొక్కుతూ, గంతులు వేస్తూ సులభంగా పాడదగినవిగా ఉండడంవల్ల ఇతని కీర్తనలు భజనపరుల్లో ఎక్కువగా వ్యాప్తిని పొందాయి.

త్యాగరాజు :

దక్షిణ భారతదేశంలో 18వ శతాబ్దిలో కర్ణాటక సంగీతానికి అద్భుతావహంగా మెరుగులు తీర్చి చిరంతనమైన యశస్సుని సంతరించుకొన్న మహనీయులు, రత్నత్రయమని ప్రసిద్ధిపొందినవారు శ్యామశాస్త్రి, త్యాగరాజు, ముత్తుస్వామి దీక్షితులు. వీరిలో త్యాగరాజు ఆంధ్రుడై, తమిళదేశంలో కావేరీ తీరంలో నివసించినవాడు. సంగీతాభ్యాసంలో గడితేరాలంటే ఎవరికైనా తన కీర్తనల సాధన తప్పనిసరి అనీ, మధురగానానికి అనువైనది సుధాసదృశ పదగుంభన సహజంగాగల తెలుగు భాష ఒక్కటే అని నిరూపించిన మహనీ యుడు త్యాగరాజు. అద్వితీయ ధాతు కల్పన లతో, హృదయంగమ భావాలతో, పవిత్ర భక్తి తత్త్వముట్టిపడే కీర్తనలనేగాక అప్పటి తెలుగు సాహిత్య ప్రక్రియగా ప్రసిద్ధి పొందిన యక్షగాన ప్రబంధ రచనలోను అగ్రగణ్యుడనిపించు కొనేట్లు మూడు సంగీత నాటకాలని రచించిన సంగీత సామ్రాట్టు త్యాగరాజు.

సంగీత శాస్త్రంలో సామాన్య పరిచయం కలవారు మొదలు తమ అగాధ, అద్వితీయ ప్రతిభని ప్రదర్శింప దలచుకొనే ఉత్తమశ్రేణి గాయకులవరకు, అన్ని తరగతుల వారూ. పాడుకొనదగిన కీర్తనలని రచించిన సవ్యసాచి త్యాగరాజు. తన అభిమతం ప్రకారం కీర్తనలని గానం చేసే పద్ధతిని చిరస్థాయిగ నిలుపగల్గిన శిష్యపరంపరని రూపొందించుకొనడం ఇతని మరొక విశిష్టత. భగవంతునికి కీర్తనలతోనే షోడశోపచారాలని సమర్పించి నాస్తికులను కూడా భక్త శిఖామణులుగా మలచగలిగిన కీర్తనలని రచించడం ఇతని మరొక విశిష్టత. జ్ఞానపూర్వక భక్తి ప్రాశస్త్యాన్ని "ప్రహ్లాద భక్తి విజయం'లోను, మధురభక్తి విశిష్టతని "నౌకాచరిత్రం' లోను చక్కగా నిరూపించాడు త్యాగయ్య. ఇవి రెండూ యక్షగాన లక్షణాలతో మాత్రమేకాదు, సంస్కృత నాటక లక్షణాల తోను కూడిన ఉత్కృష్ట రచనలు కూడా.

ముగింపు :

తెలుగు గేయ సాహిత్య ప్రపంచానికి అన్నమాచార్యులు, త్యాగరాజు సూర్యచంద్రులవంటివారు. అన్నమయ్య రచనలో మాతు కల్పనలో ప్రౌఢి, లోకజ్ఞత, జానుతెలుగు, భాషాభిజ్ఞత అడుగడుగునా కనపడతాయి. త్యాగరాజు కీర్తనల్లో విశిష్ట ధాతు కల్పన రాగమాధుర్య మేళన, గాయకులు సులభంగా పాడదగిన పదబంధం ఎక్కువ. నిత్యమూ పోతన భాగవతాన్ని పారాయణం చేయడం వల్ల నిర్దుష్ట పాండిత్యం ఈయనకు అలవడింది. ఇది ఈయన యక్షగాన రచనలో కనిపిస్తుంది. చక్కని సామెతలు, సామాన్య ప్రజల హృదయాల్లో తోచే భావనలు, ఎడనెడ ఈయన కృతులలో గోచరిస్తాయి. నివాస వాసనాబలం చేత తమిళ పదాలు, తమిళభాషా లోకోక్తుల అనువాదలనదగిన ప్రయోగాలు ఈయన కీర్తనల్లో చోటుచేసుకున్నాయి.

ఆధ్యాత్మక రామాయణ కీర్తనలు రచించిన మునిపల్లె సుబ్రహ్మణ్యకవి, త్యాగరాజస్వామి శిష్యులలో ముఖ్యులైన శ్రీ వేంకటరమణ భాగవతులు - మొదలైనవారు ఇంకా కొందరు ప్రసిద్ధ తెలుగు వాగ్గేయకారులున్నారు. పారమార్థిక చింత అలా ఉంచి, సహృదయత, విశ్వమానవ సౌభ్రాత్రం, భూతదయ మొదలైన సద్గుణాలు మానవునిలో కలిగించాలంటే సర్వాత్మకం, సర్వవ్యాసకం అయిన దైవతత్త్వమొకటి ఉందనే భావన ఎంతో తోడ్పడుతుంది. సామాన్య జనుల హృదయాల్ని రసార్ద్రం చేసి, వాటిలో భక్తిబీజాల్ని నాటి, జీవితాల్ని సుఫలం చెయ్యగల

శక్తి అన్నమయ్య, రామదాసు, త్యాగరాజు మొదలైన మహనీయులైన వాగ్గేకారకుల రచనలకి ఉంది. కారణ జన్ములైన అలాంటి మహనీయులు మనకు ప్రాత:స్మరణీయులు.

ఆధార గ్రంథాలు :

1. క్షేత్రయ్య దక్షిణాది భక్తపారిజాతాలు, శ్యామప్రియ, యస్.వి.యస్.గ్రాఫిక్స్, హైదరాబాదు, 2003.
2. క్షేత్రయ్య - తెలుగు వైతాళికులు సిరీస్ ప్రచురణ) - రచన డా.మంగళగిరి ప్రమీలాదేవి - ప్రచురణ: తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు.
3. అన్నమాచార్య సంకీర్తనామృతము- ప్రథమ, ద్వితీయ భాగాలు. వాఖ్యాత: సముద్రాల లక్ష్మణయ్య, తిరుపతి, 2000.
4. త్యాగరాజు పంచరత్నములు - స్వర్ణసహితము, పొట్టిశ్రీరాములు తెలుగువిశ్వవిద్యాలయం, లలిత కళాక్షేత్రం పబ్లిక్‌గారెడ్డన్స్, హైదరాబాదు - 500004.
5. తెలుగు నాటక వికాసము - డా॥ కోణంగి శ్రీరామ అప్పారావు. శ్రీ పరమేశ్వర పబ్లికేషన్స్, చిక్కడపల్లి, హైదరాబాదు-20
6. సాహిత్య జగత్తు - ప్రచురణ, సాహితీ సదస్సు, కర్నూలు, సెప్టెంబర్, 1973.
7. శబ్దరత్నాకరము - బహుజనపల్లి సీతారామాచార్యులు, ఆసియన్ ఎడ్యుకేషనల్ సర్వీస్, న్యూఢిల్లీ, మద్రాసు 2003.
8. శ్రీమద్భాగవత మహాపురాణం - గీతాప్రెస్, గోరఖ్‌పూర్, గొబింద్ భవన్, కార్యాలయ, కలకత్తా. 2006
9. ఆంధ్ర వాగ్గేయకారచరిత్రము : బాలాంత్రపు రజనీకాంతరావు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ - 1958.
10. సంగీత శాస్త్రసారము (వాల్యు -1) ఎన్.ఆర్.జానకీరామన్ తిరుమల తిరుపతి దేవస్థానము, మద్రాసు - 1986.
11. నవవిధ భక్తులు, శ్రీ కుందుర్తి వెంకటనరసయ్య శ్రీసీతారామ నామసంకీర్తన సంఘం, గుంటూరు, 1986.
12. రామదాసు కీర్తనలు, మంచాళ జగన్నాథరావు, ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ 1975.
13. తెలుగువాణి, నాల్గవ ప్రపంచ తెలుగు మహాసభల ప్రత్యేక సంచిక - 2012. ప్రధాన సం. ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, పొట్టిశ్రీరాములు తెలుగువిశ్వవిద్యాలయం, హైదరాబాదు.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 2 (2), February - 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

చలసాని వసుమతి - మనస్సు- విశ్లేషణ

- గుమ్మడిదల మురళీకృష్ణ, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, కృష్ణా విశ్వవిద్యాలయం, మచిలీపట్నం.

చలసాని వసుమతి ఒక గొప్ప నవలా రచయిత్రిగా పేరు తెచ్చుకున్నారు. ఆమె రాసిన నవలలు, కథలే అందుకు తార్కాణం. ఆమె రచనలను పరిశీలించినప్పుడు ఒక్కొక్కసారి ఆస్తికురాలు అనిపిస్తుంది. అంతలోనే నాస్తికత్వం దర్శనమిస్తుంది. భగవంతున్ని నమ్మటం ఆరాధించటం ఉంటుంది. ఆదే సమయంలో మానవత్వం పట్ల మంచితనం పట్ల ఆమె హృదయం కన్పిస్తుంది. స్త్రీల పట్ల జరిగే అనేక రకాల అఘాయిత్యాలు, అత్యాచారాలు నిర్మూలించటం కోసం ఆమె నిరంతరం తన కవిత్వ పదునుతో ఎన్నో నవలలను, కథలను సమాజానికి అందించారు. ఆమె వయస్సు రిత్యా ముసలితనం వచ్చినా ఏమాత్రం క్రుంగిపోకుండా నేటికీ అనేక శారీరక ఇబ్బందులు ఎదరవుతున్నా మొక్కవోని దీక్షతో తన కలానికి పదునుపెట్టి ఎంతో మంది స్త్రీలను చైతన్య పరుస్తున్నారు. అటువంటి వసుమతీ గారి కలం నుండి జాలువారిన ఒక చక్కటి వ్యాసమే ఈ "మనస్సు".

మనస్సు- విశ్లేషణ :

చలసాని వసుమతి రాసిన "వసుమతీ వర్ణమాలిక" వ్యాసాల్లో "మనసు" వ్యాసం ముఖ్యమైనది మనిషి జీవితంలో తన మనసును తన ఆదీనంలో అదుపులో ఉంచుకోవాలి. సమాజ ధోరణులు, మనషుల మనస్తత్వాలు గుణాలు, ఆదేశాలు అంతులేని కోరికలు, కాలం కల్పించే పరిణామాలలో గంతులు వేస్తుంటాయి. మానవుడు ఏ జాతికి చెందినా స్థిరత్వంతో స్థిరమైన మనసుతో వున్నప్పుడు సృష్టి మరోలా కనిపిస్తుంది. నమ్మకంలేని పని, నిజాయితీ లేని ప్రార్థన, వాసనలేని ప్లాస్టిక్ లాంటివి బాహ్య ఆనందాలు తాత్కాలిక ఆనందాలే.

వాంఛల వల్ల జరిగే కర్మలు పువ్వులాంటి మనస్సును జలగలా పీల్చి పిప్పిచేసి మనస్సును చూసి వికటాట్టహాసం చేస్తుంది. అప్పుడు మనసు నీవు వదిలి వడలి పోయిన నిస్పృహను అని కన్నీళ్ళు పెట్టుకుంటుంది. నీతి నిజాయితీలతో కల్మషంలేని మనసు స్పష్టమైన తెల్ల కాగితంలా ఉంటుంది మబ్బిగ నుండి అప్పుడే తీసిన వెన్న లాగా సుతిమెత్తగా ఉండి ఆహ్లాదాన్ని పంచిపెడుతుంది అందుకే కాలంతో పాటు మనుషుల మనస్తత్వాలు అనూహ్యంగా మారుతుంటాయి కాలంలో వచ్చే మార్పు మంచిదే కానీ వ్యక్తిలో ఉండే స్థిరత్వం లేని మార్పు అత్యంత ప్రమాదకరం అందుకే మనిషి తన మనసును అదుపు చేసుకోవాలి.

నేటి కాలంలో మనిషి మనసు - విశ్లేషణ :

నేటి సమాజ స్థితిగతులు, ధోరణులు, మనుషుల మనస్తత్వాలు, గుణాలు, ఆవేశాలు, అంతులేని కోరికలు, కరోనా కాలంలో గంతులు వేస్తున్నాయి. ఎవరి మనసు పదికాలాలపాటు పదిలంగా ఉంటుందో తెలియదు ఎవరి వ్యక్తిత్వం ఎప్పుడు ఎలా మారుతుందో తెలియదు. ఎవరి జీవితం ఎప్పుడు ఎందుకు ఎలా దుర్భరంగా తయారవుతుందో తెలియదు ఇలాంటి పరిస్థితుల్లో బాహ్యంగా వచ్చే ఇబ్బందులువేరు పరిసరాల ప్రభావం వలన వచ్చే అలజడులు వేరు అనుకోని ఆలోచనలు, అభిప్రాయాలు చెదల్లా పుట్టుకొస్తుంటాయి ప్రేమ కసిగా మారవచ్చు ఇష్టం అయిష్టంగా కనిపించవచ్చు లక్ష్యం నిరాసక్తంగా మారవచ్చు ఏదీ మనసు స్వాధీనంలో ఉండదు నేటి కరోనా కాలంలో ఇదీ మరీ ఎక్కువ పెద్దలు గురువులు చెప్పిన మాట పిల్లలు వినకపోవడం వల్ల వారి మనసు వారు అదుపులో ఉంచుకోకపోవడంవలన "చెప్పేవాడు లేక చెడిపోయాడు" అన్నట్లు సమాజం చెడు

వైపు పయనిస్తోంది. అందుకోసం యువతలో చైతన్యం తీసుకురావాలి. మంచి చెడుల విచక్షణజ్ఞానాన్ని వారిలో నూరిపోయాలి. అప్పుడు సమాజంలో కొంత మార్పు వస్తుంది. ప్రతి మనిషిలో స్వార్థం పేట్రేగిపోయింది మనిషి ఈ "నేను" లో ఉన్నంత వరకు ఈ కురుక్షేత్రం తప్పదు. ఆలోచించి జీవితంలో చక్కటి నిర్ణయాలు తీసుకుంటేనే మానవజాతికి సుఖసంతోషాలు కలుగుతాయి

మనిషి మానసికంగా కాకుండా క్రియరూపంలోనే హింసని దౌర్జన్యాన్ని ఎదుర్కోవాలి. బాధను, మాయను, విషాదాన్ని తొలగించడమే మత గ్రంథాల ప్రధాన ఉద్దేశం. ఏది జరిగినా, ఏది చేసినా తన వల్లనే జరిగిందనే బాధ మనిషిని బలహీనుడ్ని చేస్తుంది. మారిపోయే దశలు విషదంగా తెలిసినప్పటికి బాధ, సుఖం అనుభవించడం తప్పడం లేదు మనిషికి ఇలా బలమైన విధి ప్రక్రియను నడిపించేది అజ్ఞాత శక్తి. భగవానుడని పిలిచినా, చైతన్యమని పిలిచినా ఇది అంగీకరించాలి. జీవించి ఉన్నంత కాలం ప్రతిజీవి. ప్రతి మనిషీ ఎవరైనా సృష్టిలో ఏదైనా ఉనికి కలిగి ఉంటుంది. మనిషిగా పుట్టినప్పుడు పరాజయాన్ని వదిలి జీవించినంత కాలం ఆయా సమయాల్లో తన జీవితంలో తారసపడే పరిస్థితులను సహృదయంతో సంపూర్ణ హృదయంతో ఎదుర్కోవాలి. చేతలే ఇక్కడ ప్రమాణాలు, ఉపన్యాసాలు, రచనలు కావు.

ఏదైనా తీవ్రనమస్య వచ్చినప్పుడు ఈ జీవితం శాశ్వతం కాదు అనే తలంపు ప్రతి మనిషికి వస్తుంది. అసామాన్యమైన బాధలున్నప్పుడు ఈ భావన వచ్చినా చాలు మనిషి ఆత్మవిశ్వాసాన్ని కొల్పోడు. కష్టతరమైన దు:ఖంలో కలుహితమై మునిగిపోయిన మనస్సును బయటకు తీసుకువచ్చినవేమీ శాశ్వతం కాదు. ఎంత ఎత్తు ఉన్నా ఎంత లావున్నా ఏదీ ఆగదు. పుట్టటం, పెరగటంలో సంతోషం, ఆనందం ఏడుపు, ఆశ్చర్యం, కోరిక, విచక్షణ గుణాలు ఆవరిస్తాయి. తరువాత స్వార్థం, కోరికలు బలమెక్కువై వివేకాన్ని వెనక్కి జరుపుతాయి. ఈ వచ్చే సంఘటనలు కరిగిపోతాయి కాలంతో అసలే సముద్రం కాదు. మనిషికి కావలసింది సుఖంగా జీవించటం సుఖమనేది మానసికం, శారీరకం కనుక సుఖాలు సుఖాలుగా కాక దు:ఖాలుగా కూడా రూపొందుతాయి. ఎదురుదెబ్బ తగిలినప్పుడు శరీరం మనసు బాధ పడుతుంది. శరీరం అనారోగ్యంగా ఉన్నా, మనస్సు ప్రశాంతంగా ఉన్నావారికి సుఖం కలుగుతుంది.

ఆలోచనకు ఆలోచనకు మధ్య ఉన్న నిశ్శబ్దమే, ఆలోచన, అభిప్రాయాలు, ప్రవర్తన, ఆశయాలు, అభిరుచులు, ఆదర్శాలు, మంచి, చెడు-ఇవి ప్రతి మనిషికి వేరువేరుగా ఉంటాయి. ఈ వేరుగా ఉండేవే సృష్టికి మూలం. ఇది చాలా ఆశ్చర్యకరమైన విషయం. పునర్జన్మ ఉంది, లేదు అనే వాదన కూడా ఈ రహస్యంలో ఈ వింతలో దాగుంది. ముందు మనిషి తనకు ఏది నచ్చుతుందో తన అభిప్రాయాలేమిటో తన నడవడికపై చెప్పిన గుణాలు ఏది తనకు కావాలో నిర్ణయించుకోలేడు అలా నిర్ణయించుకోలేనివారి జీవితం అస్తవ్యస్తం. తను ఆచరించటం, తన దృఢమైన ఆలోచన ద్వారానే వస్తుంది. అప్పుడు కలత చెందే మనస్సు ఉండదు. దు:ఖాలుండవు. తనేమి చేయాలో తను చేసిన దానితో తను స్థిరపడిపోయి ఎంతో ఆనందంగా ఉంటాడు. మరొకరి ప్రభావం లేని వ్యక్తి స్థిరంగా ఉంటాడు. ఏ వ్యతిరేక భావం లేక స్థిరమైన ప్రవర్తన కలవాడై ఉంటాడు. అగ్నిప్రవేశం చేసిన సీత ఇందుకు తార్కణం. సీత ఏ తప్పు చేయలేదు. అలాగే కృష్ణుడు కాళింది మర్దన కొరకు నీటిలో మునగటానికి భయపడలేదు. ఆంజనేయస్వామి గాలికి భయపడడు. వీరులు భూమి మీద పడటానికి వెనుకంజవేయరు. దేవతలు ఆకాశంలో ఉంటారు. ధైర్యవంతుడు, వివేకి జీవితాన్ని తెలివిగా మలచుకున్నవాడు, గౌరవానాన్ని పొందాలనుకునేవాడు తన ప్రవర్తన ద్వారా పొందాలే గాని పనికట్టుకుని ఎవరూ గౌరవించరు. అపకీర్తి రావటానికి కారణం, తన స్వభావానికి విరుద్ధంగా నడుచుకోవడం వల్లనే స్వార్థమే మూలకారణం. శరీరానికి చేసేదంతా స్వార్థమే అలాగే ఎవరి మనస్సుకు అనుకూలంగా చేసేది

అయినా స్వార్థమే. అందుకే మనస్సుకు సుఖంగా ఉండుటే స్వధర్మం మనస్సు సుఖంగా ఎప్పుడుటుందో అప్పుడు మంచినే చేస్తుంది. దు:ఖం మనుస్సుకు సుఖం మనస్సుకు తాను వేరుగా చూసినప్పుడు మనస్సు బాధపడుతుంటే చూడగలిగేవాడే మహాపురుషుడు. మృత్యువు మనిషిని సూక్ష్మంగా ఆలోచింపజేస్తుంది. మనిషికి ఏదైనా ఆశ్చర్యమైన విషయం భావంలా వచ్చినప్పుడు అన్నీ మరచి ఎలా అయిపోతాడో ఆత్మలో కలిసిపోయిన భావం వచ్చినపుడు అలాగే అయిపోతాడు. భావం చాలా గొప్పది. భావంలో అనంతశక్తి ఉన్నది. ప్రహ్లుదుడు స్థంభాన్ని చూపించి భగవంతుడిని సాక్షాత్కరింపజేశాడు. భావాలు లేనిది శరీరాన్ని, మనస్సును పునీతం చేసేది, ఏ భావమెనా అదే ఆత్మానందం. ఆత్మానందమే మానవునికి కావలసింది.

ఆరోగ్యం, మంచి శారీరక సౌశీల్యం, క్రమశిక్షణ అన్ని ఉన్న మనిషికి వ్యతిరేక పరిస్థితులను ఎదుర్కోటమే గొప్ప విజయం. పిరికివాడుగా మారినపుడు ఓటమే. సమాజ శ్రేయస్సు, కుటంబ శ్రేయస్సు ఇలాంటివి వారిపై ఉంటాయి. అలాగే భాదలు, దు:ఖాలు వచ్చినప్పుడు స్థిరంగా నిశ్చలంగా ప్రశాంతంగా కూర్చోవటం అసంభవం. అందుకే ఆత్మవిశ్వాసం చాలా గొప్పది. నమ్మకుండా ఉన్న ప్రతి మనిషి బలహీనుడే. విశ్వాసము భగవంతుడే. సమాజానికి దేశానికి ఉపయోగపడే వారు సాధారణ మనిషికాడు. అలాగే మానసికంగా కృంగిపోయేవారికి తన తెలివితో ఆ మనస్సుతో యుద్ధం చేసి గేలవటం చాలా మంచి అవకాశం. నా మనస్సు బాగా లేదు అనేవాళ్ళు చాలా అదృష్టవంతులు. జీవితం వడ్డించిన విస్తరిలా ఉంటే మనస్సు, బుద్ధి, ఆత్మ పరమాత్మ ఇవన్ని ఎలా తెలియాలి. అందుకు అంతర్యుద్ధం అదృష్టవంతుడికే. అలాగే వీరుడు అంటే దొంగల దోపిడి చేయటం కాదు. అందరిని హింసించి బీదవారిని, దేశ సంస్కృతిని దుర్మార్గుల నుండి రక్షించటానికి ఉత్సాహపడే వారే వీరులు.

ఏకాగ్రత లేనప్పుడు మనస్సు ఎన్నో విధాల పోతుంది. ఒక లక్ష్యం పెట్టుకొని పని చేస్తే తప్పక ఏకాగ్రత వస్తుంది. ఫలితం బాగుంటుంది. ఈ ఆశయం, ఈ లక్ష్యం, దేశ కాల పరిస్థితులు, ప్రాంతాలు కూడా దృష్టిలో పెట్టుకోవాలి. లక్ష్యాన్ని, నిర్ణయాన్ని తీసుకున్న తరువాత ఇతరులు ఎన్ని చెప్పినా మారకూడదు. మారితే ఆత్మవిశ్వాసం పోతుంది చివరికి ఏదీ సాధించలేం. స్థిర సంకల్పంతోనే విజయం, ఆత్మవిశ్వాసం వరిస్తుంది. సాధారణ మానవుడు అహంకారం, విరుద్ధమైన కోరికలతో పదునులేని మనసుతో ఉంటాడు. విరుద్ధ సంఘర్షణకు లోనయ్యే ఈ మనస్సు, సెల్ఫ్‌థాట్స్, ఈ స్థితి మానవశక్తిని పాడుచేస్తుంది. మన వేదాలను, మత గ్రంధాలను ఎవరికనుకూలంగా వారు అర్థం చేసుకుని వాదించి, కర్మఫలమే ఉత్తమజన్మ అని అన్నారు. భోగాలు, కోరికలు జీవితం అనుకునే సాధారణ మానవునికి తను ఆత్మ అనే అద్భుతశక్తితో ఉన్నాననే స్పృహ కూడా ఉండదు. కర్మ అనే వంతెన మీద నుండి ఎన్ని జన్మలైనా ఎత్తి ఆత్మలో కలిసిపోయేదే ఈ జీవుడు. యజ్ఞయాగాదుల కంటే నిష్కల్మషకర్మ శ్రేష్ఠమైనదని శ్రీ కృష్ణుడు చెబుతున్నాడు. దీనిసారం జీవితం ఒక పూజతోనో, భక్తితోనో, ధ్యానంతోనో కర్మల నుండి లేచి త్వరగా రాని మోక్షం నిష్కల్మష సాధ్యమవుతుంది. సృష్టి అంతా మార్పు. క్షణం-క్షణం మారుతూ ఉంటుంది. ఇది తెలుసుకోవటం సులభంగా అనిపించినా చాలా కష్టసాధ్యమైంది. మతం నేర్పేది విప్లవం కాదు, కానీ ఓడిపోవటం అంగీకరించకూడదు. ధర్మం న్యాయం, విశాల హృదయం, అహింస, క్షమ కలిగిన వ్యక్తులు జీవితంలో తారసపడే పరిస్థితులను సహృదయంతోను, సంపూర్ణ మనసుతోను ఆహ్వానించాలి. చైతన్యం శాశ్వతమైనది. మనస్సు ఆలోచనలు తాత్కాలికమే. ఈ సృష్టిలో ప్రతీదీ పోయేదే నిత్యమైనది, సత్యమైనది ఏదో ఉన్నది లేకపోతే ఇన్ని రకాల మనస్తత్వాలు, ఇన్నిరకాల వస్తువులు ఇన్ని రకాల జీవులు ఉన్నాయంటే నిశ్శబ్దంగా స్థిరంగా ఉన్నవాడు ఉన్నాడు. ఏది జరిగినా అది ఆ శక్తి ఆధారం లేకుండా జరుగదు. ఎండ వాన చలి తేడాలు ఎలా ఉన్నాయో

రజస్తమోగుణాలు కూడా సుఖదుఃఖాలను కలుగజేస్తాయి. ద్వంద్వం పోయినపుడు అంతా సుఖమే. స్థిరంగా ఉండటం మానసికమైన పని. కర్మలయితే ఎలాగైనా చేయగలం కానీ ఎప్పుడూ ప్రపంచం చుట్టే మనస్సును ఏకాగ్ర పరచటం చాలా కష్టం. సముద్రం దగ్గర ఒక దోసెడు నీళ్ళకు ఎంత విలువ ఉందో అంతే విలువ కర్మకాండల వలన ఆత్మజ్ఞానికి అంతే ఉపయోగం ఉంది. ఒక నామమైనా చాలు, ఒక లక్ష్యం చాలు, అనేక త్రోవలు ఒక ఊరే చేరుతాయి.

ముగింపు :

చలసాని వసుమతిగారు సమాజంలోని మనుషుల మనస్తత్వాలను నిరంతరం అర్థంచేసుకుంటూ, తన ఎనభై సంవత్సరాల అనుభవంతో ఎన్నో మనస్తత్వాలను ఆకళింపుచేసుకొని తమ రచనల ద్వారా వారు ప్రజలు ఏ సందర్భములో ఎప్పుడు ఏవిధంగా ప్రవర్తిస్తారో మనకు తెలియజేశారు. మనిషికి తన జీవితంలో చక్కని మనసుండాలని అది ఎప్పుడూ "అప్పుడే తీసని వెన్నవలె" ఉండాలని ఈ మనస్సు వ్యాసం ద్వారా తేటతెల్లం జేశారు.

ఉపయుక్త గ్రంథాలు :

1. వసుమతీ చలసాని, వసుమతీ వర్ణమాలిక కవితా, వ్యాససంపుటి. పుట:416
2. వసుమతీ చలసాని, వసుమతీ వర్ణమాలిక కవితా, వ్యాససంపుటి. పుట: 417

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 2 (2), February - 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

ఎరుకల సమాజంలో సంస్కృతి

– ఎన్. రాజేష్ కుమార్ రెడ్డి, పరిశోధక విద్యార్థి, జానపద గిరిజన అధ్యయన శాఖ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

భారతీయ సంస్కృతిలో ఆచారం మాటకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. ఆచారం అంటే నడత, మర్యాద, అలవాటు, ధర్మం, అభ్యాసం, సాంప్రదాయం వంటి అర్థాలు కూడా నిర్వచిస్తున్నాయి.

భారతదేశంలో ఆచారాలు ముఖ్యంగా జీవరాసుల వంటివి. ఇవి తరతరాలనుండి భారతదేశంలో కొనసాగుతున్న ఈ విధమైన ఆచారాలకు మనిషి జీవితంలో అత్యంత ప్రాధాన్యత వుంది. కాబట్టి ప్రస్తుత పరిస్థితులలో వీరి జీవన పరిస్థితులు ఈ ఆచారాలమీద ఆధారపడి వుంటారు. వీరి ఆచార వ్యవహారాలు సగటు సమాజానికి సమానంగా ఉన్నప్పటికి మరికొన్ని పూర్తిగా విరుద్ధంగా ప్రదర్శిస్తారు.

ప్రధానంగా పురాణాల పునాదుల నుండి ఉద్భవించిన ఈ ఆచార వ్యవహారాలు అనేవి కుల, మత, వర్ణ, జాతి ప్రాతిపదికన చూస్తే స్పష్టమైన వైవిధ్యాన్ని కనబరుస్తాయి. ఆచార వ్యవహారాల ఆధారంగా ఆయా వర్ణాలను అంచా వేయవచ్చుకూడా. ఈ విధంగా చూస్తే ఎరుకల ఆచార వ్యవహారాలు ఏ విధంగా ఉంటాయో పరిశీలన చేయ వలసి వుంది.

ఎరుకలవారి ఆచార వ్యవహారాల గురించి ఈ అధ్యాయంలో చర్చిద్దాం. ఎరుకల ఆచార వ్యవహారాల్ని ఈ క్రింది విధంగా విశ్లేషించవచ్చు. ఈ అధ్యాయం వలన వారి యొక్క సామాజిక జీవన సరళి బహిర్గతమవుతుంది.

మతం :

ఎరుకల వారి మతం, గోత్రం గురించి చర్చించే టప్పుడు ఎక్కువమంది ఎరుకల జాతి వారు హిందూ మతానికి చెందినవారు వారియొక్క ఆచార వ్యవహారాలలో హిందూమత సాంప్రదాయాన్ని ఎక్కువగా అనుసరిస్తారు. ఎరుకల గద్దె (సోది) చెప్పినప్పుడు వారు హిందూ దేవతలను కొలుస్తారు. వీరు కుటుంబంలో హిందూ మత పేర్లను పిల్లలకు పెడతారు. వీరు ఎక్కువగా హిందూ మత పండుగలు అంటే ఉగాది, శ్రీరామనవమి, నాగుల చవితి, దసరా, ఏరువాక పున్నమి, కృష్ణాష్టమి మొదలైన పండుగలు అన్నింటిని చేసుకుంటుంటారు. వీరిలో సెటిలెమెంట్స్‌లో స్థిరపడిన ఎరుకల తెగలలో క్రైస్తవ మతాన్ని స్వీకరించినవాళ్ళు కూడా వున్నారు. కొందరు నాగూరు మీరా సాయిబుని కొలవటం, పిల్లలకు ముస్లిం సంప్రదాయానికి సంబంధించిన పేర్లు పెట్టడం కూడా ఉంది.

గోత్రం :

ఎరుకల జాతిలో అనేక గోత్రాలు వున్నాయి. వీటిలో ముఖ్యమైనవి సాత్పడి, మానుపడి, కావడి, మేగ్రగత్తి మొదలైనవి. వీరికి సంబంధించిన గోత్రమంటూ ఒకటి లేదు. గోత్రం అనేది ఆ జాతిలో పేరెన్నికగన్న వ్యక్తి పేరులో ఏర్పడి ఉన్నట్లయితే వీరిది 'ఏకలవ్య' గోత్రమని చెప్పవచ్చు.

పండుగలు :

ఎరుకల జాతి వారు దాదాపు హిందూ మరియు క్రైస్తవ పండుగల్ని భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారు.

దేవతలు :

ఎరుకల జాతి వారు 'అగ్నిదేవుడి'ని వీరి ఆరాధ్య దైవంగా నమ్ముతారు. వీరు దొంగతనాలకి వెళ్ళినప్పుడు అగ్నికి నమస్కరించి వెళ్తారని ప్రతీతి. ఎరుకల వారు బైటంకమ్మ, కొండదేవర, కొర్లాపురమ్మ వీరి కులదేవతలు. ఈ క్రమంలో వారి యొక్క ఆదిశక్తి రూపాలైన గ్రామ దేవతలను వీళ్లు కొలుస్తారు. మరియు వీరు కొలుపులు కొలుస్తారు, జాతరలు జరుపుతారు. ఎరుకలేశ్వర దేవర, ఎరుకమ్మ దేవతల్ని పూజిస్తారు. తాము కొలిచే దేవతల

పేర్లనే తమ బిడ్డలకు పుట్టిన తొమ్మిదో రోజు పెట్టుకొని ఆనందిస్తారు.

ఎరుకల వారి ఆచార వ్యవహారాలు :

ఎరుకలవారి ఆచార వ్యవహారాలను పరిశీలిస్తే వారి జీవన విధానంలోని కట్టుబాట్లు మనకు స్పష్టమౌతాయి. ఈ ఆచార వ్యవహారాలను బట్టి వారి సంస్కృతిని నేను నా పరిశోధనలో అర్థం చేసుకున్నాను.

మనదేశంలో భారతీయ సంస్కృతికి ప్రత్యేకమైన స్థానం ఉంది. దానిలో అతిముఖ్యమైనది ఆచారం. ఈ ఆచారం మాటకు భారతీయ నిఘంటును పరిశీలిస్తే ఆచరింప బడేది ఆచారం అని ఉన్నది. ఈ క్రమంలో ఆచారానికి అనేక అర్థాలు ఉన్నాయి. అవి - నడత, మర్యాద, సంప్రదాయం, అలవాటు, అభ్యాసం, ధర్మం వంటివి కూడా ఆచారం క్రిందికి వస్తాయి. ఎరుకల వారి ఆచార వ్యవహారాలను మరియు వారియొక్క జీవితాలలో కొన్ని ముఖ్యమైన విషయాలను తెలుసుకోవాలంటే పరిశీలన చేయాల్సిందే.

పెళ్ళివేడుక :

ఎరుకల జాతిలో పెళ్ళివేడుక గురించి చర్చించే ముందు భారతదేశంలో సంస్కృతి సాంప్రదాయాలకు ప్రాధాన్యం ఇస్తుంది. ఋగ్వేదం నుంచి ఏర్పడిన వివాహ వ్యవస్థ అనేది హిందూ ధర్మశాస్త్రం ప్రకారం ఒక కర్మ! ఇది సంప్రదాయాలతో ముడిపడిన ఒక సంస్కారం! మనిషి యవ్వనదశలో మరో మనిషి తన జీవితంలోకి ఆహ్వానించటం దీని పరిణామమే పరిణయం. అలాగే వధువుని వరుడు తన వెంట తీసుకు వెళ్ళే 'ఉద్వాహం' (ఉద్వాహం అంటే వధువును ఆమె పుట్టింటి నుంచి తీసుకొని వెళ్ళడం) అనే ప్రక్రియ వివాహంగా మారింది.

పెళ్ళిసంబంధం :

గ్రామీణ, పట్టణ ప్రాంతంలో ఎరుకల వారు ఇంకా పాత పద్ధతినే అనుసరిస్తున్నారు. ఎరుకల వారి అమ్మాయి పుష్పావతి కాగానే 'ప్రాయస్తురాలు' అయ్యిందని భావిస్తూ ఆ అమ్మాయికి పెళ్ళి సంబంధం వెతకడం మొదలు పెడతారు. ప్రస్తుత కాలంలో చాలామంది ఎరుకల వారి అమ్మాయిలకు ఉన్నతమైన విద్యావంతులను చేయాలని ఆలోచిస్తున్నారు. ఎరుకలవారి పెళ్ళి సంబంధాల సమయంలో వారియొక్క గోత్రాలకు ప్రముఖ పాత్ర వహిస్తాయి. ఎరుకల వారిలో రెండు రకాలు ఉంటారు. అవి 'సాతుపాటి', 'కావాడి' అనే గోత్రాలు ఉన్నాయి. ఈ రెండు గోత్రాలవారు ఒకరిని మరొకరు పెళ్ళిళ్ళు చేసు కుంటారు. ఇంటిపేరు గోత్రం, ఒక్కటే అయినప్పుడు 'అన్నా చెల్లెళ్ళు' వరున అవుతుంది. కనుక పెళ్ళి సంబంధాల విషయంలో ఆలోచన చేస్తారు.

మేనరిక సంబంధం :

ఎరుకల సాంప్రదాయ వ్యవహారాలలో వీళ్ళు ఎక్కువగా మేనరిక సంబంధాన్ని ఇష్టపడతారు. ఈ మేనరిక సంబంధంవల్ల శారీరక, మానసిక ఇబ్బందులు వస్తాయి. అని తెలిసిన కూడా వీరు మేనరిక సంబంధానికే ప్రాధాన్యత ఇస్తారు. ఇలాంటి పెళ్ళిళ్ళ విషయంలో కట్నకానుకులకు మాకు మినహాయింపు ఉండదు.

మేనరికపు కట్నం :

వరుడు, పిల్ల మేనమామకు తన యొక్క ఆర్థిక స్థోమత బట్టి 51, 101, 116, 216, 516 రూపాయలు, కొబ్బరి, ఆకులు, వక్కలు, పూలు, పండ్లు పూజసామాగ్రితో అందిస్తారు. వాటిని మేనమామ బంధుమిత్రులందరికి చూపించి "ఈ పెళ్ళి నాకు ఇష్టమే" ఈ పెళ్ళి జరగడంలో నాకు ఎటువంటి అభ్యంతరం లేదు అని తెలియజేస్తాడు.

ఓలి సంప్రదాయం :

ఓలి అంటే 'అమ్మాయికి ఎదురు కట్నం ఇవ్వడం' అని అర్థం. ఆడపిల్ల కలిగిన ఎరుకల వారు చాలామంది తల్లిదండ్రులు ఓలి కోసం చూస్తూ వారి యొక్క ప్రయత్నాలు చేస్తువుంటారు. ఎరుకల వారి పెళ్ళి సంబంధం విషయంలో మధ్యవర్తిత్వానికి చాలా ప్రాధాన్యత ఉంటుంది. కాబట్టి వీరు ఓలి, కట్నం వంటి విషయంలో పూర్తి సమాచారం ముందే తెలుసుకొని ఆ

తర్వాత తమ ఇష్టాయిష్టాల్ని ప్రకటించమని అడగటానికి ముందుకువస్తారు. కాదంటే ఏదో ఒకటి చెప్పి తప్పించు కుంటారు.

మగపెళ్ళివాళ్ళు అమ్మాయి తల్లిదండ్రులకు ఓలి ఇచ్చుకోవాలి. సంసారాన్ని దొడ్డి అంటారు. ఓలి యిచ్చి వెళ్ళి చేసుకుంటే పుట్టే సంతానం చేసుకున్నవాడికి చెందుతుంది. ఓలి ఇవ్వక పోతే దొడ్డి, వధువు తల్లిదండ్రులదవుతుంది.

పెళ్ళిచూపులు :

ఎరుకల వారిలో పెళ్ళిచూపులు అనేవి ఒక పవిత్ర కార్యం. కాబట్టి వీరు తమ ఇళ్ళలో ఇలాంటి కార్యక్రమా లకు తప్పనిసరిగా ముత్తయిదువుల సహకారం తీసు కుంటారు. ముత్తయిదువులు పెద్దమనుషులు అందరూ కలిసి ఏదేని ఒక బేసి సంఖ్య క్రమంలో బయలు దేరుతారు. బయలుదేరే సమయం, గడియ, దినము, వారము, నక్షత్రం మొదలైనవి నమ్ముకొని కొనసాగు తుంటారు. పెళ్ళిచూపుల సమయంలో ప్రత్యక్షంగా ఎదుట వారి ఆర్థిక పరిస్థితి అంచనా వేసుకుంటారు. వరుడు ఇంటిని అంచనా వేసినప్పుడు ఎక్కువ పందులు, వేటాడే పనిముట్లు ఉండే పెళ్ళికూతురు జీవితం సుఖమయ మవుతుందని భావించి ఆ ఇంటికి వధువుని పంపించ డానికి ఇష్టపడతారు.

ప్రేమ వివాహం :

ఎరుకల వారిలో ప్రేమ వివాహం అనేది ఒకప్పుడు కులాచారం ప్రకారం తప్పచేయడం లాంటిది. అందుకే ఎరుకలవారిలో ప్రేమ వివాహాలు చాలా తక్కువ. కాబట్టి వీళ్ళల్లో ఇలాంటి వివాహాలకు ధైర్యం చేసేవాళ్ళు ఎక్కువగా కనబడేవారు కాదు. అయితే ప్రస్తుత పరిస్థితు లలో మార్పు రావడం వలన వీళ్ళల్లోనూ ప్రేమ వివాహాలు అక్కడక్కడా జరుగుతున్నాయి.

ఇల్లరికపు సంబంధాలు :

ఎరుకల వారి జీవన విధానంలో ఇల్లరికపు సంబం ధాలకు ప్రాధాన్యం ఉంటుంది. పూర్వం నుండి ఇప్పటివరకు ఇలాంటి పెళ్ళిళ్ళు వీళ్ళలో విరివిగా జరుగుతున్నాయి. ఒక తండ్రికి అందరూ ఆడపిల్లలు అయితే వీళ్ళలో ఒక కూతురికి భర్తను ఇల్లరికం చేసు కుంటుంటారు. మరొక విధంగా ఆ కుటుంబంలో ఒకరి కూతురు అయినా కూడా ఇల్లరికం అల్లుడుని తెచ్చు కుంటుంటారు. మొత్తం కుటుంబ బాధ్యతలను ఇల్లరికం అల్లుడికి అప్పగిస్తారు. ఆ అల్లుడుకి గౌరవం, మర్యాదలు తగ్గకుండా చూసుకుంటుంటారు.

రూకమాడ :

రూకమాడ అంటే నిశ్చియ తాంబూలాలు, ఎంగేజ్ మెంట్ అని అర్థం వస్తుంది. ఎరుకల వాళ్ళల్లో రూకమాడ తతంగం ఒక ప్రత్యేకంగా జరుపుకుంటారు. పెళ్ళి సంబంధం ఇరువురికి నచ్చినట్లయితే 'రూకమాడ' గురించి ఆలోచిస్తారు. అలాంటి సందర్భంలో పూలు పండ్లు పెట్టుకుంటారు. ఎరుకలవారు రూకమాడ జరిగింది అంటే సగం పెళ్ళి జరిగినట్లు భావిస్తారు. ఒక వేళ మగ పెళ్ళివారి ఇంటిలో ప్రమాదవశాత్తు అశుభం జరిగితే (అంటే ఎవరైనా మరణిస్తే) ఇక్కడ వధువుకు 'మహిల' అని పాటిస్తారు. మహిల అంటే 'మైల' అని కూడా అంటారు. ఈ మైల వున్న వాళ్ళు పాటించే అన్ని ఆచారాల్ని ఇక్కడ అమ్మాయి కూడా విధిగా పాటిస్తూవుంటుంది.

'రూక' అంటే పావుభాగం అని, 'మాడ' అంటే రెండున్నర భాగం అని అర్థం. పూర్వకాల్‌లో ఒక పెళ్ళి జరగాలంటే వారియొక్క రూకమాడంత ఆర్థికస్థితి వుంటేనే అంతా సజావుగా సాగిపోయేది. నేను గమనించింది ఇక్కడ ఆర్థిక పరిస్థితి అంటే పెళ్ళికొడుకుకు సంబంధిం చినది. మగ పెళ్ళివారు ఆర్థికంగా బలంగా వుంటేనే ఆడ పెళ్ళివారు రూకమాడేందుకు ఇష్టపడతారు.

ఎరుకలవారు ముఖ్యంగా రూకమాడ తతంగం బంధుమిత్రుల సమక్షంలో సాయంకాల వేళ ఆడపెళ్ళి వారి ఇంట్లో జరుగుతుంది. ఇందుకోసం మగ పెళ్ళివారు ఆడపెళ్ళివారి ఇంటికి మధ్యాహ్న సమయానికి ఇంటికి

చేరుకుంటారు. కులపెద్దలు కూడా రూకమాడు సమయంలో తప్పనిసరిగా ఉండవలసిందే.

ఎరుకలవారిలో రూకమాడ జరిగేటప్పుడు అందరూ నల్లగొంగడిపై కూర్చుంటారు. ఒకవైపు ఆడపెళ్ళివారు మరొకవైపు మగ పెళ్ళివారు కూర్చుంటారు. వారి ఇద్దరి మధ్యలో కులపెద్దకూర్చుంటారు. అలాగే రూకమాడకు కావలసిన సామాగ్రి అంటే కొత్తబట్టలు, గాజులు, పూలు, పండ్లు, ఆకులు, వక్కలు మొదలైన వివిధ సామాగ్రిని కూడా ఇరువురి తరపువాళ్ళు కులపెద్దలముందు తాంబాలాలు పెట్టి పుచ్చుకుంటారు. అదే సమయంలో కులపెద్దలకు సారాయి అందిస్తారు. ఈ సారాయిని సాపు అంటారు. సాపు అందించడంలో వధువు తరపువాళ్ళు 2 సేరు వరుడు తరపువాళ్ళు 3 సేర్లు కొలతని పాటిస్తారు. ఆడపెళ్ళివారి కంటే మగపెళ్ళివారే అన్నింటిలో ఎక్కువగా కనబడేలా ప్రయత్నం చేస్తారు.

నిశ్చయ తాంబూలాలు :

ఎరుకల వారి నిశ్చయ తాంబూలాలు నేను పరిశీలించినప్పుడు సారా త్రాగాక ఇరువురి తరపున తల్లిదండ్రులు, కులపెద్దల సమక్షంలో బంధుమిత్రుల సాక్షిగా తాంబూలాలు మార్చుకుంటారు. తర్వాత వధూవరులు కొత్త బట్టలు ధరిస్తారు. వీరు పెద్దమనుషులు, బంధు మిత్రులు తల్లిదండ్రుల ఆశీర్వాదాన్ని తీసుకుంటారు.

పందిరి వేయడం :

ఎరుకల వారు పెళ్ళి సంబంధం కుదిరిన తరువాత వారు పెళ్లికి ఒకటి, రెండు రోజులు నుంచి ముహూర్తం చూసుకొని ఇంటి ముందు పందిరి వేస్తారు. వీరు పందిరి కోసం కానుగ, మర్రిచెట్టు కొమ్మల్ని ఉపయోగిస్తారు. ఈ కొమ్మలు తీసుకొని రావడానికి ప్రస్తుతం వాడే వాహనం ట్రాక్టర్లు. పూర్వకాలంలో ఎద్దులబండ్లు ఉపయోగించే వారు. పందిరివేసేవాళ్ళు. పందిరి కొమ్మలు తెచ్చి వాళ్ళు ప్రత్యేకంగా తలపాగాలు కట్టుకోవడం, కుంకుమ బొట్లు పెట్టుకోవడం ఒక ఆచారంగా దాన్ని సాగిస్తారు. వీరు పందిరికి కావలసినన్ని అమృత ఘడియలకు అంటే తెలవారు జామున వెళ్ళి మధ్యాహ్నంలోపు పందిరి ముగిస్తారు. పందిరి వేసేటప్పుడు భాజాభజంత్రీలు మోగిస్తారు. అలా ముగించిన పందిరి చుట్టూ మామిడి తోరణాలు కడతారు. తరువాత ఇంటికి వచ్చేదారిలో రెండు గుంజల్ని ప్రత్యేకంగా ద్వారంలా ఏర్పాటు చేసి మామిడి తోరణాలు కడతారు. ఆ గుంజలను అరటి లేదా కొబ్బరి కొమ్మలతో అలంకరిస్తారు. ఇది పెళ్ళి ఇంటికి వచ్చేందుకు ఒక ప్రత్యేకమైన పవిత్రమైన ప్రవేశద్వారం.

పుట్టమన్ను :

పుట్టమన్ను అనేది ఎరుకలవారి ఆచారంలో ప్రధానమైనది. పందిరి వేయడం పూర్తి అయిన తరువాత జరిగే వేడుక 'పుట్టమన్ను' ఆచారం. పుట్టమన్ను తీసుకొని రావడానికి సాయం సంధ్యా సమయంలో బయలు దేరుతారు. వీరు పుట్టమన్నుకు బయలుదేరేటప్పుడు భజంత్రీలు తప్పనిసరిగా ఉంటాయి. ఈ భజంత్రీల్లో మంగళ వాయిద్యాలు, బ్యాండ్‌మేళాలు అనే రెండురకాల వాయిద్యాలు ఉంటాయి. ఎరుకల వారు దాదాపు బ్యాండుమేళానికి ప్రాధాన్యత ఇస్తారు. పుట్టమన్ను కోసం వెళ్ళేవాళ్ళలో వధువు, వరుడు మేనమామలు ఇద్దరూ వెళతారు. ఒక వేళ మేనమామ కాకపోతే మేనమామ వరుస అయ్యేవాళ్ళు వెళ్ళడం తప్పనిసరిగా జరుగుతుంది. చేతిని చేతిలో ఉండే గడ్డపారకు కంకణాలు కట్టడం చేస్తారు. ఈ పుట్టమన్ను తీసుకువచ్చేటప్పుడు పసుపు, కుంకుమ, గంధం వంటి ప్రత్యేకపాత్ర పోషిస్తారు. స్త్రీలయితే ఎర్రని కుంకుమని ధరిస్తారు.

పుట్టమన్ను తీసేటప్పుడు అనవాయితీగా చిన్నపాటి పూజ తరువాత మేనమామ పుట్టమన్నును గడ్డపారతో జాగ్రత్తగా తీస్తారు. అలా తీసినందుకు మేనమామ కట్నంలో కొన్ని బియ్యం, కొబ్బరికాయలు, కొంత డబ్బు ఇవ్వడం జరుగుతుంది. ఇది వాళ్ళ ఆచారం. ఇలా తీసుకొచ్చిన పుట్టమన్ను పందిరి గుంజలు, ఒక్కోదాని దగ్గర ఒక్కో చిన్నపాటి అరుగులు ఏర్పాటు చేస్తారు. అరుగుల్ని పేడతో అలుకుతారు.

పెళ్ళికూతుర్ని / పెళ్ళికొడుకుని చేయడం :

ఎరుకల వారి ఆచార సంప్రదాయాలను గమనించి నట్లయితే పెళ్ళికూతుర్ని/కొడుకుని చేసే కార్యక్రమం సాయంత్రంపూట కొనసాగుతుంది. ఇందులో ముఖ్యంగా పందిరిని పేడతో శుభ్రం చేస్తారు. తరువాత ఒక రథం ముగ్గువేస్తారు. ఈ ముగ్గు వేయడం వెనుక గొప్ప పరమార్థమే వుంది. రథం అనేది సూర్యునికి సంకేతం, సూర్యుడు లోకబాంధవుడు, సూర్యదేవుడు ప్రకాశమే లేకపోతే ఈ ప్రపంచమే లేదు. ముఖ్యఁగా 'ఏడుగుర్రాల దొర"గా చెప్పబడే సూర్యుడి వల్లనే పాడి పంటలు సమృద్ధిగా పండి ప్రపంచమే ఒక పచ్చతోరణమై వర్ధిల్లు తుంది. కాబట్టి, పెళ్ళాడే జంట కలకాలం పచ్చగా ఉం డాలని వారి జీవితాలు సుఖసంతోషాలతో అనే వెలుగు నిత్యం ప్రసరించాలని సూర్యసంకేతాల్ని వివాహం సందర్భంలో ముగ్గులుగా వేసుకోవడం జరుగుతుంది. ఈ ముగ్గుపై రెండు చెక్కపీటల్ని వేస్తారు. ఒక పీటపై వధువు వరుడు ఎదురెదురుగా ఇంటి దగ్గరవారు కూర్చోగా మరో పీటపై వరసయ్యేవాళ్ళని కూర్చోబెడతారు. వధువు/వరుడుకి బేసి సంఖ్యలో ముత్తైదువులు పసుపు, కుంకుమ, అక్షింతలతో ఆశీర్వదిస్తారు. ఆ తరువాత నలుగు, స్నానం చేయిస్తారు. తరువాత వారికి కొత్త బట్టలు కట్టించి వారిని తల్లిదండ్రులు మరియు బంధువులు ఆశీర్వదిస్తారు.

నలుగుస్నానం :

మనదేశంలో ఉన్న సాంప్రదాయాన్ని పరిశీలిస్తే వధూ వరులు ఇద్దరికి ముత్తైదువులు పసుపు పూస్తారు, మరియు కుంకుమబొట్లు విధిగా పెడతారు. ఈ సంప్రదాయానికి బేసి సంఖ్యలో ముత్తైదువులను పిలుస్తారు. ఈ వధూవరులకి నలుగు స్నానానికి ఇద్దర్ని కంకణాలు కట్టి వున్న రెండు రోకళ్ళమీద చెరోవైపు కూర్చోబెట్టి స్నానం చేయిస్తారు. ఈ స్నానం పూర్తి అయిన తరువాత వధూవరులను ఒక చోట నిలబెట్టి ఒక పిల్లవాడిని వారికి అప్పగిస్తారు. ఈ పిల్లవాడిని ఒకరికి ఒకరు మూడు సార్లు మార్చుకోవాలి. ఇలా చేయడం వలన వాళ్ళకి కూడా ఇలాంటి ముద్దులబాలుడు జన్మించాలనేది వారి ఉద్దేశ్యం మరియు నమ్మకం.

దిష్టి తీయడం :

ఎరుకల వారి నమ్మకాలలో దిష్టితీయడం ఒక సంప్రదాయంగా వస్తుంది. వధూవరులు ఇద్దరూ మూడు అడుగులు ముందుకు వేస్తారు. అలాగే మూడు రకాల రంగులు వేసిన అన్నంముద్దలు దిష్టి తీయడానికి ఉ పయోగిస్తారు. ఆ మూడు రంగులు గమనిస్తే ఎరుపు రంగు దీనికి కుంకుమతో తయారు చేస్తారు. పసుపు రంగు దీనిని పసుపుతో తయారుచేస్తారు. నలుపు రంగు దీనిని కుండప్రాయి క్రింద ఉన్న మసితో తయారుచేసి వారి దిష్టి తీయడం జరుగుతుంది.

పుస్తె, మెట్టెల సంప్రదాయం :

భారతీయ సంస్కృతిలో పుస్తె మెట్టెలకు చాలా ప్రాధాన్యం ఉంది. హైందవ సాంప్రదాయంలో వీటి విలువ అతి పవిత్రం మరియు దైవ సమానం. సూత్రాలు, మంగళ సూత్రాలు, తాళిబొట్టు, పుస్తెలు... అనే పేర్లతో పిలుస్తారు. స్త్రీని సౌభాగ్యవతిగా సూచించే ఈ సూత్రాలు స్త్రీ స్థానాన్ని నిర్దేశించడంలోను ప్రముఖ పాత్ర వహిస్తుంది. నా పరిశోధనలో భాగంగా నేను అధ్యయనం చేసినది అస్సలు చెప్పాలంటే ఎరుకల వారు ఒకప్పుడు తాళి సంప్రదాయం కనబడేది కాదు. కేవలం నల్లపూసల్ని మాత్రమే వరుడు వధువు మెడలో కులపెద్దల సమక్షంలో కట్టేవాడు. ఈ నల్లపూసల్ని 'నల్లలు' అంటారు. సమాజంలో మార్పులు నేను గమనించినంత వరకు నేటికి ఈ సాంప్ర దాయానికి ఎంతో ప్రాధాన్యత ఉంది. బంగారం పుస్తెల తాడు వేసుకున్నప్పటికి తాళిబొట్టుకు ఇరువైపుల కొన్ని నల్లల్ని గుచ్చుకుంటారు.

మాంగల్య ధారణ :

ఎరుకల వారు మాంగల్యధారణకు ప్రాధాన్యం ఇస్తారు. సాప్రదాయిక హిందూ వివాహంలో తాళి ప్రాధాన్యత గురించి వేరే చెప్పనక్కర్లేదు తాళి కట్టడం,

కట్టించుకోవడం, అంతా ఒక ఉద్విగ్నభరితం. ముఖ్యంగా తాళి ముహూర్త సమయాన్ని వీరు ఖచ్చితంగా పాటిస్తారు. ఎరుకల వారు పెళ్ళి జరగవలసిన ప్రదేశాన్ని ప్రత్యేక ఆచారాలతో సిద్ధంచేస్తారు. వధూవరులతో పాటుగా అందరూ కొత్తబట్టలు ధరిస్తారు. అల్లుడికి కాళ్ళుకడగటం, పురోహితుడి వేద మంత్రాలు, జీలకర్ర, బెల్లం, ఇవన్నీ యథావిధిగా కొనసాగుతాయి. కాగా పూర్వకాలంలో ఎరుకల జాతిమొత్తంగా కేవలం కులపెద్దల సమక్షంలోనే పెళ్ళిళ్ళు చేసుకునేవారు. ప్రస్తుత కాలంలో మార్పులు రావడం వలన చాలావరకు ఎరుకవారు బ్రాహ్మణ పురోహితుణ్ణి ఆశ్రయిస్తున్నప్పటికీ ఇంకా చాలా ప్రాంతాల్లో కులపెద్దలు పెళ్ళిపెద్దగా వ్యవహరించడం జరుగుతుంది.

పెళ్ళివిందు :

పెళ్ళిరోజు భోజనంలో తప్పనిసరిగా పందిమాంసం వండుతారు. ఇది జాతి ఆచారం. భోజనంతోపాటుగా సారా, కల్లు తప్పనిసరిగా ఉంటాయి. ఈ ఏర్పాట్లలో తేడాలు వస్తే గొడవలు కూడా జరుగుతుంటాయి. కాబట్టి భోజనాలు, మద్యం, వీటి విషయాల్లో చాలా జాగ్రత్తగా ఉంటారు.

ఒడి బియ్యం :

పెళ్ళి తరువాత పెళ్ళిలో భాగంగా 'ఒడిబియ్యం' సాంప్రదాయం ఉంటుంది. ఒడి బియ్యం కోసం 5 సేర్ల బియ్యం (ఒకసేరు - 1 కిలో), 5 ఎండుకొబ్బరి చిప్పలు, 5, ఖర్జూరాలు, 5 వక్కలు, 5 తమలపాకులు, 5 రూపాయలు, సిద్ధంచేసుకుంటారు. మరియు పూలు, పండ్లు, సిద్ధం చేసుకుంటారు. ఈ క్రమంలో వటిని అన్నింటిని ఒక పెద్ద పాత్ర తీసుకొని పసుపు మరియు నూనెతో 5గురు ముత్తైదువులు కలుపుతారు. తరువాత వాటిని 5 లేదా 9 మంది ముత్తైదువులు ఒక్కొక్కరుగా వచ్చి దోసిళ్ళతో వధువు ఒడి నింపుతారు. 5 రూపాయల్ని వధువు కొంగులో పెట్టి ముడివేస్తారు. ఈ ఒడిబియ్యం సమయంలో వరుడు వధువు పక్కనే కూర్చొని ఉంటాడు.

సారె :

ఎరుకల వారి సారె విధానాన్ని మనం చూసినట్లయితే వీరు ఒడిబియ్యంతోపాటు సారె పంపిస్తారు. లేదంటే ఒక సంవత్సరం తరువాత సారె పెట్టడం జరుగుతుంది. ఈ సారె విధానాన్ని నేను నా పరిశోధనలో ఈతకట్టు ఎరుకల వారిలో ఈ విధానాన్ని గమనించాను.

ఎద్దబోయిసాని :

ఎరుకల తెగలలో భర్త మరణించిన స్త్రీ, ఏడు పెళ్ళిళ్ళ వరకు చేసుకోవచ్చు. ఇలా మనువాడి ఎక్కువమంది పిల్లలను కన్న స్త్రీని "పెద్దబోయసాని" అని పిలుస్తారు. ఈమెను శుభకార్యాల్లో ఆమెను పెద్ద ముత్తయిదువుగా గౌరవిస్తారు. ఈమె ఇచ్చే సుహాకు ఎప్పుడు వారి జాతిలో విలువ వుంటుంది. స్త్రీ స్వేచ్ఛను సామాజిక స్వేచ్ఛగా అంగీకరించడం అనేది ఎక్కువగా గిరిజన తెగల్లోనే కనిపిస్తుంది. మాతృస్వామ్య వ్యవస్థ లక్షణాలు వీరిలో ఎక్కువగా ఉన్నట్లు నా పరిశోధనలో తేలింది.

ఇతర ఆచారాలు :

ఎరుకల ఇతర ఆచారాల్లో ముఖ్యంగా పేర్కొనదగినది కువాడ్ సంప్రదాయం, పాలకూలి మొదలైనవి. ఇవి నేటికీ కొన్ని తెగల్లో జరుగుతూనే వున్నాయి.

ఆధార గ్రంథాలు :

1. ఆంధ్రసర్వస్వము, అధ్యాయం-10
2. అబ్బేడు బోయి 1770-1848 Hindu Manners, Customs and Cermonics
3. థర్‌స్టన్. E.H. Caste and Tribes of South India

4. శ్రీరాములు, జి. మరియు బ్రహ్మానంద, హెచ్.ఎన్. 2010. ఎరుకల భాషా సంస్కృతి, సాహిత్యం, పరిశోధన, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం.

5. శ్రీరామ మాలకొండయ్య. కుర్ర చరిత్ర. 6. సంపత్ కుమార్, ఎం. 1986 ఎం.ఫిల్. డిసర్టేషన్

7. సుబ్రహ్మణ్య శాస్త్రి, పిరాట్ల. 1992. గిరిజన గేయాలు సామాజిక పరిశీలన.

8. Census of India, Vol.I, Part-XI (1) 1961, p.372, Yerukala Dialect.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 2 (2), February - 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

'అముక్తమాల్యద' సౌందర్యం - రాయల భగవతి వర్ణన

- ప్రొ॥. కె.శ్రీదేవి, తెలుగు విభాగం, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

నన్నయ, తిక్కన కవితాశిల్పం ప్రబంధ యుగం నాటికి అంతరించిపోయింది. అంతఃసౌందర్యం కంటే బాహ్మ సౌందర్యారాధన ప్రబలిపోయింది. ఇది శ్రీనాథుని దగ్గర నుండి మన సాహిత్యానికి సంక్రమించింది. అందుచేతనే ప్రబంధ యుగంలో పాడుకోడానికి. వీలైన పద్యం ఉన్నంతగా మననం చేయడానికి లేదు.

సామాన్యంగా ఇది ప్రబంధ శైలి లక్షణం. దీనికి మారుగా కొందరు కవులున్నారు. వారిలో శ్రీ కృష్ణదేవరాయ సార్వభౌములు అగ్రగణ్యులు. భారతీయునికి మతం అనేది జీవన విధానం తప్ప జీవితం కంటే భిన్నమైనది కాదు. దూరంగా ఉండి ఆరాధించేది కాదు. భౌతిక జీవితం అధ్యాత్మిక జీవితం రెంటికీ మతం నిర్వచనం ఏకత్వమే తప్ప భిన్నత్వం కాదు.

పాశ్చత్యుల దృష్ట్యా మతం నిర్వచనం వేరు. భారతీయుని దృష్ట్యా వేరు. దైవమన్నది వస్తుగత సత్యమే తప్ప వాస్తవిక జగత్తునకు దూరాన ఉన్నట్టిది కాదు. ఐహికాముష్మిక జీవితాలకు ముడిగా భారతీయ పౌరాణిక సాహిత్యం నిర్మించబడింది. ఈ రహస్యం శ్రీకృష్ణ దేవ రాయులకు తెలిసినట్లుగా ఆయన కథా ప్రణాళిక స్పష్టం చేస్తున్నది. మతం, రసం జీవితం ఈ మూటి కలయికకు ఆయన ప్రబంధం ఒక ఆదర్శం. గోదాదేవి కథ మత దృష్టి, రసదృష్టి సమన్వితమైన ఒక స్త్రీ కథ. అందు చేత రాయల కవితాశైలిలో ఈ సమస్వయం ప్రధానమైనది. ఇది కథా దృష్టితో చెప్పిన మాట. వర్ణన దృష్యా రాయల భావనా శక్తి కత్తి వాదరవలె (కత్తి అంచు) చాలా సునిశితమైనది.

రాయలవారు గోదాదేవి సౌందర్యాన్ని వర్ణించే వర్ణనలు మనవ స్త్రీని వర్ణించినట్లుగా కాక ఒక దివ్యమైన శక్తిని "భగవతి"ని అంటే భగవంతునికి భార్య కాగలిగిన స్త్రీకుండవలసిన లక్షణాలను గురించి ప్రస్తావించినవి. ఈ విషయాన్ని 'అముక్తమాల్యద' కావ్యంలోని గోదాదేవిని వర్ణించిన ప్రతి పద్యం ఋజువు చేస్తుంది.

గోదాదేవిలో బాల్యావస్థ లుప్తమై దాని స్థానంలో యవ్వనోదయ సౌందర్యం రేఖామాత్రంగా పాటుసరిస్తున్న కౌమార ప్రారంభావస్థను బహిర్గతం చేస్తున్న అంశాలు. శ్రీహరినే తన సౌందర్యముతో గెలుచుకొనుటకు సిద్ధపడిన గోదాదేవికి గల కేశరాశి అనన్యమైనది. ఆమె పాల భాగమున గల కర్పూర తిలకము అక్షరాలవలె ఒప్పు తున్నవి. భగవతి భావనకు సాక్షీభూతంగా రాయలు గోదాదేవి రూపును మన ముందు సాక్షాత్కరింపజేసినాడు శ్రీకృష్ణదేవరాయలు.

చెలికత్తెలు కళ్ళకు కాటుక పెట్టునపుడు ముఖాన్ని పైకెత్తి పైకి చూచినప్పుడు గోదాదేవి ఫాలభాగమనే చదుర్థీ చంద్రుని చూసింది. అలా చూడటంవలన కలిగిన దోషం వలన, ఆమె ముఖ కాంతిని దొంగలించిన చంద్రునికి ఏ అపవాదు కలుగ లేదు. కాని ఈమెకు మాత్రము చంద్రుని కాంతిని దొంగిలించిందనే అపవాదు వచ్చిందని కవి చమత్కరించాడు. అన్ని సుందరవస్తువుల కంటే ఆమె ముఖమే అందమైనది కనుక చంద్రునితో పోల్చడం రాయలవారికి గూడా తప్పనిసరి అయిందని గడుసుగా నీలాపనిందతో చమత్కరించాడు. కవి ప్రతిభను అను భూతం చేసే ఘట్టాలు ఇలాంటివే.

గోదాదేవి కన్నులు లేడికన్నులను మించిన అందంతో మిడిసి పడుతున్నాయి. దానితో ఆ లేడి అమెపై పగబట్టి చంద్రుని దగ్గర కెళ్ళి చంద్రుని రెచ్చగొట్టగా, చంద్రుడు ఆమె ముఖ కాంతి నాకున్నది. కాని అందుండి వెలువడు సువాసన నా దగ్గర లేదు కదా అని తప్పించుకొన్నాడు. ఎలాగైనా పగ సాధింపబూనిన ఆ లేడి చంద్రునికి పరి

మళత్వం అబ్బుటకై అతని యందు ప్రవేశించినది. దానితో గోదాదేవి నీవు నాపై పగబడతావా అని ఆగ్రహించి కస్తూరి మృగమును చంపి ఆ రక్తముతో బొట్టు పెట్టుకున్నది అని రాయల వారి వర్ణన.

ఆమె ముఖమున కబ్బిన వెలుగూ, వాసనా గోదాదేవికి సహజాతములే గాని అలంకారముల వలన అబ్బినవి కావని రాయలవారి భావన, పరిమళములే సహజసిద్ధంగా అమెయందున్నచో అమె ప్రత్యేకముగా వచ్చి కస్తూరినే ఎందుకు ధరించవలెననే సందేహం పఠితలకు కలుగుతుంది కదా. అందుకే కేవలం తనపై పగబట్టిన ఆ కస్తూరి మృగముపై పగను సాధించుకొనుటకే, ఆమె కస్తూరిని, ధరించింది కాని తనలో సౌందర్యాంశ కొఱవడి కాదనేది కవి భావన.

యవ్వనమనెడి మధువును తాగి గోదాదేవి కన్నులు కైపెక్కి ఉన్నవి. కర్ణముల వరకు వ్యాపించిన అమె నేత్రములు మత్తులో శ్రవణములనెడి గోతిలో పడకుండా బందించి ఉంచడానికి కాటుక రేఖలనెడి సంకెళ్ళు వేసినట్లుగా ఆమె కంటికి తీర్చిన కజ్జలము ఒప్పుచున్నదని రాయలవారు వర్ణించారు. ప్రతికవి మోహనాంగి కన్నుల వర్ణించు సందర్భంలో ఆమె కన్నులు పద్మములను పోలినవని లేదా లేడికన్నుల వలెనున్నవని వర్ణించిన వారే, కాని నూతనమైన భావ చిత్రాలను సృష్టించలేదు.

ఆమె పెద్ద కనుగవలు ఎలా ఉన్నాయి. అవి ఆకర్ణాంతములు అంటే చెవుల వరకూ కన్నులు అమరి వున్నాయని కాదుగానీ విశాలత్వాన్ని విశేషముగా చెప్పే గాఢమైన అనుభూతి ఇక్కడ ప్రతిధ్వనిస్తున్నది. అంతే కాదు కాటుక రేఖలను సంకెళ్ళతో పోల్చడం కూడా నూతన భావన.

గోదాదేవి నూగారును వర్ణిస్తూ మన్మధుడు శృంగార భావనలకు దూరమైన యోగుల పైన కోపించి తన బంగారు ఒర నుండి కత్తిని అతివేగంగా పైకి తీయుటకు ప్రయత్నించగా, ఆ వేగానికి ఒర చిరిగింది. చిరిగిన ఒర నుండి కనిపిస్తున్న కత్తి వాదరవలె ఆమె నూగారు (రోమ రేఖ) కనిపిస్తున్నదంటాడు. ఇంకా నూగారును నాగుపాము లాగా కూడా ఒప్పుచున్నదంటాడు మరో పద్యంలో....

"అండజ గామిని యూరువు
బిండు వలపు లాన నాభి బిలము వెడలి చ
న్గొండల నడుమగ బ్రాకెడు
కుండలియో యనగ నారు కొమరొప్పారున్"

ఉత్తమజాతికి చెందిన స్త్రీల శ్వాస సువాసనాభరితంగా ఉంటుందని లోక ప్రతీతి. అలాగే జాతి నాగుపాములు సువాసనలను పీల్చి కడుపు నింపుకుంటాయని కూడా లోక ప్రతీతి కవిసమయం. రాయల వారు దానిని గ్రహించి తన కవిత్వంలో గోదాదేవి నూగారును కుండలినితో(జాతి నాగసర్పంతో) పోలుస్తూ, ఆమె పీల్చి వదలిన గాలి సువాసనలు వెదజల్లుచున్నది. ఆ పరిమళభరితమైన గాలిని ఆస్వాదించడానికి నాభిరంధ్రము నుండి అనగా పుట్టలోనుండి బయల్పడిన నాగుపామా? అన్నట్లుగా ఆమె నూగారు ఒప్పుతోందంటాడు రాయలవారు.

ప్రతి ప్రబంధకవి స్త్రీ సౌందర్యాన్ని వర్ణించిన వారే. కవులు చేసిన స్త్రీ విషయక వర్ణనాత్మక శిల్పంలో కన్నులు పద్మములు, నాసిక సంపెంగ పూవు. సర్వమున కదే ఉపమానము. "పాడిందే పాడరా పాచిపండ్ల దానరీ" అన్నట్లు ఏ కావ్యములో చూసినా అవే సాదృశ్యములు కన్పిస్తున్నవి.

అయితే, రాయలవారి ఉపమానకోటి మాత్రం నవ్యమైనది, విలక్షణమైనది. గోదాదేవి సౌందర్యవర్ణనలో రాయలవారి కొక చిక్కు వచ్చింది. అదేమంటే భగవంతుడు తనకు తండ్రి. మరి ఆయనకు భార్య కాదగినది గోదాదేవి. రాయలవారికి అనగా తనకు మానసికంగా తల్లివంటిది. అయితే భౌతికంగా తనకు కావ్యనాయిక. లోక భావనను దర్శించినది ఒక్క శ్రీకృష్ణదేవరాయలు మాత్రమే.

"వాతెఱ తొంటి కైవడి మాటలాడదు
కుటీల వృత్తి వహించే గుంతలములు

అక్షులు సిరులు రా నఱగంట గనుగొనే
నాడించె బొమగొని మాననంబు
చనుగొమల్నెగయ వక్షముపేక్ష గడకొత్తె
బాణి పాదము లెర్రఱవాఱ దొడగె
సారేకు మధ్యంబు దారిద్ర్యములు చెప్పె
రొచ్చోర్వకిటు లోగఱ జొచ్చె మేను

వట్టి గాంభీర్య మొక్కడు పెట్టుకొనియె
నాభి నానాటి కీగతి నాటి పొందు
చవుక యైనట్టి యిచ్చట జనదు నిలువ
ననుచు జాఱిన కరణి బాల్యంబు జాఱఎ"

గోదాదేవి సౌందర్యవర్ణనలో మొట్టమొదటి పద్యమిది. గోదాదేవి యౌవనాన్ని మాత్రమే వర్ణించి బాల్యాన్ని వదిలివేయడంలో రాయల దృష్టి భిన్నమైనది. రాయల "ఆముక్తమాల్యద" కావ్యానికి ఔచిత్యం అధికం. కథ ఎంతవరకు చెప్పాలో అంతే చెప్పడం ఔచిత్యం. కావ్య జీవితానికి ఔచిత్యం ప్రాణం. గోదాదేవి తల్లిదండ్రులను ముద్దు మురిపాలతో ఆలరించడానికి పుట్టలేదు. ఆవిడ లక్ష్యం వేరు. అ లక్ష్య సాధనకు సాధ్యమైనంత తొందరగా ఉపక్రమించింది అని చెప్పడానికి రాయలవారు బాల్యాన్ని పరిహరించారు.

రాయలవారికి తెలిసిన ఔచిత్యం మరెవరికి తెలియ దనటం అతిశయోక్తి కాదు. ఎందుకంటే ఒక విషయాన్ని చెప్పేటప్పుడు కావ్యమార్గం తెలియాలి. గోదాదేవి హరిని వరించడానికే పుట్టింది. ముందు చెప్పినట్లుగా తల్లి దండ్రులను అలరించడానికి కాదు. బాల్యక్రీడలు, విద్యా భ్యాసం, గురుభక్తి లాంటి విశేషాలు కవి వర్ణించినట్లయితే కావ్య ఔచిత్యం దెబ్బతిని వుండేది. రాయలవారు ఉచిత్యజ్ఞుడు. ఆయన ఏమి రాసినా కవిత్యంలో ప్రౌఢత్వం. రాజదర్జా ఉంటుంది. రాయలవారి మాట గంభీరమైన మణి వంటిది. అందుకే తాను చెప్పదలచు కున్న విషయానికి సరాసరిగా వచ్చాడు. గోదాదేవికి యవ్వనం తొందరగా వచ్చింది. ఎందుకంటే శ్రీహరి యందు ఆమె మనసు లగ్నమైవుంది. అందుకే తనను ఉపేక్షించిందని భావించిన బాల్యం ఇంకా ఆమెలోనే వుండి అవమానాలు పడలేక జారిపోయిందంటారు కవి. గోదాదేవి తన మనసులో యవ్వనాన్ని ఆహ్వానిస్తున్నది. బాల్యాన్ని చూసి ముఖం ముడుచుకొంది. బాల్యంలో మాట్లాడినంత వడిగా, యవ్వనం వచ్చిన తరువాత ఆమె మాట్లాడటం లేదు.

యవ్వనోదయాన్ని ఓ కోణం నుండి కవి చూసిస్తు న్నారు. శిల్పాన్ని లైట్ %ఉ% షేడ్ పద్ధతిలో ఏ విధంగా శిల్పి చెక్కుతాడో అలాగే కవికూడా గోదాదేవి సౌందర్యాన్ని దివ్యమైన కోణం నుండి వర్ణిస్తూ పదబంధాల్ని చిత్రిం చాడు. యవ్వనం బాల్యావస్థల సంధికాలాన్ని ఇంత అద్భుతంగా చిత్రించిన కవి "నభూతో న భవిష్యతి" అనడం అతిశయోక్తి కాదు.

బాల్యంలో గోదాదేవి ఎట్లున్నది? యౌవనము వచ్చిన తరువాత ఆమె సౌందర్యంతో ఎలా ఒప్పుచున్నది? అనే రెండు ప్రశ్నలకు ఏక కాలంలో అంటే ఒకే అత్యద్భుతమైన నైపుణ్యంతో గోదాదేవి ఆహార్యాన్ని మనముందు ఆవిష్క రిస్తున్నాడు రాయలవారు.

మొదటి నుండి ఆమె శరీరములో గల ఎన్నో విశేషాల వలన అనగా బంగారు రంగులో మెరిసే ఆమె శరీరము వలన గాని, అరుణకాంతితో ఒప్పు పెదవివలన కాని, చంద్రబింబము వంటి ముఖమువలనగాని ఆమెకు ప్రత్యేకత రాలేదు. కానీ మధించిన తుమ్మెద రంగు కలిగిన కుంతల సమూహముచే గోదాదేవికి "శ్యామ" అనే పేరు వచ్చిందని కవి వర్ణిస్తాడు. బాల్య వృద్ధాప్యదశలలో జుట్టు కాంతివిహీనంగా వుంటుంది. యౌవనంలో మాత్రమే చక్కని కాంతులు వెదజల్లుతూ శోభాయమానంగా వుంటుంది. ఈ సూక్ష్మ విషయం సైతం రాయలవారి సునిశిత దృష్టి నుండి తప్పించుకోలేక గోదాదేవి సౌందర్య వర్ణనలో నిక్షిప్తమైంది.

"ఆయత భుజైక చక్రుం
డా యదుపతి దొమ్మి గెలువ నడురమరుని గా

లాయన చక్ర పరంపర
లో యన నుంగరపు గురలు యవతికి నమరున్''

విశాలమైన బాహువు నందు చక్రాయుధమును ధరించిన శ్రీకృష్ణుని ఆకర్షించి, మోహం కలుగజేయుట చిన్న విషయమేమి కాదు. అందుకే ఆ పోరులో గెలువగలుగుటకే మన్మథుడు గోదాదేవికి అండగా తరలుచున్న మన్మథుని సైన్య సమూహమా అన్నట్లుగా ఆమె యొక్క ఉంగర సమేత వెంట్రు కసమూహం అమరినవి అని రాయలవారు వర్ణిస్తున్నారు.

సామాన్యంగా పిల్లలు ఏ విషయంలోనైనా తండ్రి అనుమతి కొరకు తల్లిని మధ్యస్థం చేస్తారు. అలాగే ఇక్కడ కవి కూడా మాతృప్రేమ ద్వారా భగవంతుని దగ్గరకు వెళ్ళాలన్న లక్ష్యం తోనే భగవతిగా గోదాదేవిని గుర్తించాడు. భగవంతునికి భక్తునకు అనుసంధానకర్తగా భగవతి వర్ణన చేస్తున్నాడు.

భారతీయ శిల్పంలో స్త్రీ విగ్రహనిర్మాణంలో తల్లినీ, ప్రేయసినీ కలిపి శిల్పించిన పద్ధతి ఉన్నది. అందుకే భారతీయ శిల్పం తక్కిన వాటికంటే ప్రత్యేకమైనది. ఒక సామ్రాజ్యాధినేతగా శిల్పసంపదను అనమానంగా, అనన్యంగా పోషించిన వ్యక్తిగా రాయలవారికి శిల్పకళ, సౌదర్యారాధనల పట్ల ఎంతటి గాఢమైన అనుబంధం వుందో నేను ప్రత్యేకంగా చెప్పవలసిన పనిలేదన కుంటాను. అలా ఎవరైనా సందేహిస్తే, హంపీ క్షేత్ర సందర్శనమే సమాధానమవగలదు.

గోదాదేవి సౌందర్య వర్ణనలో వుపయోగించిన 'శ్యామ', 'కుండలిని' శబ్దాలు యోగశాస్త్ర సంబంధమైనవి. ఆయన ఈ శబ్దాలద్వారా ఒక ప్రత్యేక ప్రయోజనాన్ని ఆశించాడు. అదేమనగా, గోదాదేవి వర్ణనలను అటు స్త్రీ దృష్టితో చూడకుండా, భౌతిక దృష్టితోనూ చూడకుండా ఆధ్యాత్మిక దృష్టిలోకి పాఠకులకు మళ్లించే ప్రతయ్నమిది. అందుకే యోగశాస్త్రంలోని పదాలను అలంకారులుగా వాడు కున్నాడు. చెలికత్తె లు కాటుక పెట్టినపుడు గోదాదేవి ఫాలభాగమనేడి చతుర్థీ చంద్రుని చూసినది అని చెప్పడంలో కూడా ఇక్కడ ''ఊర్ధ్వదృష్టి'' అనే అర్థం ధ్వనిస్తున్నది. ప్రతి వర్ణనతో సామాన్య దృష్టిని కలుగ జేయకుండా ఉండటం కోసమే ఈయన యోగశాస్త్రాన్ని, శిల్పశాస్త్రాలను, ఆధ్యాత్మిక తత్వాన్ని ఆధారం చేసుకొని తన వర్ణనాదృష్టిని సారించాడు.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 2 (2), February - 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

శ్రీ శివభారతం - దేశభక్తి

- డా॥. శ్రీపాద సీతామహాలక్ష్మి సత్యవతి వేరమాంబ, తెలుగు లెక్చరర్ (డెప్యుటేషన్), జిల్లా విద్యా శిక్షణ సంస్థ, బొమ్మూరు, రాజమహేంద్రవరం.

కవితావతంస, కవిసింహ, అవధాని పంచానన, శతావధాని విద్వాన్ "గడియారం వేంకట శేషశాస్త్రి" గారు వ్రాసిన 'శ్రీశివభారతం" అను మహా ప్రబంధము ఆధునిక పంచ మహాకావ్యాలలో ఒకటి. శ్రీ గడియారం వేంకట శేషశాస్త్రి గారు కడపజిల్లా జమ్మలమడుగు తాలూకాలోని నెమళ్ళదిన్నె అగ్రహారంలో 7/4/1894న జన్మించారు. వీరి తల్లిదండ్రులు నరసమాంబ, రామయ్యలు. వీరు ప్రొద్దుటూరు మున్సిపల్ హైస్కూల్లో ఆంధ్రోపాధ్యాయులుగా పనిచేశారు. వీరి భార్య వెంకట సుబ్బమ్మ. వీరికి ఇద్దరు కుమారులు రామశేషయ్య, వెంకట సుబ్రహ్మణ్యం.

శాస్త్రి గారు బహుముఖ ప్రజ్ఞాశాలి. విమర్శకులుగా రాణించారు. జ్యోతిష, వాస్తుశాస్త్రాలను పుక్కిటపట్టారు. అవధానిగా రాయలసీమలోని పలు ప్రాంతాల్లో సాహితీ మిత్రుడు దుర్భాక రాజశేఖర శతావధానితో కలిసి 1915 నుండి 'రాజశేఖర వేంకట శేషకవులు' అనే పేరుతో కవితారంగంలో కాలుమోపారు. శరన్నవరాత్ర పద్యావళి (1915), వీరమతి (1924) అనే కావ్యాలు జంటగా వ్రాశారు. 1920 నుండి 1928 వరకు రాయలసీమలోని పలుప్రాంతాల్లో అనేక అష్టావధానాలు, శతావధానాలు చేశారు. సువర్ణ కంకణాది ఘనసన్మానాలు అందుకున్నారు. ఈ అవధాన జైత్రయాత్రా విశేషాలను స్పష్టపరచే గ్రంథమే అవధానసారం (1932). 1935 వరకు జంటగా ఉన్న వీరిద్దరూ స్వతంత్ర కావ్య రచనాభిలాష వల్ల విడిపోయారు. శ్రీశివభారతం, మురారి, పుష్పబాణ విలాసము, వాస్తు జంత్రి, మల్లికామారుతము వీరి రచనలు. ఈ విధంగా 1915లో కవితారంగంలో కాలుమోపిన శాస్త్రిగారు 1981 వరకు అనగా 66 సంవత్సరాల పాటు కవితా సరస్వతిని ఆరాధించి తరించారు.

శాస్త్రిగారికి బాగా పేరు తెచ్చిన కావ్యం 1943లో వీరు వ్రాసిన చారిత్రక కావ్యం శ్రీశివభారతం. భారతవంశరాజుల చరిత్ర భారతము. శివాజీ భారతవీరుడు. శివము అనగా భద్రము, క్షేమము అని అర్థము. భారతము అనగా భారత దేశము. ఇలా చూస్తే భారతదేశ క్షేమమును వర్ణించిన కావ్యం శ్రీశివభారతం. భారతదేశంలో సనాతన ధర్మ పునరుద్ధరణకై కంకణము కట్టుకొని హైందవధర్మ పతాకమును ప్రతిష్టించిన వీరుడయిన శివాజీ చరిత్రయే శివభారతం. పరాయి పాలనను నిరసించి, స్వతంత్ర కాంక్షను అణువణువునా రగుల్చుతూన్న ఈ 'శ్రీశివ భారతం' 2,500 పద్యములు, 5 అశ్వాసములు గల బృహత్కావ్యము.

'నానృషిః కురుతే కావ్యమ్' శాంతిసిద్ధి కలవాడే ఋషి. శాంతగుణం కలవారందరూ కావ్యకర్తలు కాలేరుకాని, కావ్యకర్తకు మాత్రము ఋషిత్వసిద్ధి యున్నపుడే మహాకావ్యము వెలువరింపగలడు.

"పరహితమాత్మ నిర్వృతి యపార యశోధన గౌరవాది వి
స్ఫురణము లందజేసి యిహమున్ బరమున్ వెలయించి మానవున్
ధర జరితార్థ జేయు కవితాకళ నావశమౌట బంచమ
స్వరమున నాలపించెద వసంత వనాంత రసాల శాఖలన్"

లోకానికి మంచిని చెబుతూ, రచించిన వ్యక్తికి ఆనందాన్ని, సంఘంలో గొప్ప కీర్తిని, సంపదలను, గౌరవాన్ని కలిగించి, ఈ లోకంలోను, పరలోకం లోను ప్రకాశింపజేసి మనిషి జన్మను ధన్యం చేసే శక్తి కవిత్వానికి ఉంది. ఆకళ తనకు ఉందని, వసంతకాలంలో మామిడి తోటలో లేత చిగుళ్ళను తింటూ పంచమ స్వరంతో మధురాతి మధురంగా కూసే కోయిలలా కవితాగానం

చేస్తానని ఆత్మవిశ్వాసంతో ప్రకటించుకుని కవితాసృష్టి చేసిన మహాకవి శేషశాస్త్రి గారు. స్వతంత్రకాంక్షను రేకెత్తించే స్వతంత్ర చారిత్రక కావ్యరచనకు పూనుకుని, మరాఠా వీరుడయిన శివాజీని నాయకునిగా చేసి, ఉదాత్తమయిన కవితాగుణాలను చేర్చి రచించడంతో పాటు చారిత్రక విలువలను పాటించారు. ప్రామాణికమయిన ఆంగ్లాంధ్ర చారిత్రకాధారాలను కూడా ఎక్కడిక్కడ పాదసూచికలలో ఇచ్చారు. గడియారం వారి అభిమాన కవి తిక్కన. తిక్కన భావనాశక్తిని, పలుకుబడిని, సొంపును, కళానేతృత్వాన్ని, రాజకీయ పరిజ్ఞానాన్ని, మానసిక, ఆధ్యాత్మిక ప్రవృత్తిలోని తాదాత్మ్యబుద్ధిని శాస్త్రి గారు తాదాత్మ్యంతో ఆవేశింప జేసుకుని తదనురూపమైన కవితా మాధురితో శివభారత కావ్యాన్ని వ్రాశారు. శివభారతంలోని దేశభక్తి నేటికీ సాహిత్య సభల్లో గానం చేయబడుతోంది, హరికథగా పాడబడు తోంది, పురాణంగా పారాయణం చేయబడుతోంది. శాస్త్రి గారు శ్రీ శివభారతమును తమ తల్లిదండ్రులకు అంకిత మిస్తూ

"ఆట పాటలు చదువు సంధ్యయని కడచె
మూవ ప్రాయము మీ ప్రేమ భూములందు
నన్నొక గృహస్థఁజేసితి; రిన్ని కళలు
వడసి, యను భోక్తనై ఋణం పడితి మీకు!
స్వర్గ మర్త్యంతరమున మీ చరణమంటి
యెటుల బదులిత్తు! ఏమిత్తు! ఎంతయిత్తు!
అది అసాధ్యము; ఇది నా హృదయగీతి
కృతి సమర్పింతుఁ త్వత్పదాంకితముఁ జేసి!" అని

వారి ఋణాన్ని తీర్చుకున్నారు. పవిత్ర భారతదేశము, అందు దక్షిణ పీఠభూములను వర్ణించిన తీరు అమోఘము

అచలావతంసమై యలరు హిమాలయం
బుత్తర సీమయై యొప్పుచుండఁ,
బూర్వదక్షిణ పశ్చిమోర్వీ విశాలత
కాయత జలరాశులవధి గాఁగ,
నలరు 'భారతదేశమ'ను భూమి దానిమ
ధ్యమ భాగమందు వింధ్యాద్రి గలదు;
వింధ్యాద్రి కుత్తరవీధి 'నార్యావర్త'
మననొప్పు నుత్తర హైందివోర్వి
వింధ్య దక్షిణ వీధిఁ బవిత్ర నదులు
తపతి! గోదావరియు, భీమతటిని, కృష్ణ,
తుంగభద్రయుఁ, గావేరి, పొంగి పాఱు
పావనస్థలి దక్షిణ భరతోర్వి!" అని దక్షిణ భారత దేశమును వర్ణించబడం జరిగింది. అక్కడ మహారాష్ట్రుల స్వభావమును వివరిస్తూ

"నదులు మహీధలు వనంబులుఁ దల్లియుఁ దోడు నీడగా
నెదిగిన వారలై జనుల కృతిమ నిష్ఠుర వృత్తి జీవనా
భ్యుదయ పరోపకారములనో మెడుచో మెయిఁబొంగు ఘర్మబు
ద్బుదముల మొగ్గలన్ జిదిమి, దోయిలి పట్టుదు రర్ఘ్యమెత్తుచున్" ఈ విధంగా నదులు, పర్వతాలు, వనాలు తోడునీడగా ఎదిగి, పరోపకారమే జీవనంగా మెలగుచున్న వ్యవసాయం చేసుకునే 'భోన్‌స్లే' కులానికి చెందిన కుటుంబంలో వైశాఖ పంచమీ శుభ దినమున భారతీయుల గృహమున 'అపరశివుడు' దయించాడు.

"మూడవ కన్ను నెన్నుదుట; ముమ్మొనవాలు కరమ్ము నందు, రే
ఱేడు శిరమ్ము నందు ఁజిగిరింపక, నాఁ డనసూయ యింటఁ బా
రాడిన పావఁడే మన గృహమ్మున నేఁడు దయించెనేమొ! ఱే
కాడిన వాని చాయలవి యట్టివి; ధన్యుడ వీవు భూవరా!
ఆర్యమతముల ఁబరులుఱూపాడునాఁడు
శంకరాచార్యు ఁగన్న వైశాఖ పంచ
మీదినంబిది నేఁడు జన్మింపఁజేసె
నపరశివు; నెట్టి మేలు ముందరయఁ గలదో!" ఈ

విధంగా కావ్యనాయకులైన శివాజీ క్రీ.శ. 19-02-1630న పూనె జిల్లాలోని జున్నార్ పట్టణం దగ్గర శివనేరి కోటలో షాహాజీ, జిజియాబాయి దంపతులకు జన్మించాడు. తల్లి జిజియా చంటిబిడ్డ శివాజీకి భారతవీరు చరిత్రలు,

మహనీయుల ధైర్యసాహసాలు, భారతదేశ గొప్పదనం, సంస్కృతీ సాంప్రదాయాలు, దేశభక్తి, మొదలుగాగల ఎన్నో విషయాలను ఉగ్గుపాలలో రంగరించి పోసింది. శివాజీ హృదయమంతా దేశభక్తితో నిండి, చిన్ననాటనే పుష్పించి, విరిసి, సుగంధ పరిమళాలను వెదజల్లింది.

"ధీర హృదయంబు హృదయముల్ దెఱచు చూపు
పలుకు పొందిక, పొందిక పఱచు తెలివి,
ధర్మభంగా సహిష్ణు వర్తనము బెరయ
విరిసి, యెల్లర మదులఁ బుష్పించె శివుడు" మనసు, చూపు, మాట, తెలివి, చేసేపని ఇవన్నీ పొందికగా ఉండడం వల్ల శివాజీ అందరి హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని ఆక్రమించుకున్నాడు. ఏ ఘట్టంలో చూసినా శివాజీ ఆత్మవిశ్వాసం ఉరకలేస్తూ ఉంటుంది.

శివాజీ చిన్ననాడు బీజాపురంలో రాజవీధిలో నడచి పోతూ, కసాయివాడు ఆవును పట్టుకొని గొంతుకోయ బోయే దృశ్యం చూశాడు. అంతే! శరవేగంతో దూసుకెళ్ళి

"బలము తేజంబు జీవన భాగ్యమిచ్చు
సాధుగోమాత భారత భూశ్వాస కోశ!
మరియునద్దాని బంధింప, నుడికి పోదె
వటదళమ్మున ఁగనుమూయు వానికడుపు!"

భారతదేశానికి బలము, తేజస్సు, జీవన భాగ్యం అన్నీ ధేనువు వల్లనే కలుగుతాయి. అటువంటి గోవుకు అన్యాయం జరిగితే వటపత్రశాయి సహింపడు.

"పదరకుము తల్లి! నీకేమి భయము గలదు?
బాలకృష్ణుండు నిన్ను కాపాడఁగలడు;
తల్లి గండానఁబాయు నీ తఱుపితోడ
నాడు కొనవమ్మఁ వనరు బయళ్ళయందు" భయపడుతున్న ఆవును, లేగదూడను విడిపించాడు.

"అని కదిలింప, నల్ల నడయాడుచు ధేనువు పోవ, లేఁగదా
నిను వెనుకాడ, నాయడుగునీడల బాలశివుండు వోవుచున్,
దనయదలింపు, హంతకులు తాలిమిదేఱి మనమ్ము మాఱి చూ
పిన వినయంబు, పౌరుల నవీన గుణాదరణంబు నెంచుచున్." ఆవు, దాని వెంట లేగదూడ, వాటి వెంట బాల శివాజీ వెళ్తున్నపుడు కసాయివాని మనస్సుమారి నవీన గుణాలు సంతరించుకుని శివాజీపట్ల వినయం చూపడం ఇక్కడ విశేషం. ఈ విధంగా ఈ కావ్యంలో ప్రతిఘట్టం రమణీయం, రసవంతం. ఈ విధంగా స్వధర్మ రక్షణకు, మాతృదేశ రక్షణకు తన 17వ సం॥ నుండి పాటుపడ్డాడు. మహమ్మదీయుల దాడులనుండి దేశాన్ని సంరక్షించుకుంటూ, జీవితకాలమంతా అవిచ్ఛిన్న పోరాటం చేసిన శివాజీ జీవనం అజరామరం. తనకున్న పరిమిత సైన్యంతో అపరిమిత సైన్యం గల మొఘల్ చక్రవర్తులను ఎదిరించిన యోధుడు. అఖండ హిందూ సామ్రాజాన్ని స్థాపించాడు. 1674లో జ్యేష్ఠ శుద్ధ త్రయోదశిన ఛత్రపతి, బిరుదుపొంది, పట్టాభిషిక్తు డయ్యాడు. ఈరోజును భారతదేశమంతా 'హిందూ సామ్రాజ్య దివస్' గా జరుపుకుంటోంది. శివాజీ పాలనలో ధార్మిక, తాత్విక, రాజకీయ ఉపదేశాలున్నాయి. పాలకులందరూ పాటించవలసిన రాజనీతి ధర్మాలు న్నాయి. స్త్రీలపట్ల గౌరవముంది. ముఖ్యంగా తల్లి ఆశీర్వచనాలున్నాయి.

"చిన్ననాడు తొడజేర్చికొని జీజియామాత
వినిపించు రాజనీతినిఁదలంచి,
తనవెంట నడిపించుకొనుచు దాదోజినే
ర్పిన రాజ్యపాలన విలువ దెలిసి,
విజ్ఞానదృష్టి వివేకించి రామదా
సస్వామి యిడు ధర్మసరణి వంచి
భారతాదుల ధర్మ పరిపాటి విడదీఁసి
పాదుపుగా ఁదన యనుభూతి ఁజొనిపి,
నాడు నేడును రాబోవు నాడు గూడ
ఖిలముగాకెట్టి నిపుణులేఁ గొలువదగిన
నవ్య రాజ్యాంగ పరిపాలన క్రమంబు
శివమహీపతి చతురుడై సిద్ధపరిచె" తల్లి జిజియా, దాదోజీ ఖాండదేవుని వద్ద రాజ్యపాలన, గురువయిన సమర్ధ రామదాసు వద్ద ధర్మమార్గము, తనదైన

వ్యక్తిత్వంతో నవ్యరాజ్యాంగ పరిపాలన చేశాడు ఛత్రపతి శివాజీ. యుద్ధతంత్రాలలో మాత్రమేకాక, పరిపాలనా విధానంలో కూడా శివాజీ సమర్థుడు. మంత్రిమండలి, విదేశాంగ విధానం, పటిష్టమయిన గూఢచారి వ్యవస్థ ఏర్పాటు చేశాడు. ప్రజల కోసమే ప్రభువు అన్న సూత్రాన్ని పాటించి, వ్యక్తిగత విలాసాలకు సమయాన్ని వృధా చేయక అనవరతం ప్రజల సంక్షేమం కోసమే పాటు పడ్డాడు. తన పాలనలో స్త్రీలను గౌరవించాడు. పర స్త్రీలను కన్నతల్లులవలె చూశాడు. శివాజీ సర్దారు అబ్బాజీ సోన్‌దేవుడు కల్యాణి దుర్గాన్ని జయించి, అక్కడి రాణి వాసమును బంధించి తెస్తాడు. అప్పుడు శివాజీ భారతదేశ స్త్రీలలోని పతివ్రతలను గురించి కల్యాణి దుర్గాధిపతి కోడలితో

హరిహర బ్రహ్మల ఁబురుటి బిడ్డలఁ జేసి
జోలపాడిన పురంధ్రీ లలామ,
యమధర్మరాజు పాశము ద్రుంచి యదలించి
పతిభిక్ష గొన్న పావన చరిత్ర,
ధగధగ ద్ధహన మధ్యము పూలరాశిగా
విహరించియున్న సాధ్వీమతల్లి,
పతి నిమిత్తము సూర్య భగవాను నుదయంబు
నరికట్టి నిలుపు పుణ్యములపంట,
అట్టియెందరో భరతాంబ యాడుబిడ్డ
లమల పతిదేవతాత్వ భాగ్యములు వోసి
పుట్టినిలు మెట్టినిలుఁ బెంచు పుణ్యసుతులు

గలరు, భారతవాని భాగ్య కల్పలతలు!" అంటూ అనసూయ, సీత, సావిత్రి, సుమతి వంటి మహా పతివ్రతలను భారతదేశ భాగ్య కల్పలతలని చెబుతూ ఆమెను

"యనవ పుణ్యాంగనా మణి వగుదు గాక
హైందవుల పూజ తల్లి యట్లందరాదె?
నీదు రూపము నా యందు లేదయైన
గనని తల్లివిగా నిన్ను గారవింతు!" అంటూ నీవు యవన దేశపు పుణ్యస్త్రీవి అయినా, మా హైందవపూజను స్వీకరించు. నిన్ను నా తల్లిగా గౌరవిస్తాను అని తగిన మర్యాద చేసి, సైన్యం తోడిచ్చి, సగౌరవంగా బీజాపురికి పంపాడు. ఈ విధంగా శివభారతంలోని ప్రతి ఘట్టం హృద్యంగా, కళ్ళకు కట్టినట్లుగా చిత్రించారు శాస్త్రి గారు.

"తెలుగుకు ఇంత లగువు, బిగువు కలదా అని ఆశ్చర్యపడేలా చేసే నుడికారాలు, పలుకుబళ్ళు, సామెతలు శివభారత కావ్యంలో కోకొల్లలుగా ఉన్నాయి"

- రాళ్ళపల్లి అనంత కృష్ణ శర్మ.

"ఈ మహాకావ్యం శతాబ్దులు, సహస్రాబ్దులు తెలుగువాళ్ళ కడుపులు నిండించే రాయలసీమ పంట"

- మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి.

"శివభారతం గడియారం వారి పద్యరచన యొక్క తేనె కాలువ"

- విశ్వనాధ సత్యనారాయణ

ఈ కావ్యంలోని శివాజీ సంకల్పం, వీరోచిత పోరాటం, ఆత్మాభిమానం, పరమత సహనం, రాజకీయ విధానం, పరమత సహనం, హైందవ ధర్మం, దేశభక్తి, భూతదయ, స్త్రీల పట్ల గౌరవభావం, ప్రజాభిమానం, ఆత్మవిశ్వాసం ఇవన్నీ భావితరాలకు మార్గదర్శకాలు.

-- జైహింద్ --

ఆధార గ్రంథాలు :

1) శ్రీ శివభారతం - గడియారం వెంకట శేషశాస్త్రి
2) పదవ తరగతి తెలుగు వాచకం (ఆంధ్రప్రదేశ్)
3) వివిధ పత్రికలలోని వ్యాసాలు
4) అంతర్జాల వ్యాసాలు
5) శబ్ద రత్నాకరము

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 2 (2), February - 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

కర్నూలు జిల్లా పద్య కావ్యాలు కలుగోట్ల విజయాత్రేయ

- డా॥. జగర్లమూడి శ్యామసుందర శాస్త్రి

కర్నూలు జిల్లాలో వందలాదిగా కవులు గత అనేక శతాబ్దాలుగా సాహిత్య సృజన చేస్తూ ఉన్నారు. అయితే వారి గురించి సమగ్రంగా వివరించగల రచన ఏదీ లేకపోవడం శోచనీయం. ఉన్నంతలో దాదాపు 8 వందల మంది కవి పండితుల రచయితల వివరాలు తెలియజేసే 'కర్నూలు జిల్లా కవి తరంగిణి' అనే గ్రంథం పాఠకులకు, పరిశోధకులకు కొంత మార్గదర్శనం చేయగలుగుతూంది. సాహితీలోకం ఈ పుస్తక రచయిత శ్రీ వైద్యం వేంకటేశ్వరాచార్యులు గారికి కృతజ్ఞతలు చెల్లిస్తోంది.

వందలాదిగా ఉన్న కవులలో పేరెన్నికగన్న కొందరిని రేఖామాత్రంగా స్మరించడం ఈ సమయంలో నా బాధ్యతగా భావిస్తున్నాను.

ఒకప్పటి కర్నూలు జిల్లాలో భాగమైన 'కంబం' గ్రామానికి 16 కి.మీ. దూరంలో ఉన్న 'ఒరయూరు' రాజధానిగా పాలించిన 'నన్నెచోడుడు' కుమార సంభవం, కళావిలాసం అనే గ్రంథాలను రచించాడు. కాలం 11వ శతాబ్దం.

'చక్రపాణి రంగనాథుడు' అహోబిలం, శ్రీశైలం ప్రాంతాల్లో నివసించి, నయనరగడ పద్ధతిలో 'శివభక్తి దీపిక', శ్రీ గిరినాథ విక్రమం వంటి 'సీస' పద్య కావ్యం, ఇంకా అనేక కావ్యాలు శ్రీశైల మల్లికార్జునుని గురించి రచించాడు. 'రంగనాథ రామాయణం' ఈయన కృతమని చాలాకాలం భ్రమపడ్డారు. కాలం 13వ శతాబ్దం.

కోవెలకుంట్ల వాసుడుగా ఇటీవలి పరిశోధకులు భావిస్తున్న సంకుసాల నరసయ్య / నృసింహ కవి 'మాంధాతృ చరిత్ర' అనే మరో పేరున్న 'కవి కర్ణరసాయనం' అనే కావ్యాన్ని శృంగార ప్రౌఢ ప్రబంధంగా రచించాడు. దీన్ని చదివిన 'యతి' విటుడౌతాడని, 'విటుడు' యతిగా మారతాడని కవి ప్రతిజ్ఞ! కాలం 16వ శతాబ్దం.

'ఆంధ్ర కవితా పితామహుడు'గా శ్రీకృష్ణదేవరాయల మన్ననలు పొందిన 'అల్లసాని పెద్దన' - 'స్వారోచిషమను సంభవకర్త. అష్టదిగ్గజ కవులలో ఒకడుగా పేరుపొందిన ఈయన 'దోరణాల' వాసి అని ఇటీవలి పరిశోధకులు నిరూపించినట్లు తెలుస్తోంది. కాలం 16వ శతాబ్దం.

నందికొట్కూరు, 'పారుమంచాల' గ్రామానికి చెందిన చిత్రకవి పెద్దన 16వ శతాబ్దంలో... 'లక్షణసార సంగ్రహము, హనుమచ్ఛతకం' రచించాడు,..

నంద్యాల కృష్ణభూపతి ఆస్థానంలో ఉండిన పింగళి సూరన 'కానాల' నివాసి. కళాపూర్ణోదయం, రాఘవ పాండవీయం (తొలి ద్వ్యర్థి), ప్రభావతీ ప్రద్యుమ్నం, గిరిజా కల్యాణం, గరుడ పురాణం కావ్యాలు రచించాడు. కాలం 16 శతాబ్దం.

కోయిలకుంట్ల తాలూకా 'గుళ్ళదుర్తి'ని అగ్రహారంగా పొందిన 'క్రొంజ వేంకటాద్రి' కవి తొరగంటి నరసరాజు అనుగ్రహపాత్రుడు. 16వ శతాబ్దం నాటి ఈ కవి 'వాసంతికా పరిణయము' యక్షగాన కావ్యాన్ని రచించాడు.

18వ శతాబ్దానికి చెందిన 'ప్రాగటూరు' సంస్థానాధిపతి 'బిజ్జుల తిమ్మారెడ్డి' కందెనవోలు ప్రధానంగా పాలించాడు. 'అనర్ఘ రాఘవము' ఈతని కృతి.

'త్యాగరాజస్వామి' పితామహులైన 'గిరిరాజకవి' కాకర్ల వాన్తవ్యులు. 18వ శతాబ్దానికి చెందిన ఈయన 'రాజకన్యాపరిణయం', 'రాజమోహన కురవంజి' వంటి కావ్యాలు రచించాడు.

నందికొట్కూరు ప్రాంతీయుడైన 'గట్టు శేషకవి' సత్యభామా విజయం, కుచేలోపాఖ్యానం, యాజ్ఞవల్క్య చరిత్రం, సురాభాండేశ్వరం వంటి కావ్యాలు రచించాడు. ముక్కముళ్ళ వాస్తవ్యులు 'బందుమియ్య' తనకు

సమకాలికుడైన 'బుడ్డా వెంగళరెడ్డి' జీవిత విశేషాలను 'బుడ్డా వెంగళరెడ్డి చరిత్ర'గా కావ్యంగా రచించాడు.

'ఉప్పలపాడు' ప్రాంతీయులు ఉయ్యాలవాడ రామ చంద్రరావు 19వ శతాబ్దానికి చెందినవాడు. 'శ్రీరామ చరిత్రము' ఈయన కావ్యం.

'లక్ష్మీపురం' యల్లకవి' 19వ శతాబ్దానికి చెందిన కవి. గోరంట్ల మాధవ ప్రబంధం 'యక్షగానంగా' రచించాడు.

'గని' వాస్తవ్యులైన నిడిచెనమెట్ల సుబ్బాశాస్త్రులు 20వ శతాబ్దపు కవి. 'గని నీలకంఠేశ్వర శతకం', రంగనాథ అక్షరాంక మాలిక ఈయన కావ్యాలు.

కొలిమిగుండ్ల మండలం 'నందిపాడు'కు చెందిన నందిపాటి శేషమ్మ 'బ్రహ్మైక్యబోధ', 'జయదేవ చరిత్రం' వంటి కావ్యాలు, నాటకాలు రచించింది. 20వ శతాబ్దం ఈమె కాలం.

ఓర్వకల్లు మండలం, 'కన్నమడకల' గ్రామ వాస్తవ్యులు నంద్యాల అనంతాచార్యులు 19వ శతాబ్దం చివరి భాగంలో గద్వాల శ్రీరామ భూపాలుని సంస్థాన పండితులుగా ఉండిన వీరు ఆచార్య వింశతి, ఆంధ్ర శబ్ద చింతామణి, మదన బాణవిజయం వంటి కావ్యాలు రచించారు.

'పెదపాడు' గ్రామ వాసి 'గోపయ్య' వాక్కుద్ధి గల కల కవి. రచనలేవీ లభ్యం కావడం లేదు. 'దామోదరం నంజీవయ్య' జన్మించడానికి ముందే ఆయన తల్లిదండ్రులకు కుమారుడి జీవిత విశేషాలను తెలియ జెప్పిన జ్యోతిశ్శాస్త్రవేత్త, కవి అయన.

'కలవటాల జయరామారావు' కోయిలకుంట్ల - కలవటాల వాస్తవ్యుడు. 'జయరామ నానార్థ నిఘంటువు' పేరిట 15 వేల కంద పద్యాలు రచించిన ఏకైక కవి. 20వ శతాబ్దం వీరి కాలం.

20వ శతాబ్దానికి చెందిన ఉప్పలూరి శివరామశాస్త్రి కర్నూలు నివాసి. 'రామాయణము'ను లఘు ద్విపద కృతిగా రచించారు.

'రాయసంశేషగిరి రావు' నంద్యాల వాస్తవ్యులు - తొలి పార్లమెంటు సభ్యులు - నంద్యాల నుండి శ్రీ పాణికేశ్వర మహాత్మ్యం, కుసుమావలి వంటి కావ్యాలు రచించారు.

బనగానపల్లి - పసుపుల వాస్తవులు 'నిశ్చింత సూగూర సూరి' చిన్న టేకూరులో కూడ నివసించారు. 'పంపా రమణ శతకం, మనశ్శుద్ధి శతకం' వంటి పద్య రచనలు చేశారు. కాలం 19-20వ శతాబ్దాలు.

ప్రధానంగా 20వ శతాబ్దంలో జీవించిన దైవందిన్నె రామారెడ్డి బెళగల్ - దైవందిన్నె ప్రాంతీయులు. స్వయంగా కవి.

పూర్వపు కర్నూలు జిల్లా ఎఱ్ఱగొండ పాలెం వాస్తవ్యులై, గద్వాల సంస్థాన కవిగా వెలిగిన గాడేపల్లి వీరరాఘవ శాస్త్రి అవధాని, ఆశుకవి; 19వ శతాబ్దంలో జీవించిన ఈయన "కర్నూలు జిల్లా జలప్రళయం, సీతాకల్యాణం, శ్రీ మదహోబల మహాత్యం" వంటి కావ్యాలు, శతకాలు రచించారు.

కర్నూలు వాస్తవ్యులు దోమా వెంకటస్వామి గుప్త. 20వ శతాబ్దికి చెందిన ఈయన శ్రీ పరకాల విలాసం, ప్రేమాభిరామం, బ్రహ్మవైవర్త పురాణం రచించారు. ఇంకా అనేక ముద్రిత గ్రంథాల రచయిత అయిన ఈయన శతావధాని.

నెల్లూరులో పుట్టినా నంద్యాలలో స్థిరపడి 'కవితా సామ్రాజ్యాన్ని' స్థాపించి, విశేషంగా సాహితీ సృజన చేసినవారు మద్దులపల్లి వేంకట సుబ్రహ్మణ్య శాస్త్రి. అద్భుత చర్యలు, అమృత సందేశం వంటి అనేక రచనలు చేసిన ఈయన కాలం 20వ శతాబ్దం.

'అభినవ వేమన' బిరుదం పొందిన 'జోస్యం జనార్దన శాస్త్రి బహుముఖ ప్రజ్ఞాశాలి. పాణ్యం వాస్తవ్యులైన ఈయన కన్నతల్లి, వీరాంజనేయ విలాసము, పసిడి పంట, దేవీమహాత్యం వంటి అనేక కావాల్యను రచించారు. కాలం 20వ శతాబ్దం.

తెలుగు, ఆంగ్ల భాషలలో కవిగా, ఆంగ్లంలో ఖజూ ఎజుచీూ×ూచీఃు పేరుతో అష్టావధానాన్ని చేసిన వారుగా

పేరు పొందిన 'అందలం కృష్ణమూర్తి' మహాదాత (బుడ్డా వేంగళరెడ్డి), మధుగీతి, శ్రీకృష్ణ తాండవం వంటి పద్య కావ్యాలను రచించారు. కాలం 20వ శతాబ్దం.

'మొలగవెల్లి' వాస్తవ్యులు ఏలూరి యంగన్న శ్రీరామ జపమాల, ఇంకా కొన్ని ఖండికలు రచించారు. 20వ శతాబ్దానికి చెందిన ఈయన నటులు, గాయకులు కూడా.

దొర్నిపాడు - కొత్తపల్లి వాస్తవ్యులు మాచిరాజు శివ రామరాజు అష్టావధాని 'మణుల మూట, తేనె జల్లులు, దయానంద ప్రబంధం' వంటి కావ్యాలు రచించారు.

'ఆశిషమ్ములు వత్స! సంన్యాస దీక్ష
స్వీకరించిన నీ కిష్ట సిద్ధిరస్తు
వినుము' శుద్ధ చైతన్యుడన్ బేరు మారి
ప్రథితమగు 'దయానంద సరస్వతి' యను
నామ మిక నీకు భావినీ నాటి నుండి.
(దయానంద ప్రబంధం)

పాణ్యం నరసరామయ్య ఉయ్యాలవాడ వాస్తవ్యులు. 'స్వాతంత్ర్యవీరుడు', వీరకంకణం వంటి కావ్యాలు రచించారు. పాణ్యం లక్ష్మీనరసింహ శాస్త్రితో కలసి జంట కవులుగా 'ప్రభాత రేఖలు' వంటి కృతులు రచించారు.

అమితోద్దండ దురంత పీడనకులోనై భారతీయ ప్రజా
సముదాయం బొనరించినట్టి ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామ రం
గము కన్నన్ బదియేండ్లకున్మునుపె యాంగ్లప్రాజ్య సామ్రాజ్యపై
న్యముపై గత్తిని దూసినట్టి నరసింహారెడ్డి సామాన్యుడే!
(స్వాతంత్ర్య వీరుడు)

విరివింటి వేంకటరమణ శర్మ 'గని' వాస్తవ్యులు. 20వ శతాబ్దానికి చెందిన ఈయన ఊర్వశి, శర్మిష్ఠ, శృంగార ప్రభావతి, తులసిమాల వంటి ఖండ కావ్యాలు రచించారు.

పాలిడి జోల పాడగల భాగ్యములే కరవాయె, దానవో
ద్ధాలక శౌర్యరాశి యదునందను పట్టపు దేవివయ్యు, రా
రా లలితేంద్ర నీలరుచిరా! సుకుమార! కుమార! యంచు శం
పాలతికోపమాంగి కడుమక్కువ నంకము జేర్చి పుత్రకున్
(శృంగార ప్రభావతి)

దుద్దేల పుల్లయ్య నంద్యాల - బయ్యపు కోడూరు వాస్తవ్యులు. శ్రీ వేంకటేశ్వర శతకం, వృక్ష విలాపం వంటి పద్య కృతులు రచించారు.

పద్యము ఆంధ్ర సాహితిని ప్రక్రియలన్నిట నాద్యమై కడున్
హృద్యము, గాన బద్ధమయి, ఎంతయు నింపయి వీనుదోయికిన్
వాద్య విశేషమై విబుధ వర్యులకెల్లను ప్రీతిపాత్రమై
సద్యశమున్ గడించు నిల సత్కృతికర్తకు, దాని భర్తకున్.
(వృక్ష విలాపము - ఆంధ్ర భాషాయోష)

కిలారు చిన్న (కె.సి.హెచ్) సుబ్బరాయుడు గిద్దలూరు - రెడ్డిచర్లలో జన్మించి, ఆదోనిలో స్థిరపడ్డారు. లూక్రెసు భంగపాటు, దేశం కోసం వంటి కావ్యాలు రచించారు.

దేశము కోసమెవ్వడిల ధీరత మీరిన త్యాగభావనన్
లేశము శంకలేక నవలీలగ నాత్మ సమర్పణాకృతిన్
నాశనమౌనొ వాని జననంబు పునీతము కాన మీదు ని
ర్దేశము జాతి కోసమును, దివ్యము గావున దాల్తు నౌదలన్.
(దేశం కోసం)

నంద్యాల వాస్తవ్యులు గొట్టిముక్కల సుబ్రహ్మణ్య శాస్త్రి శ్రీ శ్రీనివాస స్తోత్రమంజరి, పాండురంగ శతకం, శ్రీనివాసోదాహరణం, 'మల్లీ! ఓ మల్లీ', 'త్రయీ' వంటి కావ్యాలు రచించారు.

ఈ తెల్గు నేర్చెనా! ఏ భాషలోనైన స్పష్ట భాషణ రీతి పాదుకొనును!
ఈ తెల్గు నేర్చియే ఇంపుగా గీర్వాణ పద్యములం బాడు పాటగాడు!
ఈ తెల్గు గాయకుల్ హేలగా నేభాష పాటలనైనను పాడగలరు!
ఈ తెల్గు వచ్చెనా! ఏ భాషనుం బరకాయ ప్రవేశ సత్కళలు వచ్చు!

విశ్వమందీ తెలుగు నేర్చు విబుధుడొకడె; యాస దోపని రీతి మాట్లాడగలడు
అతిశయోక్తి కాదిది! సత్యమయ్య స్వామి; వేరుమాటేల సుథలూరు వెలుగు తెలుగు.

(త్రయీ...)

వైద్యం వేంకటేశ్వరాచార్యులు కర్నూలు వాసి. విశిష్ట పరిశోధకులు! మార్గదర్శకులు! వేంకటరమణ నక్షత్ర మాల, తెలుగుభాష, సుదర్శన చక్ర రాజ శతకము, శతక ద్వాదశి వంటి శతకాలు, శతక సంపుటులు రచించారు.

జగతి సమస్తమారయగ చక్రము లేనిది సాగదేదియున్
ప్రగతికి మంచి చిహ్నముగ భాసిలు చక్రము, మానవాలికిన్
ప్రగతికి సాధనమ్ముగను వాసికి నెక్కెను చక్రమెన్నగా
సుగతి నొసంగునిన్ శరణుజొత్తు - సుదర్శన చక్ర రాజమా!!

తాటిమాను నారాయణ రెడ్డి బేతంచర్ల నివాసి. 'శేషప్రభ' వీరి పద్య ప్రబంధం. శంకర శతకం, నాగ లింగేశ్వర శతకం, యుగనీతి, మాతృదేవోభవ ఈయన ఇతర రచనలు.

భూమిని జుట్టవచ్చు, మరి భూధరమెత్తగవచ్చు, విశ్వసం
గ్రామము సేయవచ్చు, కలకాలము పెద్దగ సాగవచ్చు, సౌ
దామిని బట్టవచ్చు, శ్రుతి ధర్మము మెప్పగ మార్చవచ్చు, నా
సోముని జేరవచ్చు, మహిశుంఠల మార్చగ నౌనె? శంకరా!

(శంకర శతకం)

డా॥. కోడూరు విష్ణునందన్ ఇటీవలి కాలపు పద్యకవి. అతి చిన్న వయసులో 'ధర్మ దండం' కావ్యాన్ని రచించాడు. ఆదిశంకరుల జీవిత చరిత్ర ఈ కావ్య కథ! నంద్యాల వాస్తవ్యుడైన ఈ కవి వైద్యుడు కూడా! 18వ సంవత్సరంలో ఈ కావ్యం పూర్తి చేశాడు.

ఆసౌజన్య మనస్వి భక్తికి ననంతానందమేపార నా
ధీ సంసర్గ సుశోభితుండు కరుణా దృష్టిన్ ప్రసారించి త
ద్వాసంబందున గాంచనామలకముల్ వర్షింపజేయంగ ల
క్ష్మీ సంస్తోత్రము సల్పివారలకు సంక్షేమంబు గూర్చెన్ గృపన్!

(ధర్మ దండం)

కలుగోట్ల విజయాత్రేయ కవిత్వం... కర్ణుడు కావ్యం:

'కలుగోట్ల విజయాత్రేయ' 20వ శతాబ్దానికి చెందిన కవి. కర్నూలు జిల్లా 'గని' ఈతని స్వస్థలం. కలుగోట్ల సుందరరావు ఈయన పినతండ్రి. 1935లో జన్మించిన విజయాత్రేయ తన రచనా వ్యాసంగాన్ని నవలలతో ప్రారంభించారు. 42 నవలలు ముద్రితాలు. ఆ తర్వాత 4 నాటకాలు, ఒక ఏకాంకికను, '7' ఏకపాత్రలు రచించారు. ఆ తర్వాత 1956, 57 సంవత్సరాలలో 'సోపాన సందేశం'తో తన పద్య కవితా ప్రస్థానం ప్రారంభించారు. '9' కావ్యాలు, '57' ఖండ కావ్యాలు, 2 గేయ కావ్యాలు ఆయన కలం నుండి జాలువారాయి. ఇంత విస్తృతంగా 'రచనలు' చేసిన వారు, విభిన్న ప్రక్రియలు చేపట్టిన వారు అతి తక్కువగా కనిపిస్తారు.

1975 నాటికి 'రాణి ప్రమీల' కావ్యాన్ని వెలువరించారు. 'జైమినీ భారతం'లోని ఒక ఘట్టాన్ని అంతర్జాతీయ మహిళా సంవత్సరం నేపథ్యంలో కావ్యంగా రూపొందించారు. మహిళా ఔన్నత్యాన్ని ప్రముఖంగా ప్రస్తావించిన కావ్యం 'రాణి ప్రమీల'.

1977 నాటికి 'మహర్షి రావణ' కావ్యాన్ని రచించారు. ఆధ్యాత్మ రామాయణంలోని 'రావణ' పాత్రను 'మహర్షి రావణ'గా మలిచి రావణుడిని ఉన్నతంగా చూపిన కావ్యమిది.

1977లోనే 'ఊర్వశి' కావ్యాన్ని వెలువరించారు. మహాభారతంలోని ఊర్వశి పాత్ర, అరణ్య పర్యంలోని అర్జునుడి స్వర్లోకయాత్రల ఆధారంగా ఈ కావ్యాన్ని రూపొందించారు.

1979 సంవత్సరంలో విజయాత్రేయ 'హేమ శిఖరాలు' వెలవడింది. ఇదొక కల్పిత గాథ! విధి వశాన సన్యాసి అయిన యువకుడు, భిల్ల యువతి అయిన ఒక రాజకుమార్తె పరస్పరం కలుసుకోవడం, వారి మధ్య ప్రణయం, పరిణయం ఈ కావ్యంలోని ప్రధానాంశం.

1988 నాటికి 'కర్ణుడు' కావ్యాన్ని రచించారు. మహా భారతంలోని 'కర్ణుడి' కథ ఈ కావ్యంలోని ఇతివృత్తం. విజయాత్రేయ రచనలన్నిటిలోను ఉత్కృష్టమైనది 'కర్ణుడు' కావ్యం.

1990 సంవత్సరంలో 'కచుడు దేవయాని' కావ్యాన్ని రచించారు. మహాభారతంలోని కచదేవయాని వృత్తాంతం ఈ కావ్యంలోని కథ.

1993 సంవత్సరంలో 'వైరాటి' కావ్యాన్ని ఆవిష్కరించారు విజయాత్రేయ. మహాభారతంలోని 'విరాట పర్వం'లోని ఇతివృత్తం - 'ఉత్తరుడు' ప్రధానపాత్రగా - 'వైరాటి' కావ్యంగా రచించారు.

1994లో 'పచ్చిముత్యం' కావ్యాన్ని రచించారు. కళాపూర్ణోదయంలోని 'సుగాత్రీశాలీనుల' వృత్తాంతం ఈ కావ్యంలో రూపుదిద్దుకున్నది. ఇది అముద్రితం.

'59' ఖండ కావ్యాలలో 'సమ్రాట్ సుయోధన', దాశకన్య, చిత్రాంగి, జవరాలి సవాలు, ఊహావిహంగాలు - కావ్యస్థాయిని అందుకోగల రచనలు. 'లాస్యగౌరి' ముద్రిత గేయ కావ్యం; 'తాండవకృష్ణ' అముద్రిత గేయ కావ్యం.

పద్య కవిగా చేయి తిరిగిన కలుగోట్ల విజయాత్రేయ రచించిన కావ్యాలు సులభంగానే అర్థమయ్యే విధంగా ఉంటాయి. కేవలం మంచి పాత్రలు మాత్రమే కాక జన బాహుళ్యంలో ప్రతి నాయకులుగా, చెడు లక్షణాలు కలవారుగా పేరు పొందిన పాత్రలను కూడ తన కావ్యాలకు ప్రధానపాత్రలుగా తీర్చిదిద్దిన వారు విజయాత్రేయ. ప్రతి నాయక పాత్రలను నాయకులుగా తీర్చిదిద్దడం ఆంగ్ల సాహిత్య సంప్రదాయం. అటువంటి కావ్యాలను కూడ సముచితమైన సమర్థనలతో నిర్వహించిన రసజ్ఞ కవి కలుగోట్ల విజయాత్రేయ.

సమ్రాట్ సుయోధన, మహర్షి రావణ, కర్ణుడు అటువంటి కావ్యాలు. 'కర్ణుడు' కావ్యాన్ని సమీక్షించుదాం.

'కర్ణుడు' కావ్యంలో పదకొండు శీర్షికల విభజన కనిపిస్తుంది. అవి 'కౌంతేయుడు', రాధేయుడు, అంగరాజు, జగజెట్టి, నెరదాత, ప్రజ్ఞా శాలి, ఉపజ్ఞా శాలి, వినయ శిఖరం, కురుచమూనేత, సమర మార్తాండుడు, '11'వ అంకం. 11వ అంకానికి కవి పేరు పెట్టలేదు. కర్ణుని మరణం వల్ల ఏర్పడే శూన్యతకు గుర్తుగా కాబోలు... శీర్షిక లేకుండానే అంకాన్ని ముందుకు నడిపారు. ఈ శీర్షికలు ఆ అంకాలలోని కథాక్రమాన్ని తెలియజేస్తాయి.

'కర్ణుడి తల మహాభారతం' అనే తెలుగు సామెత తెలిసిందే. సంస్కృత, కవిత్రయ భారతాలలో కర్ణుడి పాత్రకు న్యాయం జరుగలేదని డా॥ నండూరి రామకృష్ణమాచార్య వ్యాఖ్యానించారు. 'కర్ణుడు' కావ్యంలో ఆ లోపాన్ని పూరించే ప్రయత్నం చేశారనిపిస్తుంది - విజయాత్రేయ.

కవిత్రయ భారతంలోని శాంతి పర్వంలో నారదుడు ధర్మరాజుకు కర్ణుడి చరిత్రను తెలియజేస్తాడు. పాండవుల పట్ల అసూయాద్వేషాలు పెంచుకున్నవాడిగా కర్ణుడు కనిపిస్తాడు.

విజయాత్రేయ కర్ణుని మనసులోని ఈర్ష్యా, అసూయలను అర్జునుని వరకే పరిమితం చేశారు. అందుకే దుర్యోధనుని స్నేహాన్ని అంగీకరించాడు కర్ణుడు... అంగరాజయినాడు - అని వర్ణించారు.

అర్జునుని పట్ల నీర్ష్యా మహాగ్ని కీల
నాలుకలు చాచ నెదలోన నణచిపట్టి
తనదు బలదర్ప జీవితాధ్యాయమంత
ప్రియ సుయోధను ప్రగతి కర్పించినాడు...

అంతే కాక... కర్ణుని కీర్తికి లోపాలుగా కనిపించే అంశాలను కూడ విజయాత్రేయ తన కావ్యంలో పరిహరించారు.

ద్రౌపదీ స్వయంవర సభలో కర్ణుడు విల్లు ఎక్కుపెట్టలేకపోవడం - కర్ణుడు కావ్యంలో కనిపించదు. ఆ సన్నివేశమే లేకుండా శుభాంగి స్వయంవర సమయంలో - కర్ణుడు, తనను ద్రౌపది స్వయంవర సమయంలో 'కుల

విహీనుడని' నిందించడాన్ని గుర్తు చేసుకుంటాడు. అందువల్ల అసలు ప్రయత్నించనే లేదనే ధ్వనిని వినిపిస్తాడు.

శుభ శుభాంగీ స్వయంవర విభవ వీచి
వీచిన విజయ విక్రాంతవేళలోన
ద్రోపదీ స్వయంవర చటులావమాన
ఘట్టమొక్కటి కర్ణుని కనుల యెదుట.

పరశురాముని దగ్గర విద్యాభ్యాసం, ద్రౌపదీ వస్త్రాపహరణ సభలో కర్ణుడు కారణం కావడం కూడా విజయాత్రేయ పరిహరించారు. అభిమన్యుని విల్లు విరచడంలో కర్ణుడు అధర్మవర్తనకు పాల్పడడం కూడ పరిహరించారు. భీముని చేత కర్ణుడు ఓడి, మూర్ఛిల్లడాన్ని వదలిపెట్టారు.

అయితే విజయాత్రేయ కొన్ని అంశాలను ప్రత్యేకించి విస్తరించారు.

కర్ణుని అస్త్ర విద్యాభ్యాసానికై అధిరథుడు ధృతరాష్ట్రుని ప్రత్యేకంగా అభ్యర్థించి ద్రోణుని వద్ద చేర్చినట్టు రచించారు.

తనకు ధృతరాష్ట్ర కడగల చనువు కొలది
సుతుని జగదేక శూరుగా జూచుకొరకు...
హస్తి పుర రాచ సమర విద్యాలయాన
కుంభ సంభవు చరణ కుంకుమలమ్రోల
విడిచిపెట్టెను రాధేయు వినయధనుని
అధిరథుండు ధనుర్వేద మభ్యసింప!

దుర్యోధనుడు శుభాంగి స్వయంవరానికి వెళ్ళినప్పుడు తోడుగా వెళ్ళిన కర్ణుడు - జరాసంధాది ప్రముఖ వీరులందరినీ నిలువరిస్తాడు. జరాసంధుడు పగతో కర్ణుని ద్వంద్వ యుద్ధానికి ఆహ్వానిస్తాడు. ఓడి 'మాలిని' నగరాన్ని బహూకరిస్తాడు. ఇది కవిత్రయ భారత గాథ. కానీ విజయాత్రేయ... జరాసంధుడు కర్ణునితో స్నేహం కోరి మగధకు ఆహ్వానించినట్లు, దుర్యోధనుడు సమ్మతించి, పరస్పరం ఆతిథ్యం ఇచ్చిపుచ్చుకొన్నట్లు రచించారు.

మగధకు రండు, మా యతిథిమందిర గౌరవమంది కొండు నీ
యగణిత శౌర్య సాహస మహార్ణవ భీషణ ఘోషణాలు ఠీ
విగ సమరమ్ము సల్ప రణ వేదిక సిద్ధము సేయువాడ రా
బిగువుల పిల్పు కాదనక వేగిరమే యరుదేరగా వలెన్.
- ప్రతిగా దుర్యోధనుడు...
పిలువగా నుంటి మేము మిమ్ములను హస్తి
పురికి - ముందుగా మీరలా చరణ సేతు
రటులనే యగుగాక యాహ్వానితులుగ
రాగలము గాక తమ గిరివ్రజపురమ్ము! - అంటాడు.

కలుగోట్ల విజయాత్రేయ శైలి సరళం. ఆ విషయాన్ని తమ పీఠికలో ప్రకటించారు కూడ. పది మందికీ కావ్యం చేరాలనే కోరికతో కొంత స్వతంత్రించి రచన చేసినట్టు చెప్పుకున్నారు.

'కౌంతేయుడు' తొలి అంకం. ఇందులో 'కుంతీ నూర్యుల' వివాదం సామాజిక నీతి నియమాల నేపథ్యంలో చక్కగా నడిపారు విజయాత్రేయ. చివరికి మానవ సంకల్పానికి దైవం దాసోహమంటుందని సూర్యునితో పలికిస్తారు.

మంత్రబద్ధమ్ము మా యస్వతంత్ర జీవి
తమ్ము - దానిదాటంగ నేదారి లేదు
తప్పదొప్పుకొనకిట నీకెప్పగిదిని
కన్నెతనమున కొక లోటు కలుగదబల!

'కర్ణుని' ప్రసవించడాన్ని కూడ దయార్ద్రంగా చిత్రించారు విజయాత్రేయ. ఈ ఘట్టం చదివేటప్పుడు 'కరుణశ్రీ - కుంతీకుమారి' పెట్టియలోన... తప్పక జ్ఞాపకం వస్తుంది. ఈ ఖండిక కర్ణుడులోని ఈ ఘట్టానికి ప్రేరణగా నిలిచిందనిపిస్తుంది. కుంతి కర్ణుని పెట్టెలో పెట్టి నదిలో విడవడం ఆర్ద్రంగా సాగుతుంది. ఆమె బాలెంత తనం గురించి ప్రత్యేక ప్రస్తావన చేశారు విజయాత్రేయ.

చిన్ని బాలెంతరాలికి నెన్నడుమున
బిగువు నడికట్టు లేదని వగచువారు,
పచ్చి పాదాలు నీటిలోపలికి దించె
నంచు చింతించు వారు లేరైరి నాడు!

'రాధేయుడు' ఘట్టంలో ద్రోణుడు బ్రహ్మాస్త్రం నేర్పడానికి తిరస్కరించినప్పుడు కర్ణుని మనసులోని భావ సంచలనాన్ని కవి చక్కగా ఆవిష్కరించారు. సూతులు కూడా మానవులేనని, విప్రుల ఆధిపత్యం వల్ల వారికి అన్యాయం జరిగిందని, రాజులు దాన్ని ఆమోదించారని కవి తేటతెల్లం చేశారు.

సూతుడైనంత మానవ జాతి కాద
స్వార్థ పరిపూర్ణ పక్ష విప్రాధిపత్య
దుర్వినీతి సాహంకార ధోరణులవి
పిచ్చి రాజులు తలలూచి మెచ్చినారు.

అంగరాజుగా పట్టాభిషిక్తుడైనప్పుడు తనను తాను దుర్యోధనునికి సంపూర్ణంగా స్నేహితుని చేసుకున్నాడు. కవి ఈ సమయంలో కర్ణుని చూపిన తీరు చెప్పుకోదగినది.

పదుగురి ముందు మూర్ధమును వాల్చక తప్పని పాడు వేళ స
మ్మదమున రాజ్యమిచ్చి తను భూమిపుజేసిన రేని స్నేహ సౌ
హృద సుకుమార భావ రసహేలకు నంజలి పట్టినాడు నె
మ్మది పులకింప కర్ణుడతి మానుష దుర్విధి ధిక్కరించుచున్.

'నెరదాత'గా పేరుపొందిన కర్ణుని సూర్యుడు వారించినా వినకుండా ఇంద్రునికి కవచకుండలాలు దానం చేసిన మహోన్నత కీర్తిని విజయాత్రేయ చిత్రించిన తీరును పరిశీలించండి.

"ఈ యున్నతి చాలు నాకు జనమోర్వని గొప్పలు కోరనెప్పుడున్' అని స్పష్టం చేస్తాడు. సూర్యుడు అలా హెచ్చరించడం - వాత్సల్యపు మోజు చంపుకొనజాలని మీ మమకార మాధురీ లౌల్యమెగాని - అని తేటతెల్లం చేస్తాడు. ఇంద్రుడంతటివాడు - 'చేయిచాచనెటుగాదను వాడ ననూహ్యమెంతకున్' అని త్రోసిపుచ్చుతాడు.

ఇంతటి వారు లేడని మహిన్ మరి నింగి నగార మ్రోగు కొం
డంతటి యర్జునుండు నఖిలాస్త్ర విదుండు జగద్విజేత గె
ల్పింతకు సందియమ్ము కలిగించిన దింద్రున కన్నచాలు గ
ర్వింతును విశ్వవీధి విహరించిన బాహుబల ప్రసిద్ధికిన్.

'జాషువా' తన ఖండ కావ్యాలలో 'భారత వీరుడు' పేరుతో రెండుసార్లు కర్ణుని గురించి రచించారు. ఆయన దృష్టిలో భారత వీరుడనే పేరు మరొకరికి వర్తించదేమో! భారత పాత్రలలో ఆయన ప్రముఖంగా రచించిన వారు ఇద్దరే. ఒకరు గంగా సూనుడు, మరొకరు గంగా యానుడు.

కర్ణుని గురించి 'జాషువా' అభిప్రాయాలను విజయాత్రేయ చదివి ఉంటారు. అందుకే కొన్ని సందర్భాలలో నిష్కర్షగా తన అభిప్రాయాలు వెలిబుచ్చారు. అందుకు నాటకీయత జోడించారు.

ఈ కవచంబు గుండలములీయకు మల్లదె దొంగబాపడై
నాకవిభుండు వచ్చెడిని నాయనుగుం గొడుకా! యటంచు మ
ర్త్యాకృతి నుండి వల్కెడు సహస్కరు నింగని నవ్వి యవ్వియే
పోకడ పెట్టు నీ సుగుణమున్నుతియింప దరంబె! భానుజా!
(జాషువా...)

'ప్రజ్ఞాశాలి' గ కర్ణుని విజయాత్రేయ చూపిన విధానం పరికింపదగినది. శ్రీకృష్ణుడు పాండవ పక్షపాతంతో - పాండవ పక్షం వహించమని కోరిన సందర్భంలో...

హా! వినరాని వింత మరియాదలు వింటిని - రామరామ, నీ
భావికి కోటి దండములు - పావని ద్రోవది కే కళంక మా
నీ వివరాల నీటులిక నీ పరిశీలన లేనితీరు సం
భావన సల్పలేను! పెడవాదనతో పని యేమి నాకిటన్!

ఇదే అంశాన్ని 'జాషువా' రచించిన తీరు విజయాత్రేయకు స్ఫూర్తినిచ్చిందేమోననిపిస్తుంది.

ఒక పాంచాలికి భర్తలేవురని మర్త్యుల్‌గూడి మాటాడు వా
డుకయే కర్ణకఠోరమై మసలుచుండున్ డెందమందట్టివా
నికి నా కారవ భర్తృనామము ధరన్నిర్మింపకంచు న్మురా
రికి వాక్రుచ్చి, యశంబు జాటవె ధరిత్రీ మండలిన్ భానుజా!
(జాషువా)

'ఉపజ్ఞాశీలి'గా కర్ణుని సౌజన్యాన్ని విజయాత్రేయ కరుణ రసస్ఫోరకంగా చిత్రించారు. కుంతి కర్ణుని కలిసి తాను తల్లినని, పాండవ పక్షం వహించమని కోరినప్పుడు అతి నున్నితంగా తిరస్కరించి, ఆమె కోరకుండానే అర్జునుడిని తప్ప మరెవరినీ చంపనని మాట ఇస్తాడు.

ఈ మురిపాలు, ముచ్చటలు, నేదియు నెక్కడ లోటురాక, వే
నోముల పంటగా దలచి, నూరులు వేల విధాల దీర్చె, మా
రాములు, గోములన్నియును రాధ, ప్రియమ్ముగ బుజ్జగించి, నీ
వే మరి రాధలో మధుర వీచికవై విరబూచియుంటివో!

అంపశయ్యపై పడి ఉన్న భీష్ముని దగ్గరకు పోయి నమస్కరించి పరామర్శించిన 'వినయ శిఖరంగా' కర్ణుడు భాసిస్తాడు. భీష్ముడు కర్ణుడు మనను విప్పి మాట్లాడుకోవడాన్ని వివరంగా చిత్రించారు విజయాత్రేయ.

'మేలుకీడు లెన్ననే రాదు... మేధావి యెవడు గాని' అని భీష్ముడు ఊరడింపుగా పలుకుతాడు. ధైర్యం చెబుతాడు. దుర్యోధనుడు, ధర్మరాజు ఇద్దరికన్న మిన్నయైన సౌశీల్యం గలవాడు కనుకనే భీష్ముడు కర్ణునితో ఇద్దరి గురించి విమర్శ చేసినట్లు చిత్రించాడు విజయాత్రేయ.

జూదపు పిచ్చి యొక్కనిది! జూదములో సరివారి గెల్చు సం
పాదన పిచ్చి యొక్కనిది! వద్దని జూదము త్రోసిపుచ్చి పో
రాదను పిచ్చి యొక్కనిది! రాజసపున్ పగ విస్మరించనే
రాదను పిచ్చి యొక్కనిది! రాచకులానికి మేలు కల్గునే!...

అని తన మనస్సును ఆవిష్కరిస్తాడు భీష్ముడు.

ఆ తర్వాత 'కర్ణుడు' సర్వసైన్యాధిపతిగా 'కరుచమూనేత' కావడం... మరణించడం తెలిసిన వివరమే!

తాను గురువుగా భావించే డా॥ నండూరి రామకృష్ణమాచార్య కోరిక మేరకు దాదాపు ఐదు సంవత్సరాలు పరిశ్రమించి విజయాత్రేయ చేసిన కృతి ఇది.

మానవజాతి మనుగడకు దోహదం చేసే మహా ఇతిహాసం మహాభారతం నుండి 'కర్ణుడి'ని మాత్రమే మనకు చూపే కృతి ఇది.

ప్రజ్ఞా వికాసానికి కులము అడ్డు కారాదని 'కవి' కర్ణుని పాత్ర ద్వారా తెలియజెప్పారు. దానినెవరూ ఆపలేరని నొక్కి చెప్పారు.

మోసపోతున్న ఆధునిక యువతులకు గొప్ప మార్గ దర్శనం చేస్తుంది ఇందులోని కుంతి పాత్ర.

ధర్మ పాలన, స్నేహ ధర్మ పాలన రెండింటి మీద అసిధారావ్రతం చేసి త్యాగశీలతకు పెద్దపీట వేసిన ఇతివృత్తం కర్ణుడిది.

దాతృత్వ నియమాన్ని పాటించిన కర్ణుని జీవితం - నియమ నిబంధనలతో జీవితాన్ని ఎలా గడపాలో సూచిస్తుంది.

కృతజ్ఞతా భావనతో మెలగడం సమాజంలో ఎటువంటి బంధాలకు బలాన్నిస్తుందో... తద్వారా మనుషులు పొందగల మేలేమిటో ఈ కావ్యం తెలియజేస్తుంది.

కుటుంబ సంబంధాలు ఎంత సంక్లిష్టంగా ఉండగలవో... అలాగే ప్రభుత... రాజకీయాలు ఎంత స్వార్థ పూరితాలో... ఆ చట్రంలో ఎంత కుటిలతకు చోటున్నదో... ఆ స్థితిలో సౌశీల్యంతో ఎలా మెలగాలో అన్న లౌకిక జ్ఞానం ఈ కావ్యం తెలియజేస్తుంది.

విధి బలీయమని తెలిసి కూడ తన కర్తవ్యాన్ని శక్తి వంచన లేకుండా నిర్వర్తించిన కర్ణుడు, ఇతర పాత్రలు ఆధునిక యువతకు స్ఫూర్తి కేంద్రాలు.

ఎన్నో రకాల లౌల్యాలు మనిషిని లొంగదీయడానికి చేసే ప్రయత్నాలు - అయినా చెక్కుచెదరని వ్యక్తిత్వాన్ని ఎలా నిలుపుకోవాలో... కర్ణుడు కావ్యం ద్వారా 'కవితా కిరీటి' కలుగోట్ల విజయాత్రేయ మనకు విశదం చేశారు.

యువత ఈ కావ్యాన్ని అనుశీలించి జ్ఞానవంతులు కావాలని ఆశిస్తున్నాను.

॥ జై తెలుగుతల్లి! ॥

ఉపయుక్త గ్రంథాలు :

1) కర్నూలు జిల్లా కవితరంగిణి - వైద్యం వేంకటేశ్వరాచార్యులు
2) త్రయీ - గొట్టుముక్కల సుబ్రహ్మణ్య శాస్త్రి
3) దయానంద ప్రబంధము - మాచిరాజు శివరామరాజు
4) స్వాతంత్ర్య వీరుడు - పాణ్యం నరసరామయ్య
5) శృంగార ప్రభావతి - విరివింటి వేంకటరమణ శర్మ
6) వృక్ష విలాపము - దుద్దేల పుల్లయ్య
7) దేశం కోసం - కిలారు చిన్న సుబ్బరాయుడు
8) శేషప్రభ, శంకర శతకం - తాటిమాను నారాయణరెడ్డి
9) ధర్మ దండం - డా॥ కోడూరు విష్ణునందన్
10) కర్ణుడు - కలుగోట్ల విజయాత్రేయ
11) కలుగోట్ల విజయాత్రేయ కవిత్వం - పరిశీలన - డా॥ జగర్లపూడి శ్యామసుందర శాస్త్రి
12) కుంతీకుమారి - కరుణశ్రీ
13) భారత వీరుడు - గుర్రం జాషువా
14) శ్రీ మదాంధ్ర మహాభారతం - కవిత్రయము (తి.తి.దే.)

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 2 (2), February - 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

మాసంపత్ కుమార్ 'వ్యక్తిత్వం'

– టి. దేవరాజ్, పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ, రాజధాని కళాశాల, చెన్నై, తమిళనాడు.

ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ గారితో రెండు దశాబ్దాల పరిచయం నాది. 2002లో ఎం.ఎ విద్యార్థిగా మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో చేరి మాడభూషి గారి పాఠాలు విన్నాను. పాఠాలతోపాటు జీవితానికి సంబంధించిన బ్రతుకుదెరువు పాఠాలను నేర్పారు. తన అనుభవాలను, అనుభూతులను మాతో పంచుకునేవారు. వారు చెప్పిన ప్రతిమాట ప్రతి ఒక్కరిని ఆలోచింపజేసేదిగా ఉండేది. మహాప్రస్థానంలోని ప్రతి కవితను అనర్గళంగా పుస్తకం చూడకుండా వినిపించేవారు. మహాప్రస్థానంలోని కవితలను చెబుతుంటే సమాజానికి, సాహిత్యానికి ఇంత సంబంధం ఉందా అని ఆశ్చర్యపోయే వాడిని ఇంతేకాదు వారు ఏ పాఠం చెప్పినా అది ఎంతో వినసొంపుగా ఉండేది. అలా వారి దగ్గర జర్నలిజం పాఠాలు, అనువాద సాహిత్యం, భాషాశాస్త్రానికి సంబంధించిన పాఠాలు ఎంతో రసవత్తరంగా నేర్పారు. ఆ సాహిత్య పరిచయమే వారిమీద అమితమైన అభిమానాన్ని పెంపొందించుకునేటట్లు చేసింది. ఇప్పటి వరకు చెప్పిందంతా తరగతికి సంబంధించిన అంశాలే. మరో విషయం ఏమిటంటే నేను బి.ఎ హెచ్.ఇ.పి. వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో చదువుకొన్నాను. నా మిత్రుడు మానమ మునిరత్నం ప్రోత్సాహంతో ఎం.ఎ తెలుగులో చేరాను. బి.ఎ చదువుతున్నప్పుడు తెలుగు మీద అంతగా ఇష్టం ఉండేది కాదు. ఇష్టం ఉన్నా, కష్టం ఉన్నా తెలుగు పేపర్ కూడా పాస్ అవ్వాలి. ఎలాగో ఒకలాగ రాఘవేంద్ర గైడుతోను, బ్రిలియంట్ గైడుతోను సహవాసం చేసి పరీక్షకు రెండు మూడు రోజులు ముందు చదువుకొని పాస్ అయ్యేవాడిని. నేను బి.ఎ తెలుగు విద్యార్థిని కాదని ఇంతక మునుపుగానే చెప్పాను. మా ఎం.ఎ తరగతిలో చాలామంది బి.ఎ తెలుగు, బ్యాచులర్ ఆఫ్ ఓరియంటల్ లాంగ్వేజ్ చదివిన విద్యార్థులు తరగతి గదిలో ఉపాధ్యాయులు అడిగిన ప్రశ్నలకు ఎంతో ఉత్సాహంగా సమాధానాలు చెప్పేవారు. వారి ఉత్సాహాన్ని చూసి నేను నిరుత్సాహపడేవాన్ని మాడభూషిగారు ఇదంతా గమనించి నా నిరుత్సాహంలోని 'నిర్'ని తీసేసి ఉత్సాహపరిచారు. వెన్నుతట్టి ముందుకు నడవడానికి దారి చూపించారు. ఈ సన్నివేశం వారిమీద ఇంకా ఇష్టాన్ని పెంచింది.

ఇదిలా ఉండగా మధ్యాహ్నం ఒకటి రెండు గంటల మధ్యలో దేవరాజ్ తిన్నావా అనేమాట నన్ను కలవర పెట్టింది. ఈ మాట నన్ను ఒక్కరినే కాదు. నాతోపాటు దీనంగా ఉండే ప్రతి విద్యార్థిని, విద్యార్థులను అడిగేవారు. అందరికీ అయనంటే ఇష్టం. నాకు మరీ ఇష్టం. మాడభూషి గారంటే ఇష్టమేకాని వారి దగ్గర ఏ విషయాన్ని నిర్భయంగా చెప్పే ధైర్యవంతున్ని కాదు. నాకు కాస్త బిడియం, జంకు, కాస్త మొహమాటం. నా మనోభావాలను గ్రహించి నా ప్రతి కదలికను పసిగట్టి తాను తెచ్చుకున్న భోజనం కూడా నాకు ఇచ్చేవారు. ఇలాంటి సన్నివేశాలు మాడభూషిగారి దగ్గర మరీ చేరువయ్యేటట్లు చేశాయి. ఇలా గడుస్తున్న సమయంలో నా స్థిరనివాసాలను గురించి, నా ఆర్థిక పరిస్థితులను గురించి, నా కుటుంబ నేపథ్యం గురించి, ఎలాగో తెలుసుకున్నారు. అప్పటి నుంచి నా మీద ప్రత్యేక శ్రద్ధ చూపారు. ఏదో ఒకరోజు మాట సందర్భంగా మాట్లాడతుంటే మీ నాన్న ఏమి చేస్తారు? అని అడిగారు. మా నాన్న లేదుసార్ అన్నాను. గమ్మున అయిపోయారు. మీ అమ్మ ఏమి చేస్తుంటుంది అన్నారు. అమ్మకూడా లేదుసార్ అన్నాను. ఆ మాట చెప్పిన వెంటనే మాడభూషిగారి మనస్సు మూగపోయింది. కంఠం గద్గద స్వరం అయ్యింది. నా జీవితంలో నా గురించి తెలిసి ఇంతగా బాధపడిన మనిషి మా గురువు

మాడభూషి గారే. అప్పటి నుంచి నన్ను ఎంతో దగ్గరకు తీసుకునేవాడు. ఆర్థికంగా, హార్థికంగా సహాయం చేసేవారు. మొదటి సంవత్సరంలో చేరినప్పుడు ఫీజులు చెల్లించిన నేను మరలా ఆ మాటకే పోలేదు. మిగతా ఫీజులన్నీ వారే చూసుకున్నారు. బస్సు చార్జీలు ఇచ్చి నన్ను ఇంటికి పంపిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. వారు నివాసం ఉండిన చెన్నైలోని విల్లివాక్కం నగరంలో ప్రభుత్వ ఉచిత హాస్టల్ ఉండేది. నా మిత్రులందరూ అక్కడ ఉన్నారు. నాకు హాస్టల్ సీటు రాలేదుకాని హాస్టల్ వార్డన్‌తో మాట్లాడి నాతోపాటు ఎంతోమంది విద్యార్థులకు దాక్కోవడానికి అండదండగా ఉన్నారు. పేరుకు మాత్రమే హాస్టల్‌లో ఉన్నాము. నాతోపాటు వేలాయుధం, మునిరత్నం, ప్రసాద్, మునిశేఖర్, వెంకటేశ్, ఎ.మునిరత్నం ఇలా ఎంతో మందిని వారి ఇంటికి తీసుకెళ్లి భోజనం పెట్టేవారు. ఇలా ఎన్నోరోజులు జరిగాయి. ఎం.ఎ మధ్యలో జరిగిన విషయాలన్నీ ఎన్నో చెప్పాలని ఉంది. ఏది ఏమైనప్పటికీ నన్ను మనిషిగా బ్రతకడానికి బ్రతుకుదెరువు నేర్పించాడు. ఎం.ఎ పూర్తి చేసిన తరువాత ఎటు వెళ్లాలో తెలియని పరిస్థితుల్లో వారి దగ్గరే ఎం.ఫిల్ సీటు ఇచ్చారు. జంధ్యాల పాపయ్యశాస్త్రి 'పుష్పవిలాపం సామాజిక దృక్పథం' అనే అంశం మీద లఘుసిద్ధాంతాన్ని సమర్పించాను. నాతోపాటు నా పరిశోధనకు వారుకూడా శ్రమించారు. వారికి ఎంతో శ్రమ ఇచ్చాను. వారికి కోపం వస్తే మీరు ఎలా బ్రతుపోతారు? అని ఆవేధన చెందేవారు. అదేవారి కోపం. ఇంతకు మించి ఏమీ అనరు. ఎం.ఫిల్ పూర్తి చేసిన తరువాత ఎలా బ్రతకాలో తెలియలేదు. ఎలాగో ఒకలాగ పరోక్షంగా వారి సిఫారసు మేరకు ఒక ప్రైవేటు స్కూల్‌లో తెలుగు పండిట్‌గా చేరాను. అక్కడ చేరి మరలా పండిట్ ట్రైనింగ్ మహబూబ్ నగర్‌లో పూర్తి చేశాను. 2005వ సంవత్సరం ఎం.ఫిల్ పూర్తి చేయడంతో మాడభూషిగారితో పరిచయం తెగిపోయిందనుకున్నాను. నా మిత్రుల ద్వారా మాడభూషిగారు అప్పుడప్పుడు నన్ను అడుగుతున్నాడని విని సంతోషపడేవాన్ని. ఎలాగైనా మాడభూషిగారిని చూడాలని ఒకటిరెండు సార్లు చెన్నైవెళ్లి, తెలుగుశాఖలోనే కలిసాను. నేను ఎప్పుడు కలిసినా నా చేతికి ఒకబ్యాగో, ఒక పుస్తకమో, ఒక పెన్నో ఏదో ఒకటి ఇస్తూ బస్సు చార్జీకూడా ఇచ్చి పంపేవారు.

2009వ సంవత్సరం మాడభూషిగారు తెలుగుశాఖ అధ్యక్షులయ్యారు. ఆ సమయంలో తెలుగుశాఖలో విపరీతమైన తెలుగు కార్యక్రమాలు జరిగాయి. అన్ని కార్యక్రమాల్లో నేను కలుసుకోలేదుగాని కొన్ని కార్యక్రమాల్లో మాత్రం కలుసుకునేవాడిని. మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగుశాఖకి పుర ప్రముఖులంతా వచ్చేవారు. ఎన్నో జాతీయ, అంతర్జాతీయ సదస్సులతో పాటు ఉగాది సంబరాలు, కవి సమ్మేళనాలు, ధర్మనిధి ఉపన్యాసాలు, పుస్తకావిష్కరణ సభలు జరిపేవారు. అప్పుడు నా మిత్రులు మునిరత్నం, ప్రసాద్, వేలాయుధంతో అబ్బా మనసారు ఇన్ని కార్యక్రమాలు ఎలా జరుపుతున్నారని ఆశ్యర్యాన్ని వ్యక్తం చేశాను. అప్పటికే నా ముగ్గురు మిత్రులు డాక్టరేట్ పట్టా పొంది ఉన్నారు. నాకు కూడా పి.హెచ్.డి చేయాలని ఉంది అనే విషయాన్ని వారితో చెప్పాను. వారు నువ్వు పి.హెచ్.డి చేస్తే మనసార్ మీదనే పి.హెచ్.డి చేయవచ్చన్నారు. నేను నవ్వి ఊరకున్నాను. వాళ్లు నవ్వటం కాదు నిజంగానే చెబుతున్నాం అన్నారు. పి.హెచ్.డి సీటుకోసం నా మిత్రుడు మునిరత్నంతో పాటు సార్ దగ్గరికి వెళ్ళాను. పి.హెచ్.డి చేయాలని ఉంది సార్ అని అన్నాను. ఆ మాట విన్నంతనే మాడభూషిగారు నా దగ్గర సీట్లు లేదునాన్న నువ్వు ప్రసిడెన్సీ కళాశాలలో మురళీగారి పర్యవేక్షణలో చేయి నేను చెబుతానని చెప్పి పి.హెచ్.డి సీటు ఇప్పించారు. పి.హెచ్.డి టాపిక్ ఎన్నుకోవడంలో ఎన్నో తర్జనభర్జనలు పడ్డాను. ముందుగా తెలుగు తమిళ పొడుపు కథలు' మీద పరిశోధన చేయాలని తలపించాను. కొన్ని రోజులు ఇలా గడిచింది. మరలా వేరే అంశం మీద నా పి.హెచ్.డి టాపిక్ మారింది. ఇదిలా ఉండగా నా పి.హెచ్.డి పర్యవేక్షకులు మామిడి మురళీ గారు సలహా మేరకు మాడభూషి గారి రచనల మీద చేస్తే

బాగుంటుందని సూచన ప్రాయకంగా చెప్పారు. మాడభూషి గారి మీద పి.హెచ్.డి చేయాలనే తపన ఇంకా నన్ను ముందుకు తీసుకెళ్ళింది. పి.హెచ్.డి మాడభూషి గారి మీద ఏ కోణంలో చేయాలి, ఎలా చేయాలి అని ఆలోచనల్లో పడ్డాను. అప్పటికే మాడభూషిగారి పర్యవేక్షణలో 28 పి.హెచ్.డిలు, 79 ఎం.ఫిల్‌లు సమర్పించి ఉన్నారు. లెక్కకు లేనన్నీ తెలుగు కార్య క్రమాలు, సదస్సులు, సమావేశాలు జరిగి ఉన్నాయి. మాడభూషి సంపత్ కుమార్ గారు ఇన్ని పనులు ఉన్నా మద్రాసు విశ్వవిద్యాలయంలో డి.లిట్ పట్టా అందుకుని ఉన్నారు. ఎన్నో పదవునలు అలంకరించి ఆ పదవులకు వన్నె తెచ్చి ఉన్నారు. ఎన్నో పురస్కారాలు, అవార్డులు, బిరుదులు, దేశ విదేశాలోలల్ల పర్యటించి తెలుగుకోసం నిర్విరామంగా కృషి చేసి ఉన్నారు. తెలుగు లిపికి అంతర్జాతీయ ఖ్యాతి తెచ్చి ఉన్నారు. ఎన్నో సంపాద కత్వాలను, అనువాద రచనలను, చేసి ఉన్నారు. మూడు వందలకు పైగా వివిధ అంశాలపైన అమూల్యమైన వ్యాసాలు రాసి ఉన్నారు. పర్యటనలు చేసి ఉన్నారు. తెలుగు బుక్ ఆఫ్ రికార్డు, వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డులలో వాసికెక్కి ఉన్నారు. ఎన్నో కవితా సంపుటాలు వెలువ రించిన మాడభూషి ఆచార్యులు మాత్రమే కాదు కవి, విమర్శకులు, పర్యవేక్షకులు, జర్నలిష్టు, అనువాదకుడు, ప్రముఖ సాహితీవేత్త, భాషాబోధకుడు, సహృదయత ఉన్న సాత్వికభావి, మంచి మనిషి, మృదుస్వభావి, తెలుగు కోసం నిరంతరం తన జీవితాన్ని అంకితం చేస్తున్న ధన్యజీవి. ఇలా ఎన్నైనా చెప్పుకోవచ్చు. ఇలాంటి ఉన్నత మైన వ్యక్తిత్వం కలిగిన మాడభూషి సంపత్‌కుమార్ గారి మీద పరిశోధన చేయడం నా అదృష్టం. వారి వ్యక్తిత్వాన్ని వారి సాహిత్యాన్ని వేరు చేసి చూడలేం. వారి వ్యక్తిత్వం ఎలాంటిదో వారి రచనలు కూడా అలాంటివే. మాడభూషి గారిది ఉన్నతమైన వ్యక్తిత్వం కాబట్టే శిష్యులందరం కలిసి వారిపేరు మీదుగా ధర్మనిధి ఉపన్యాసం ఏర్పాటుచేశాం. వారీమీద, వారి రచనల మీద అంతర్జాతీయ సదస్సు జరిపాం. వారి రచనలమీద పరిశోధనలు జరుగుతూ ఉ న్నాయి. ప్రతి సంవత్సరం మడభూషిగారు కొత్త కవితా సంపుటాన్ని వెలువరిస్తూనే ఉన్నారు. తెలుగుకోసం పాటు పడుతున్న మాడభూషి సంపత్‌కుమర్ గారు ప్రతిరోజు ఏదో ఒక దినపత్రికలోనో, వార పత్రికలోనో, పక్ష పత్రిక లోనూ, మాస పత్రికలోనో, ద్వైమాస పత్రికలోనో, త్రైమాస పత్రికలోనో వారి గొంతు తెలుగువాళ్ల కోసం వినిపిస్తూనే ఉంటారు. పదవి విరమణ తదనంతరం కూడా 'మాడభూషి సాహిత్య కళాపరిషత్' అధ్యక్షుడుగా, తెలుగులో కేంద్రసాహిత్య అకాడమీ అవార్డులు పొందిన వారిమీద ప్రత్యేక ఉపన్యాసాలు ఇప్పిస్తున్నారు. వాటన్నిం టినీ పుస్తక రూపంలో భద్రపరచడానికి పరితపిస్తున్నారు. ఏ కార్యక్రమం జరిపినా ప్రపంచం నలుమూలలా తెలియాలనే సదుద్ధేశంతో రికార్డు రూపంలో 'యూ టూబ్, ఫేస్‌బుక్‌లలో వెలువరిస్తున్నారు. ఇంతముందుగా చెప్పినట్లు మాడభూషిగారి జీవితాన్ని, వారి కవిత్వాన్ని, వారి వ్యక్తిత్వాన్ని వేరు చేసి చూడలేం అన్నదే అక్షర సత్యం. ఇలాంటి మహోన్నతమైన వ్యక్తిత్వం కలిగిన మాడభూషి గారు తెలుగువారికే కాదు మన భారతీయులకే గర్వ కారణం అనడంలో సందేహం లేదు.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 2 (2), February - 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

The Grouwth of Pharma Enterpreneurship During the Post - Liberalisation Period in Hyderabad

- Dr. Doneti Sivaji
Assistant Professor, Department of History & Archaeology,
NEHU-Tura, Meghalaya.

- Dr. Thrinadha Rao Bandaru
Assistant Professor, Department of Management,
NEHU-Tura , Meghalaya

- Dr. Seelam Srinivasa Rao
Assistant professor, Dept. of History,
SSSUHE, Kalaburagi.

After the 1990s, Hyderabad became a fruitful destiny, and doing business in pharma became a promising sector for technocrats to start their entrepreneurial career. During post-liberalization, Hyderabad city provided new opportunities in bulk-pharma and retail-pharma. Many MNC companies also focused on Hyderabad to test their fate in the pharmaceutical business. Dr. Anji Reddy set a great example in exploring profits in bulk pharma. This paper attempts to enumerate the business history of some noteworthy entrepreneurs in the pharma industry in Hyderabad and analyze the trends and factors in the pharma business in the post-liberalization period. The study adopted the qualitative data analysis method to analyze the data. By using the personal interview method, information and opinions were taken from entrepreneurs as primary data. Published and unpublished papers, referred business magazines, biographies, and internet sources were considered for gathering relevant secondary data.

Key Words : Post Liberalization, Entrepreneurship, Bulk Pharma, Retail Pharma.

Introduction :

The post-liberalization period has witnessed tremendous changes in the Indian economy. The services turned into a business in the healthcare sector. The nature of the services and infrastructure facilities provided by the healthcare sector had transformed into profit-oriented. Consumers demanded health care as a means to achieve a more extensive stock of 'health capital.' The demand for health is increased tremendously, unlike most other goods. People started allocating their resources primarily to health rather than other things. These circumstances transformed service-oriented hospitals into business-oriented health care hubs. The mentioned developments tremendously impacted the pharma sector, allowing the growth of new entrants in the pharma business. So Hyderabad became a fruitful destiny for international business for them. The objectives of this study are to examine the growth of Entrepreneurship in the Pharma industry and analyze the trends and entrepreneurship promotion factors in the Pharma industry given the post-liberalization period. The study tried to explain how the city Hyderabad became a testing ground for the new entrants and limited the scope of the study to Hyderabad city.

The study adopted the qualitative data analysis method to analyze the data. The personal interview method was used to collect the necessary information and took entrepreneurs' opinions as primary data. Published and un-

published papers, referred business magazines, biographies, and internet sources were considered for gathering relevant secondary data.

In India, entrepreneurship in the pharma sector has been traced to establishing Indian Drugs and Pharmaceuticals Limited (IDPL) in Hyderabad. IDPL has found in 1960 and some other centers for achieving India's march towards self-sufficiency and self-reliance in drugs and pharmaceuticals. The IDPL in Hyderabad focused primarily on research and development (R&D) activities. It played a pioneering infrastructural role in the growth of the Indian drug industry base.

The companies contributed significantly in manufacturing essential and lifesaving drugs as a narrow spectrum. Some of the drugs are Antibiotics, Tetracycline, Antifungal, Sulphonamides, Vitamins, Analgesics, Antihypertensive, Diuretics, Hypnotics, Antimalarial, and Antimalarial Fluoroquinolones. The IDPL at Hyderabad base had three patents on drugs related to Diarrhea, Arthritis, Depression, and Muscle relaxants. Nevertheless, IDPL gave a tremendous boost to indigenous efforts in the private sector of the pharmaceutical industry. Since the synthetic drug plant of IDPL has been located in Hyderabad, the city has developed into the main bulk drug manufacturing center in the country.

Growth of Entrepreneurs in Bulk Pharma:

